ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16 కడప

ఆదివారం 31 డిసెంబరు 2017



సోమశిల వెనుకజలాల్లో మత్స్యశాఖ అధికారుల

దాడులు

- రెండు బస్తాల ఎండుచేపలు
- పది అలివి వలలు స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




సోమశిల వెనుకజలాల్లో స్వాధీనం చేసుకున్న వలలతో అధికారులు

గత వైభవానికి ప్రతీక

గండికోట




డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు



1) తాగి వాహనం నడిపిన వారు
2) లైసెన్సు లేని కేసులు
3) తాగి వాహనం నడిపిన వారికి శిక్ష

చోరీలు... నేరాలు



1) చోరీలు 2) హత్యలు
3) ఘాత నేరాలు 4) వైట్ కాలర్ నేరాలు

ఎర్రచందనం స్మగ్లర్లపై


ఉక్కుపాదం




- రోడ్డు ప్రమాదాల నివారణలో సత్ఫలితాలు
- కనుమరుగైన ఫ్యాక్షన్ నేరాలు
- అసాంఘిక కార్యకలాపాలపై నిఘా
- పరివర్తన పేరుతో మట్కా మహమ్మారిని తరిమేందుకు ప్రత్యేక కార్యాచరణ
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌కు విశేష స్పందన
- గల్ఫ్ బాధితులకు అండగా బంధం
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ అట్టాడ బాబూజీ

పనిభారం, సిబ్బంది శ్రమ, నూతన పద్ధతులతో ఈ ఏడాది నేర నియంత్రణ సాగించాం. ఎల్‌హెచ్‌ఎంస్ యాప్ ద్వారా రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగను పట్టుకోవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డీజీపీ సాంబశివరావు కడప పోలీసుశాఖను అభినందించడం సంతోషకరం. 2017 సంవత్సరం కడప జిల్లా ప్రజలు ప్రశాంతంగా జీవించేలా పోలీసు యంత్రాంగం గట్టి కృషి చేసింది. ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపి పలువురు అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసి 22 మందిపై పీడీ యాక్టు నమోదు చేశాం. సాంకేతికతను అందిపుచ్చుకుని వినూత్న కార్యక్రమాలతో అటు పోలీసు శాఖకు, ఇటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా పోలీసులు విధులు నిర్వహించారు. జిల్లాలో నేరాలను నియంత్రించడంతో పాటు రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి 2017కు సంబంధించిన నేరాల వివరాలను వెల్లడించారు.

పీడీ యాక్ట్ కేసుల నమోదు



రోడ్డు ప్రమాదాలు



1) రోడ్డు ప్రమాదాలు
2) గాయపడిన వారు
3) ప్రమాదాల్లో మృతుల సంఖ్య

3

విద్యుత్తు బకాయిలు

రూ.235 కోట్లు

వసూళ్లకు విద్యుత్ శాఖ కొరడా

- సరఫరా నిలిపివేతకు చర్యలు
- ప్రభుత్వ కార్యాలయాలకూ షాక్
- స్థానిక సంస్థలు.. ప్రభుత్వ కార్యాలయాల వాటా రూ.215 కోట్లు

6



కరెంటు నిలిపివేతకు గురైన రిజిస్ట్రేషన్ కార్యాలయం

మొండి బకాయిల వసూళ్లపై విద్యుత్ శాఖ కొరడా ఝుళిపిస్తోంది. బిల్లులు చెల్లించని కనెక్షన్‌లకు సరఫరా నిలిపివేసే చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో ప్రభుత్వ కార్యాలయాలకూ మినహాయింపు ఇవ్వకపోవడం గమనార్హం. నవంబరు 30 నాటికి జిల్లాలో (కడప సర్కిల్) రూ.235 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో స్థానికసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల వాటా రూ.215 కోట్లు ఉందంటే నమ్మశక్యం కాకపోయినా పచ్చినిజం. బకాయిలు పేరుకుపోవడం వల్ల ఆర్థికంగా సంస్థకు అపార నష్టం వాటిల్లుతోంది. గృహావసరాల విద్యుత్ బిల్లులపై కన్నెర్ర చేసే విద్యుత్‌శాఖ ఇంత వరకూ ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల బకాయిలపై ఉదాసీనతగా వ్యవహరిస్తూ వచ్చింది. అయితే సంస్థ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇప్పటికే జిల్లాలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేసి కఠిన చర్యల హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో అన్ని విభాగాలకు సంబంధించి 10,07,886 కనెక్షన్‌లున్నాయి. ఇందులో 1,51,764 వ్యవసాయ కనెక్షన్‌లు, 7,71940 గృహావసర కనెక్షన్‌లున్నాయి. మొత్తం కనెక్షన్‌లకు సంబంధించి రోజుకు 10 నుంచి 11 మిలియన్ యూనిట్ల వినియోగమవుతుంది. అయితే ఇప్పటికే విద్యుత్ సరఫరా నష్టం, చౌర్యం 8.04 శాతానికి చేరుకుని సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గోరుచుట్టుపై రోకలిపోటుగా బకాయిలు మరింత ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి.

వివరాలు 7లో

బాల్ బ్యాడ్మింటన్ విజేత

ఎస్ఆర్ఎం యూనివర్శిటీ

తమిళనాడు

- రన్నర్స్‌గా ఆంధ్ర



పండుగ సందడి

కోదండరామాలయాల్లో ధనుర్మాసపూజలు



ధనుర్మాసం సందర్భంగా రామునికి పూజలుచేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు,డిసెంబరు 30: కోదండరామాలయాల్లో ధనుర్మాసపూజలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం రైల్వేకోడూరు పట్టణంలోని పొట్టిశ్రీరాములువీధిలో శ్రీకన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో కోదండరామ, సీతాదేవి, లక్ష్మణులు వెలసిఉన్నారు. ఎన్నోఏళ్ల కిందట కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలోనే కుడివైపులో చిన్న రామాలయాన్ని నిర్మాణంచేశారు. ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాల్లో ప్రత్యేకంగా పూజలు చేస్తారు. దేవుని కల్యాణం, వసంతోత్సవం, పట్టాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాముని దేవాలయం కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలోనే ఉండడం విశేషం. ధనుర్మాసపూజలు వైభవంగా చేస్తారు. ప్రతిరోజు ఉదయం నగరసంకీర్తనలు చేస్తున్నారు. ప్రతిరోజు ప్రత్యేకంగా స్వామివారిని అలంకరిస్తారు. పూర్వీకులు కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని నిర్మించారు. అలాగే ఆలయంలోనే కోదండరాముని నిర్మాణంచేశారు. ఒకేఆలయంలోనే కన్యకాపరమేశ్వరిదేవి, రాముడు ఉండడం విశేషం.

పేద ప్రజల సంక్షేమం కోసమే జన్మభూమి

- అధికారులు ప్రత్యేక శ్రద్ధతో విజయవంతం చేయాలి: ఇన్‌చార్జ్ మంత్రి
- 10 అంశాలపై ప్రత్యేక ప్రాధాన్యతలు - కలెక్టర్ బాబూరావునాయుడు





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

కడప కలెక్టరేట్, డిసెంబరు 30: ఒక తపన, కల్పన, ఆలోచనా స్ఫూర్తితో, ప్రజలపై ప్రేమాభిమానాలతో, అధికారులు ఇష్టంగా పనిచేస్తే తప్పకుండా మంచి ఫలితాలు రాబట్టవచ్చు, జన్మభూమి కార్యక్రమాన్ని అదే స్ఫూర్తితో విజయవంతం చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బాబూరావునాయుడు అధికారులను కోరారు. పేద ప్రజల సంక్షేమం కోసం వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఐదవ విడత జన్మభూమి, మావూరు కార్యక్రమాలను మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకూ సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశ ప్రారంభంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయవాడ నుంచి టెలిఫోన్ ద్వారా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ముందుగా మంత్రి జిల్లాలోని అధికారులకు, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాన్ని పండుగ వాతావరణంగా గొప్పగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తేవాలని మంత్రి కోరారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అవసరమైన సమాచారంతో అధికారులు జన్మభూమి గ్రామసభలకు వెళ్లాలన్నారు. పింఛన్లు, రేషన్‌కార్డుల నిమిత్తం ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల జాబితాను ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం పంపుతోందన్నారు. ఆ జాబితాను ఆయా గ్రామసభల్లో ప్రజలకు తెలపాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఓడీఎఫ్‌లకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు అధిక ప్రాధాన్యతనిచ్చి వెంటనే చెల్లింపులు జరపాలన్నారు. జనవరి 2 నుంచి 11 వరకు గ్రామ పంచాయతీ వార్డు స్థాయిలో రోజూవారీ జన్మభూమి కార్యక్రమాలను చర్చించేందుకు పది అంశాలను మంత్రి సూచించారు. అందులో 2వ తేదీ సంక్షేమం, అభివృద్ధి, 3న ఆరోగ్యం, ఆనందం, 4న స్వచ్ఛాంధ్రప్రదేశ్, 5న విద్యావికాసం, 6న మౌలిక సదుపాయాలు, 7న సహజ వనరుల అభివృద్ధి, 8న వ్యవసాయ అనుబంధాల రంగాల అభివృద్ధి, 9న సుపరిపాలన, టెక్నాలజీ వినియోగం, 10న విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్, 11న ఆనందలహరి తదితర అంశాలపై అధికారులు రోజూవారీగా చర్చించి ప్రజలకు అందేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ బాబూరావునాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి, మావూరు కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఆస్తుల పంపిణీ, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

3న పులివెందులకు ముఖ్యమంత్రి

జన్మభూమి కార్యక్రమంలో భాగంగా జనవరి 3వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందుల నియోజకవర్గంలో పాల్గొంటారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జన్మభూమి కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించి విధులు సరిగా చేయని అధికారుల వివరాలు ఇంటెలిజెన్సీ ద్వారా నివేదికలు తెప్పించడం జరుగుతుందన్నారు. అలాంటి అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులందరూ అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు.

జనవరి 21, 22, 23న గండికోట ఉత్సవాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు గండికోట ఉత్సవాలు జనవరి నెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని టూరిజం రీజనల్ డైరెక్టర్ బి.గోపాల్, ఇన్‌ఛార్జ్ టూరిజం అధికారి విజయ్‌కుమార్‌లు సమావేశంలో అధికారులకు వివరించారు. గండికోట ఉత్సవాలు జిల్లా ఖ్యాతిని నలుదిశలా చాటే విధంగా జిల్లా ప్రజలు ఒక మంచి పండుగ వాతావరణంలో నిర్వహించుకునేందుకు వీలుగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గండికోట ఉత్సవాల నిమిత్తం వివిధ కమిటిలను చేపట్టే కార్యక్రమాలు తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టూరిజం రీజనల్ డైరెక్టర్ గోపాల్ అధికారులకు వివరించారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ జేసీ నాగేశ్వర్‌రావు, జేసీ-2 శివారెడ్డి, సీపీవో తిప్పేస్వామి, డీఆర్‌డీఏ, డ్వామా, పీడీలు, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పెన్షన్ భిక్షకాదు.. హక్కు...

- కొత్తపెన్షన్ విధానం వద్దు పాత పెన్షనే ముద్దు
- జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్ష,కార్యదర్శులు శివారెడ్డి, శ్రీనివాసులు





మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, శ్రీనివాసులు, హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రైల్వేకోడూరు,డిసెంబరు 30: పెన్షన్ ఉద్యోగుల హక్కు అని భిక్షకాదని, కొత్తపెన్షన్‌విధానాన్ని రద్దుచేసి, పాత విధానాన్ని అమలు చేయాలని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, శ్రీనివాసులు డిమాండుచేశారు. రైల్వేకోడూరు ఎన్జీవో హోంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని అనేకసార్లు విన్నవించినా ఫలితాలులేవని, ఇందుకు జనవరి 9వతేదీన ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులను వారు కోరారు. 2004నుంచి అమలవుతున్న కొత్త పెన్షన్‌విధానాన్ని వెంటనే రద్దుచేయకపోతే ఉద్యమాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పెన్షన్‌సాధనకమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు సాగుతాయన్నారు.

బ్రిటీష్‌వారి కాలంలో పెన్షన్ యాక్ట్ 1871 అమలులో ఉండేదని, అప్పుడు పెన్షన్‌అనేది ఒక సామాజిక బాధ్యతగ సౌకర్యంగా అమలులో ఉందన్నారు. 1952లో డిఫైన్డ్ బెనిఫిట్ పెన్షన్ నుంచి ట్రిపుల్‌బెనిఫిట్ స్కీం దాకా రావడానికి ఉద్యోగులు పడ్డకష్టాలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. తర్వాత పెన్షన్ పద్ధతి మరింత మెరుగై ఉద్యోగి చనిపోయిన తర్వాత అతని కుటుంబానికి కూడా పెన్షన్ ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టారన్నారు. మొట్టమొదటిసారి ఏఐఆర్ 1971లో ఎస్‌సీ 1409 కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తూ పెన్షన్ అనేది పెన్షనర్ ఆస్తిహక్కుఅని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం పెన్షన్‌రూల్సు లిబరలైజ్‌చేస్తు 31.3.1971 నుంచి అమలులోకి తీసుకునిరాగా డీఎస్.నకరా(ఫాదర్‌ఆఫ్‌పెన్షనర్స్) సుప్రీంకోర్టులో ఆర్టికల్ 32 కింద రిట్‌పిటీషన్‌దాఖలు చేశారని ఈ రిట్‌పిటీషన్‌పై 1982 డిసెంబర్ 17వ తేదీన డీఎస్ నకారా వర్సెస్ యూనియన్ ఆఫ్‌ఇండియా కేసులో అప్పటి చీఫ్ జస్టిస్ వైవీచంద్రచూడ్ నేతృత్వంలో నలుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పెన్షన్ అనేది యజమాని తన ఇష్టప్రకారం ఇచ్చే ధర్మంకాని, భిక్షకాదుఅని ఉద్యోగి తానుచేసిన సర్వీసుకు రావాల్సిన ప్రతిఫలంమాత్రమేఅని, తమకష్టకాలంలో, వృద్ధాప్యంలో నిస్సహాయంగా వదిలివేయకుండా ఇచ్చే హామీగాను, సామాజిక, ఆర్థిక న్యాయం జరిపే దిశగా చేపట్టే ఒక సామాజిక భద్రతాచర్యగా పరిగణించాలని తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. స్థానిక అధ్యక్షులు పొలిచర్లఓబులేశు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండుచేశారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రమౌళిరాజు, కోశాధికారి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు ఉదయ్ శంకర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, సుధాకర్, లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయసంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రేడియోలో నేడు

- ఆకాశవాణిలో వ్యవసాయ కార్యక్రమాలు
- ఉదయం 6.30 గంటల నుంచి 6.45 గంటల వరకు పొలం కబుర్లు
- మధ్యాహ్నం 1.10 నుంచి 1.20 గంటల మధ్య పసిడి పంటలు కార్యక్రమం

మార్కెట్ ధరలు (కడప)

సరుకు	కనిష్ఠం	గరిష్ఠ	సరాసరి
	(క్వింటా ధర రూపాయల్లో)		
పసుపు (కొమ్మురకం)	3812	7322	7232
పసుపు (గడ్డరకం)	3200	7040	6850
వేరుశనగ	2777	2777	2777



ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం : ఎస్పీ

కడప క్రైం, డిసెంబరు 30: పనిభారం, సిబ్బంది శ్రమ, నూతన పద్ధతులతో ఈ ఏడాది నేర నియంత్రణ సాగించాం. ఎల్‌ఎంహెచ్‌ఎస్ యాప్ ద్వారా రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగను పట్టుకోవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డీజీపీ సాంబశివరావు కడప పోలీసుశాఖను అభినందించడం సంతోషకరం. 2017లో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా పోలీసు యంత్రాంగం గట్టి కృషి చేసింది. ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కు పాదం మోపి అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసి 22 మందిపై పీడీ యాక్టు నమోదు చేశాం. సాంకేతికతను అందిపుచ్చుకుని అటు పోలీసుశాఖకు, ఇటు ప్రభుత్వానికి పేరు తీసుకువచ్చేలా పోలీసులు విధులు నిర్వహించారు. జిల్లాలో నేరాలను నియంత్రించడం, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పెరేడ్ మైదానంలో శనివారం విలేఖరులకు 2017కు సంబంధించి నేరాల వివరాలను వెల్లడించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అట్టాడ బాబూజీ

ఎర్రచందన అక్రమ రవాణా...

ఈ ఏడాది జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపారు. కొల్లం గంగిరెడ్డి సహా 22 మంది అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర స్మగ్లర్లపై పీడీ చట్టం ప్రయోగించాము. జిల్లాలో 116 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు నమోదు చేసి 1510 మంది స్మగ్లర్లను అరెస్టు చేశామన్నారు. అంతర్జాతీయ ప్రధాన స్మగ్లర్లు ఏటీ మైద్దీన్ అలియాస్ ఏటీఎం, ముస్తఫా, ఫయాజ్, హఫీజ్, సునీల్ అలియాస్ ఆర్కుట్‌భాయ్, ప్రణబ్‌కుమార్, సేతు మాధవన్, బ్రిజేష్ కుమార్‌శర్మ, శివలింగం శ్రీధర్, మహమ్మద్ ఇక్రం అలియాస్ ఇక్రంభాయ్, రియాజ్‌ఖాన్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపామన్నారు.

రోడ్డు ప్రమాదాలు - నివారణ

జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది. స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఈ-చలాన పద్ధతిలో వాహన తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. 2016లో 1,57,791 కేసులతో పోలిస్తే, భారీగా కేసులు నమోదు చేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో గతేడాది 1701 కేసులు నమోదు కాగా వారిలో 182 మందిని జైలుకు పంపించామన్నారు. 2017లో 5515 కేసులు నమోదు కాగా వారిలో 362 మందికి జైలు శిక్ష విధించేలా చర్యలు తీసుకున్నాం.

ఫ్యాక్షన్‌పై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవడంతో జిల్లాలో ఈ ఏడాది ఒక్క ఫ్యాక్షన్ సంఘటన కూడా జరగలేదు. మట్కాను కూకటివేళ్లతో పెకలించడమే లక్ష్యంగా జిల్లాలో పరివర్తన కార్యక్రమం చేపట్టాము. మట్కా, క్రికెట్‌బెట్టింగ్, జూదం, కోడిపందాలపై విస్తృత దాడులు నిర్వహించామన్నారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లిన జిల్లా వాసులు యజమానులు, ఏజంట్ల ద్వారా కష్టాలు ఎదుర్కొంటున్న వారి కోసం ప్రత్యేకంగా 'బంధం' పేరిట యాప్‌ను నిర్వహించామన్నారు. గల్ఫ్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న 33 మంది మహిళలను సురక్షితంగా జిల్లాకు తీసుకువచ్చామన్నారు.

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్

LHMS AP Police

జిల్లాలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు తాళాలు వేసిన ఇళ్లపై నిఘా ఉంచే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాము. 63,900 మంది ఈ యాప్‌లో పేర్లు నమోదు చేశారన్నారు. ఈ యాప్ ద్వారా అంతర్రాష్ట్ర దొంగను మూడు నిమిషాల్లోనే పోలీసులు పట్టుకోవడంపై ముఖ్యమంత్రి జిల్లా పోలీసులను అభినందించారన్నారు.

స్పందించే బ్లూకోల్ట్స్...

కడప సబ్ డివిజన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్‌ను నిర్వహించామన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ముఖ్యమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అనుసంధానం చేశామన్నారు. కమాండ్ అండ్ కంట్రోలు నిరంతరం సిబ్బంది సీసీ కెమెరాల్లో గమనిస్తూ నేరస్తులపై నిఘా ఉంచుతూ బ్లూకోల్ట్స్‌కు సమాచారం ఇస్తారు.

నేత్ర వాహనం...

నేరాలను అదుపు చేసేందుకు నేత్ర వాహనాన్ని జిల్లాలో మొట్టమొదటిసారి ఏర్పాటు చేశామన్నారు. పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఈ వాహనంతో వీవీఐపీ బందోబస్తు కానీ, ఇతరత్రా సభలు, సమావేశాలు, ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో నిఘా ఉంచుతామన్నారు. రోడ్డు భద్రత నియంత్రణకు పోలీసు శాఖ తొమ్మిది ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచిందన్నారు. మహిళలపై అఘాయిత్యాలను అరికట్టే లక్ష్యంతో జిల్లాలో 1500 మంది ఔత్సాహిక మహిళలను వలంటీర్లుగా ఎంపిక చేశామన్నారు.

పెరిగిన వైట్‌కాలర్ నేరాలు...

ఇటీవల ఏటీఎం, ఆన్‌లైన్ మోసాలు అధికమై పలువురు బాధితులుగా మారుతున్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కలిగించడం, బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి మోసాలకు పాల్పడే వారిని అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరెడ్డి, కడప డీఎస్పీ షేక్ మసూమ్‌బాష, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ బి.శ్రీనివాసులు, ఎస్‌బీ డీఎస్‌పీ రాజగోపాల్‌రెడ్డి, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.



టిప్పర్ ఢీకొని కాంట్రాక్టు కార్మికుడి దుర్మరణం

ఎర్రగుంట్ల, డిసెంబర్ 30: టిప్పర్ ఢీకొనడంతో ఆర్టీపీపీ కోల్‌ప్లాంటు కాంటాక్టు ఉద్యోగి హరిక్రిష్ణారెడ్డి(21) శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. కలమల్ల ఎస్‌ఐ రవికుమార్ కథనం మేరకు వివరాల్లోకెళితే....

ఆర్టీపీపీ 600మెగావాట్ల కోల్‌ప్లాంటు వద్ద మట్టిని ఫిల్లింగ్ చేసే పనులు జరుగుతున్నాయి. ఇక్కడ కాంట్రాక్టర్ ఎల్లయ్య వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఇండ్లసిద్దాయపల్లె వాసి హరిక్రిష్ణారెడ్డి శుక్రవారం రాత్రి విధులకు వెళ్లాడు. పనులు చేసి అలసి అక్కడే రోడ్డుపైనే నిద్రిస్తుండగా అర్ధరాత్రి మట్టిని అన్‌లోడ్ చేసేందుకు వచ్చిన టిప్పర్‌ను వెనక్కు డ్రైవ్ చేస్తూ డ్రైవర్ నిర్లక్ష్యంగా హరిక్రిష్ణారెడ్డిపై ఎక్కించాడు. దీంతో అతని తలకు, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డ్రైవర్ పరారయ్యాడు. మృతుని తండ్రి సుబ్బారెడ్డి, తల్లి శివమ్మ, తమ్ముడు అరవిందకుమార్‌రెడ్డి, బంధువులు రోదనలు మిన్నంటాయి. ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

లింగాల, డిసెంబరు 30: ఇప్పట్లలో శనివారం కడుపునొప్పి తాళలేక భూమిపల్లె తేజవతి (30) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల్లోకెళితే....

ముద్దనూరు మండలం రాజగురువాయపల్లెకు చెందిన ఇప్పట్ల వాసి రవితేజరెడ్డితో వివాహం జరిపించారు. అయితే రెండేళ్ల నుంచి ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. శనివారం కూడా కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అంతలో కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు ధ్వంసం చేసి చికిత్సకోసం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. తేజవతికి ఆరేళ్ల నాగచరిత, నాలుగేళ్ల యశ్వని ఉన్నారు. ఈ ఆత్మహత్యపై ఇప్పట్ల వీఆర్వో గంగాధర్‌యాదవ్ వెళ్లి వారి కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.


ఆత్మహత్య చేసుకున్న తేజవతి

కోతమిషన్‌లో అగ్నిప్రమాదం - రూ. ఆరు లక్షలు నష్టం


కోత మిషన్‌లో మంటలు ఎగసి పడుతున్న దృశ్యం, దెబ్బతిన్న మిషన్ మోటార్లు

పోరుమామిళ్ల, డిసెంబర్ 30: వెంకట ధనలక్ష్మి కోతమిషన్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో మిషన్ మోటార్లు, కర్రలు అగ్నికి ఆహుతై రూ. 6లక్షలు నష్టం వాటిల్లింది. పోరుమామిళ్ల పంచాయితీ రంపాడురోడ్డులో రెడ్డికొట్టాలకు వెళ్లే దారిలో ఉన్న వెంకటధనలక్ష్మి కోత మిషన్‌లో శనివారం తెల్లవారు జామున 3గంటలకు విద్యుత్తుషార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. దీంతో మంటలులేచి చెక్క సామాన్లన్నీ అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న ఆ యజమాని మాదా వెంకటరమణ అగ్నిమాపక కేంద్రం అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి రామక్రిష్ణ ఆధ్వర్యంలో మంటలను అదుపుచేశారు. అక్కడ కర్రలు ఎక్కువగా ఉండడంతో మంటలను అదుపుచేసేందుకు చాలా శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగుసార్లు ఫైరింజన్ నీరు తీసుకువచ్చి మంటలను అదుపు చేసింది. సంఘటనలో దాదాపు రూ. 6లక్షలు నష్టం వాటిల్లిందని, యజమాని వెంకటరమణ తెలిపారు.

సీఎం సభకు భారీ ఎత్తున తరలిరండి

▶▶ పులివెందులకు నీరురావడం వైసీపీకి ఇష్టం లేదు : సతీష్ రెడ్డి

పులివెందుల టౌన్, డిసెంబరు 30: జనవరి 3వ తేదీన పులివెందుల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు, బహిరంగ సభకు ప్రజలందరు భారీ ఎత్తున తరలిరావాలని శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 3న ద్యాన్‌చంద్ క్రీడా భవనంలో 3వ వార్డు జన్మభూమి, బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. ప్రజా సేవ అంటూ వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి గర్వం ఎక్కువేనని, ఇన్నేళ్లుగా వారిని ఎంపీగా, ఎమ్మెల్యేలుగా గెలిపిస్తూ వచ్చారని, ఏనాడు కూడా ప్రజల కోసం జగన్ పోరాడింది లేదన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతానికి నీరు తీసుకొచ్చేందుకు మేము చేస్తున్న యత్నాలను అడ్డుపడాలని చూశారన్నారు. ప్రజలపైన ప్రేమ ఉంటే 2009 అనంతరం రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో వారు వెళ్లి నీరు కావాలని, ప్రాజెక్టులు పూర్తిచేయాలని కోరిఉంటే ఏనాడో ఇక్కడి ప్రజలకు నీరు అందేదన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇక్కడి నీటి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఇక్కడి ప్రాజెక్టులు పూర్తిచేసి కృష్ణాజలాలను ఈ ప్రాంతానికి తీసుకువచ్చామన్నారు. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే పట్టిసీమను కట్టించామన్నారు. అప్పట్లో పట్టిసీమ నీరు రాయలసీమకు ఏ విధంగా వస్తాయని, గోదావరి జిల్లాల్లో అక్కడి ప్రజలతో ఈ పట్టిసీమతో ఏమీ ఒరగదని జగన్ చెప్పారన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మీనీటిని రాయలసీమకు తీసుకెళ్తున్నారని తన పత్రికలో రాయించారన్నారు. పులివెందుల ప్రాంతానికి ఈ నీటి ద్వారా పంటలు పుష్కలంగా పండి ప్రతి రైతు లక్షాధికారి కావడం ఖాయమన్నారు. ప్రస్తుతం సీబీఆర్‌లో 4.50టీఎంసీల నీరు ఉన్నాయని, పైడిపాళెంలో 3టీఎంసీల నీరు ఉందని, మరికొంత నీరును నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పుష్కలంగా ప్రాజెక్టుల్లో నీరు ఉన్నాయని, కొన్ని కాల్వలు, ఎత్తిపోతల పథకాలు పూర్తికాకపోవడంతో కొన్నిచోట్లకు నీరు అందలేదని, వాటిని కూడా పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరు అందేలా చూస్తామన్నారు. రైతు పండించిన పంటకు ఇక్కడే ఒక పరిశ్రమ ఏర్పాటుచేసి ఆ అమ్మకాలను కూడా ఇక్కడే జరిగే విధంగా చూస్తామన్నారు. హిజ్రాలకు పింఛన్, ఇళ్లస్థలాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 3వ తేదీ పులివెందులకు ముఖ్యమంత్రి రావడం మలుపుతిప్పే శుభదినమన్నారు. టీడీపీ నాయకత్వ శిక్షణా శిబిర డైరెక్టర్ రామగోపాల్‌రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డు ఛైర్మన్ రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాష, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హేమాద్రిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, పుచ్చా ప్రసాదరెడ్డి, వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్ నాగరాజు, షబ్బీర్, జోగిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కొమ్మెర హరినాథ్, తదితర టీడీపీ నేతలు పాల్గొన్నారు.


సభా ప్రాంగణను పరిశీలిస్తున్న శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జగదభిరాముడికి శనివారం స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోవెలలోని ఏకశిలపైవెలసిన శ్రీసీతారామలక్ష్మణ మూలవరులను అభిషేకించారు. పట్టుపీతాంబరాలు, తులసీగజమా లతో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ పర్యవేక్షకుడు లక్ష్మీనాగరాజు, డిప్యూటీ ఈవో లక్ష్మణ్‌నాయక్ పట్టుపీతాంబరాలు, తెచ్చి స్వామి వారికి సమర్పించారు.



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



రాజంపేటలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



ఓబులవారిపల్లెలో 2018 ఎస్టీయూ క్యాలెండర్, డైరీలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కత్తి

రాజంపేట/టౌన్, డిసెంబర్.30 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. శనివారం రాజంపేట విద్యావనరుల కేంద్రంలో ఎస్టీ యూ నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్‌లు, పీఆర్‌సి అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించా లని డిమాండ్ చేశారు. వాటి సాధన కోసం పోరాటాలు చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులంతా ఏక మై 10వ తరగతి పరీక్షా ఫలితాలలో జిల్లా మొదటి స్థానంలో వచ్చేందుకు కృషి చేయా లని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి తానెప్పుడూ ముందుం టానని, ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, ఎంఈవో చంగల్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్ వెంకటరమణరాజు, ఎస్‌బీహెచ్ మేనేజర్ తారకేశ్వర్, ఎన్జీవో అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, ఎస్టీయూ నాయకులు ఆదిశేషారెడ్డి, ఓబులేసు, చంద్రశేఖర్, మోహన్, శివరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజంపేట పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో శనివారం ఎస్టీయూ క్యాలెండర్, డైరీని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆవిష్కరించారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఓబులవారిపల్లె, డిసెంబర్30 : రాష్ట్రోపాధ్యాయ సంఘం 2018 క్యాలెండర్, డైరీలను మండలంలోని కొర్లకుంటలో శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి కార్యవర్గ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి క్యాలండర్ ఆవిష్కరణకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ సంఘ సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ముందస్తు నూతన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ రాష్ట్రోఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు రమణయ్య, మురళీమనోహర్, వెంకటరమణ, ఎంఈవో చంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్తను చంపిన కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను చూపిస్తున్న మన్నూరు సీఐ మురళీనాయక్, ఎస్ఐ, పోలీసులు

రాజంపేట టౌన్, డిసెంబర్30 : రాజంపేటలో సంచలనం రేపిన ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య కేసులో నిందితులను శుక్రవారం పట్టుకున్నామని మన్నూరు సీఐ మురళీనాయక్ తెలిపారు. శనివారం మన్నూరు సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీఐ మురళీ మాట్లాడుతూ రాజంపేట మండల పరిధిలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన ఇండ్ల శివ, అరుణలకు 4సంవత్సరాల కిందట వివాహం జరిగిందని వారికి రెండు సంవత్సరాల బాబు ఉన్నాడన్నారు. అయితే బాలిపోగు సాయిసుభాష్ అనే వ్యక్తితో అరుణకు 6సంవత్సరాలుగా వివాహేతర సంబంధం ఉండేదని, ఈ విషయం భర్త శివకు తెలియడంతో మందలించేవాడన్నారు. అయితే భార్య మారకపోవడంతో చుండువారిపల్లె గ్రామానికి చెందిన శ్రీరాముల షెడ్డులోకి వెళ్లి కూలీ పని చేసుకునే వారని, శివ కూలీపనికి వెళ్ళే సమయంలో సుభాష్‌తో అరుణ వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఉండేదని, ఈ విషయం బంధువులకు తెలియడంతో వారిని మందలించారన్నారు. దీంతో సుభాష్, అరుణలు శివను ఒక పథకం ప్రకారం చంపాలనుకుని 21వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో నిద్రమాత్రలు ఇచ్చి సాయిసుభాష్, పసుపులేటి వెంకటరమణ, ఎర్రికలవరెడ్డి శేఖర్, పోలిశెట్టి శ్రీను, అరుణలు ఎదురొమ్మపై, ముఖంపై కత్తితో పొడిచి చంపారని, అనంతరం మృతదేహాన్ని పుల్లంపేట మండలం అనంతసముద్రం అడవుల్లో పడవేశారన్నారు. శ్రీరాములు తోటలోని షెడ్డులో రక్తపు మరగలు ఉండటంతో పోలీసులకు ఏమైనా అనుమానం వస్తుందేమో అనే భయంతో రక్తపు మరకలన్నీ కడిగి ఉన్న బట్టలను కాల్చి వేశారని, అయితే శివను చంపడంలో సాయిసుభాష్ చేతికి గాయమైందని, చేతికి గాయం ఏమిటని వారి బంధువులు, స్నేహితులు అడగగా శివను చంపేశామని, విషయాన్ని గోప్యంగా ఉంచాలని చెప్పాడన్నారు. ఈ విషయం ఆనోటా... ఈనోటా పడి గ్రామస్తులకు తెలియడంతో వెలుగులోకి వచ్చిందన్నారు. శివను హత్య చేసిన వారిలో నలుగురిని అరెస్ట్‌చేయడం జరిగిందని, 5వ నిందితుడైన పోలిశెట్టి శ్రీనివాసులు పరారీలో ఉన్నాడని, త్వరలో అతన్ని పట్టుకుంటామన్నారు.

8మంది పేకాట రాయుళ్ళు అరెస్ట్

రాజంపేట టౌన్, డిసెంబర్ 30 : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న 8మంది పేకాట రాయుళ్ళను పట్టుకోవడం జరిగిందని మన్నూరు సీఐ మురళీనాయక్ తెలిపారు. పట్టుబడిన 8మంది పేకాట రాయుళ్ళను శనివారం ఉదయం మన్నూరు సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు చూపించి మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు రాజంపేట డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పేకాట స్థావరంపై డీఎస్పీ లక్ష్మీనారాయణతో పాటు సీఐ మురళీనాయక్, మన్నూరు ఎస్ఐ పి.మహేష్, పెనగలూరు ఎస్ఐ శివప్రసాద్ పోలీసులతో కలిసి దాడి చేయగా పేకాట ఆడుతున్న 8మంది పేకాట రాయుళ్ళను పట్టుకోవడం జరిగిందని సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి 2లక్షల 20వేల 460రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న వారిలో పాటూరు శ్రీనివాసుల రెడ్డి, మద్దిపట్ల రాజేంద్రప్రసాద్‌నాయుడు, దాసరి పెంచలయ్య, ముళ్ళపూడి వేణుగోపాల్, గర్లపాటిసతీష్, పామూరు లక్షుమయ్య, రమణ, పెరుమాళ్ళ ముత్తురాజ్ ఉన్నారని, వారిని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

నూతన వేడుకలను ఆనందంగా జరుపుకోండి

రాజంపేట, డిసెంబర్.30 : నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు ఆనందంగా జరుపుకోవాలని రాజంపేట డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక రీజెన్సీ నలందా విద్యాసంస్థల్లో 'వాహనాల వినియోగం- నూతన సంవత్సర వేడుకల్లో విద్యార్థుల పాత్ర విచ్చలవిడితనం వల్ల జరిగే అనర్థాలు' అనే అంశంపై రాజంపేట డీఎస్పీ లక్ష్మీనారాయణ, రీజెన్సీ నలందా కళాశాల సీఏవో సబ్బినేని ప్రవీణ్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అప్పుడు విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మన్నూరు సీఐ మురళీనాయక్, పట్టణ ఎస్ఐ రాజగోపాల్, ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు, నరసయ్య, ఉపాధ్యాయుడు సాయిప్రసాద్,విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్
రాజంపేట

సమద్ :మళ్లీ రావా
సుదర్శన్ :హల్లో..
పీవై : 2 కంట్రీస్
బీఎస్: ఒక్క క్షణం
ఎన్ఎస్ఆర్: ఎమ్.సి.ఎ (మిడిల్ క్లాస్ అబ్బాయి)

రాజంపేట ఎస్‌బీఐలో ఆధార్ కేంద్రం



ఆధార్‌సెంటర్‌ను ఎస్‌బీఐలో ప్రారంభించి సూచనలు ఇస్తున్న మేనేజర్ తారకేశ్వర్‌రావు

రాజంపేట టౌన్, డిసెంబర్30 : పట్టణంలోని మెయిన్‌రోడ్డులోఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో శనివారం ఆధార్ కేంద్రాన్ని బ్యాంకు మేనేజర్ తారకే శ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారానే ఆధార్‌కార్డు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం బ్యాంకు దగ్గర ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో భాగంగానే రాజంపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామ న్నారు. ఈ ఆధార్ సెంటర్ ద్వారా ఆధార్‌కార్డులలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఫోన్ నెంబర్ కూడా ఆధార్‌కార్డులో ఎక్కించుకోవచ్చన్నారు. పాన్‌కార్డు, పాస్‌పోర్టు, ఓటర్‌కార్డు, రేషన్‌కార్డు, రెసిడెన్సీ, బ్యాంకు పాస్‌బుక్కు తదితర ఐడీ కార్డులు తీసుకొని ఆధార్‌సెంటర్‌లో మార్పులు చేసుకోవచ్చన్నారు. కొత్తగా ఆధార్‌కార్డు చేసుకోవాల్సిన వారికి ఉచితంగా ఆధార్ చేయడం జరుగుతుందని, మార్పులు చేర్పులు ఉంటే 30రూపాయలు చార్జ్ చేయబడుతుందన్నారు. ఆధార్‌సెంటర్‌లో సి.వెంకటసుబ్బయ్య అసిస్టెంట్‌గా ఉన్నారని ఆధార్‌కార్డు కావాల్సిన వారు సంప్రదించవచ్చన్నారు.

అనాథాశ్రమ విద్యార్థులకు సరుకులు వితరణ



రాజంపేట, డిసెంబర్.30 : రాజంపేట పట్టణం రైల్వేస్టేషన్ బ్రిడ్జి వద్ద ఉన్న లవింగ్‌ఆర్మ్ అనాథాశ్రమంలోని విద్యార్థులకు నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రాజంపేట రవీంద్రభారతి స్కూల్ డీన్ అడపాల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం దుస్తులు, సరుకులు, పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థాయికి రావాలని సూచించారు. కార్యక్రమంలో రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

నేటి రాత్రి 9 నుంచి ఉదయం 5గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు

రాజంపేట టౌన్, డిసెంబర్.30 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరైనా సరే మద్యం తాగి వాహనాలపై వెళితే కఠిన చర్యలు తప్పవని మన్నూరు ఎస్ఐ మహేష్ తెలిపారు. 31వ తేదీ రాత్రి 9గంటల నుంచి జనవరి 1 ఉదయం 5గం టల వరకు పోలీసు అధికారుల ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు బృందాలుగా ఏర్పడి ప్రత్యేకంగా డ్రంక్‌డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించి వీడియో రికార్డింగ్ చేయడం జరుగుతుందని, డ్రంక్‌అండ్‌డ్రైవ్ చేస్తున్న వ్యక్తుల వాహనాలు సీజ్ చేస్తామన్నారు. తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తి ఆధార్‌కార్డు, పూర్తి సమాచారం సేకరించి రికార్డుల్లో ఉంచడం జరుగుతుందన్నారు. ఓవర్ స్పీడ్, త్రిబుల్ రైడింగ్, రాత్రి 1గంట తరువాత తిరుగు వాహనాలుకూడా సీజ్ చేయడం జరుగుతుందని, పోలీసు అధికారుల అనుమతి లేనిదే ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు చేయరాదన్నారు. అశ్లీల నృత్యాలు, బాణా సంచాలు పేల్చడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, మోటార్ సైకిల్ సెలైన్సర్ తొలగించి బైకు నడపడం నిషేధమన్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

రాజంపేట, డిసెంబర్.30 : ఎస్‌ఎఫ్‌ఐ 48వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజంపేటలోని బీసీ హాస్టల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్.మహేష్ ఆధ్వర్యంలో శనివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తోందన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి, రమణ, శివ, సాంబ, నవీన్, మణికంఠ, సందీప్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో వైసీపీ, టీడీపీల మధ్య

భగ్గుమన్న ప్రోటోకాల్ వివాదం

- మండల సమావేశంలో నూతన మార్కెట్‌యార్డ్ చైర్మన్‌ను వేదికపై ఆహ్వానించడానికి ససేమిరా అన్న ఎంపీపీ
- ఏక్ నిరంజన్‌లా వ్యవహరించిన ఎంపీపీ
- మండలాధ్యక్షుడి నిర్ణయమం శిరోధార్యమవడంతో వెనుదిరిగిన మార్కెట్ చైర్మన్





సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, సమావేశంలో ఒక్కరే ఆశీనులై ప్రసంగిస్తున్న ఎంపీపీ రంగారెడ్డి

రాజంపేట రూరల్, డిసెంబర్30 : రాజంపేటలో టీడీపీ, వైసీపీ మధ్య ప్రోటోకాల్ వివాదం భగ్గుమంది. నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్ చమర్తి సురేష్‌రాజును మండల సర్వసభ్య సమావేశంలో వేదికపై కి ఆహ్వానించే అంశంపై ఇటు వైసీపీ, అటు టీడీపీల మధ్య వివాదం రగులుకుంది. మార్కెట్ చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన సురేష్‌రాజు తొలిసారి మండల సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఆయనను వేదికపైకి ఆహ్వానించే విషయంలో మండలాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి ససేమిరా అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం మండలాధ్యక్షుడి అనుమతితో ఎవరిని ఆహ్వానించాలి.. ఆహ్వానించవద్దు అన్న అంశం ప్రధానమైంది. దీంతో మండలాధ్య క్షుడి నిర్ణయ మే శిరోధార్యం కావడం. మం డల సమావేశం ఆయన అనుమతితోనే సాగుతుందని మండలాధ్యక్షుడు తెగేసి చెప్పడంతో మార్కెట్ యార్డు చైర్మన్ వెనుతిరగాల్సి వచ్చింది.

ఏక్ నిరంజన్‌లా వ్యవహరించిన ఎంపీపీ ఆకేపాటి

మండలాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి మండల సమావేశంలో ఏక్‌నిరంజన్‌లా వ్యవ హరించారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం మండలాధ్యక్షుని అనుమతితోనే ప్రోటోకాల్ వ్యవహారం సాగుతుందని, మండల అధికారులు కూడా నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అంతా తానై మండల సమావేశంలో ఆయనొక్కడే ఆశీనులై ఎప్పుడూ లేని రీతిలో ఆసక్తికరంగా సమావేశాన్ని కొనసాగించారు. ఎంపీటీసీలకు ప్రాధాన్యం ఇస్తూ వారిని ముందు వరుసలో కూర్చోబెట్టి సర్పంచ్‌లను ప్రత్యేక ఆహ్వానితులుగా గుర్తిం చి వారికి తదుపరి స్థానాన్ని కల్పించారు. మండల అధికారులకు మరో వైపు సీట్లు కేటాయించారు. గతానికి భిన్నంగా మండల సమావేశాన్ని మండలాధ్యక్షుని కనుసన్నల్లో నిర్వహించారు.

భారీ పోలీసు బందోబస్తు

ఈ వివాదం నడుమ పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పట్టణ, రూరల్ సీఐలు, ఇరువురు ఎస్‌ఐలతో పాటు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గతంలో సర్పంచ్ భర్తలు సమావేశానికి వచ్చేవారు. కొందరు అక్కడికి వచ్చినా పోలీసులు మీకు అనుమతి లేదని తెగేసి చెప్పడం ఏమీ చేయలేక వెనుదిరగలేదు. ఇతరులను పోలీసులు అనుమతించలేదు.

పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

ఈ మండల సమావేశంలో వచ్చే నెల 2వ తేదీ జరిగే కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఎంపీడీవో వాసుదేవ గుప్త పేర్కొన్నారు. అదే విధంగా వ్యక్తిగత మరుగుదొడ్లు, శానిటేషన్, విద్యుత్, వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ పథకాలను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నిధులు మండలానికి రావడం లేదని, నిధులు మంజూరైన వెంటనేఆయా గ్రామ పంచాయతీలకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా నూతనంగా మంజూరైన జాబ్‌కార్డులను ఎంపీపీ, డిప్యూటీ తహశీల్దార్, ఉపాధి ఏపీవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో హత్యరాల ఉపసర్పంచ్ సుబ్రమణ్యంనాయుడు, ప్రతాప్‌రాజు, నరసింహరాజు, డిప్యూటీ తహశీల్దార్ విజయబాస్కర్, ఎలక్ట్రికల్ ఏఈ షఫీ, వ్యవసాయ శాఖ ఏవో వరహరి తదితరులు పాల్గొన్నారు.



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

జన్మభూమి, ఎల్స్‌పోలియోను విజయవంతం చేయండి

నందలూరు, డిసెంబర్.30 : జనవరి నెలలో జరిగే జన్మభూమి, పల్స్‌పోలియో కార్యక్రమాలను విజయవంతం చేయాలని డ్రాయింగ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివకుమార్ కోరారు. శనివారం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో సుందరి ఆదేశాల మేరకు ఆశడే సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. పల్స్‌పోలియో కార్యక్రమాల్లో ఆయా బూత్‌ల్లో నియమించిన అధికారులతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పిల్లిపిచ్చయ్య, హెల్త్‌సూపర్‌వైజర్‌లు జయరామయ్య, విజయకుమారి, క్రిష్టఫట్, లక్షుమయ్య, రామ్మోహన్, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులను రక్షించాలి

- జగన్‌ను కోరిన వైసీపీ నేత రెహమాన్‌ఖాన్

సుండుపల్లె, డిసెంబర్30: పొట్టకూటి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి ఎంతో ఇబ్బంది పడుతున్న వారిని కాపాడాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గవర్నరింగ్ కౌన్సిలింగ్ మెంబర్ (కువైట్) ప్రతిపక్ష నేత జగన్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా తంబళ్లపల్లెలో పాదయాత్రలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిసి విన్నవించారు. గల్ఫ్ బాధితులకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పించన్లు ఏర్పాటు చేయాలని ఏదైనా కారణంతో తిరిగి వచ్చిన పునరావాసం కల్పించాల న్నారు. జైలులో మగ్గుతున్న వారి విడుదలకు చర్యలు తీసుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డికి విన్న వించినట్లు తెలిపారు. వైసీపీ నాయకులు అబ్దుల్లా, అలీ, ఆరీఫ్, హనీఫ్, సుహైల్ పాల్గొన్నారు.



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రెహమాన్‌ఖాన్

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు, డిసెంబర్30 : క్రీడలతో మానసిక ఉల్లాసం, శరారీక దృఢత్వం ఏర్పడుతుందని సింగిల్‌విండో అధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ సంస్థ 18వ వార్షికోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో విద్యార్థులకు నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు సామ్రాజ్ సేవలు అభినందనీయమన్నారు. మండలంలో పలు ఉన్నత పాఠశాలల క్రీడామైదానాలను దాదాపు 4లక్షల రూపాయల వ్యయంతో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ క్రీడలకు ప్రాముఖ్యత ఇస్తేనే ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడి వ్యాధులు దరి చేరవన్నారు. ఐకేపీఎస్ అధ్యక్షుడు పి.మస్తానయ్య, ఆడపూరు సర్పంచ్ నాగిరెడ్డి సుబ్బారెడ్డి, సీహెచ్‌వో పిల్లిపిచ్చయ్య, టీడీపీ నాయకులు యలమరాచపల్లె సుబ్బారెడ్డి, లక్కిరెడ్డి లక్ష్మీరెడ్డి, ఓర్సు శ్రీనివాసులు, సాయివిద్యానికేతన్, అన్నమాచార్య అకాడమి, ఆల్విన్ పెన్నా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి రాజంపేట పార్లమెంట్ పరిధిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బెటాలియన్‌లో ముగిసిన స్పోర్ట్స్ మీట్



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న కమాండెంటు రాజాకిషోర్‌బాబు

సిద్దవటం, డిసెంబర్.30 : సిద్దవటం ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం స్పోర్ట్స్‌మీట్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమాండెంటు రాజాకిషోర్‌బాబు మాట్లాడుతూ బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ కానిస్టేబుల్‌లు స్పోర్ట్స్‌మీట్‌లో భాగా రాణించారన్నారు. ఇలాగే ప్రతిభను కొనసాగించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం పరుగుపందెం, వాలీబాల్, క్రికెట్ మరికొన్ని రకాల పోటీలలో గెలుపొందిన కానిస్టేబుళ్ళకు కమాండెంటు బహుమతులు అందజేశారు. అలాగే చాంఫియన్‌గా క్రీడాకారులకు రాణించిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంటు శ్యాముల్‌జాన్, అసిస్టెంట్ కమాండెంటు సురేష్‌బాబు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు ట్రైనీ పోలీసులు బెటాలియన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్‌ఎమ్‌డీ షరీఫ్ పాల్గొన్నారు.

సగరులు ఆర్థికంగా ఎదగాలి

రాజంపేట, డిసెంబర్30 : సగరులు (ఉప్పర కులస్తులు) ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆ సంఘ రాష్ట్ర నాయకులు వి.వి.గిరి అన్నారు. శనివారం ఉస్మాన్‌నగర్ బైపాసు రోడ్డు, జేపీ కాంప్లెక్స్‌లో సగరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగరులు భగీరథ మహర్షి వంశస్థులని, కావున భగీరథ జయంతిని ప్రభుత్వమే జరిపించాలన్నారు. సగరులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నామినేటెడ్ పోలీసులు కేటాయించాలన్నారు. సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలన్నారు. బీసీడీ నుంచి బీసీఏకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు శంకర్, సుబ్బరాయుడు, యానాది, రమణయ్య, వెంకటేష్, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, రాము, జె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సగరులు

రంగు రంగు కేకులు..
ఎంత స్వీటుగున్నవో...!

● నూతన సంవత్సరాన్ని స్వగతిస్తున్న కేక్‌లు





నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని వివిధ బేకరీల్లో వివిధ రూపాల్లో రకరకాల కేక్‌లను తయారు చేసి ప్రత్యేకంగా కౌంటరును ఏర్పాటు చేశారు. కాగా ఇప్పటికే చాలా మంది నూతన సంవత్సర కేకులను కొనుగోలు చేయడంలో బిజీబిజీగా కనించారు.











విద్యుత్తు బకాయిలు రూ.235 కోట్లు

● వసూళ్లకు విద్యుత్ శాఖ కొరడా ● సరఫరా నిలిపివేతకు చర్యలు ● ప్రభుత్వ కార్యాలయాలకూ షాక్
● స్థానిక సంస్థలు.. ప్రభుత్వ కార్యాలయాల వాటా రూ.215 కోట్లు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 30: విద్యుత్తు మొండి బకాయిల వసూళ్లపై ఆ శాఖ కొరడా ఝుళిపిస్తోంది. బిల్లులు చెల్లించని కనెక్షన్‌లకు సరఫరా నిలిపివేసే చర్యలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో ప్రభుత్వ కార్యాలయాలకూ మినహాయింపు ఇవ్వకపోవడం గమనార్హం. నవంబరు 30 నాటికి జిల్లాలో (కడప సర్కిల్) రూ.235 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, కడప కార్పొరేషన్ సహా పంచాయతీలు రూ.175 కోట్ల మేర బకాయిలున్నాయి. గృహావసరాలు, పరిశ్రమలు, వ్యాపార వాణిజ్యం కలిపి రూ.20 కోట్లు, వ్యవసాయానికిచ్చే ఉచిత విద్యుత్‌కు సంబంధించి సాధారణ ఫీజు కింద రూ.10 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాలు రూ.30 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి.

చెల్లింపుపై అమలు కాని ఆదేశాలు

ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి నవంబరు 15లోగా విద్యుత్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఉన్నతాధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో జిల్లాస్థాయిలో కూడా స్పందన కరువైంది. కాగా బకాయిలపై విద్యుత్ శాఖ అన్ని విభాగాల కనెక్షన్‌లకు సంబంధించి నోటీసులు జారీ చేశారు.

సరఫరా నిలిపివేత చర్యలు



కరెంటు నిలిపివేతకు గురైన రిజిస్ట్రేషన్ కార్యాలయం

నోటీసులకు స్పందించని వారిపై సరఫరా నిలిపివేత చర్యలు చేపట్టారు. ప్రభుత్వ శాఖలను కూడా ఉపేక్షించడంలేదు. ఇటీవల కడపలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సరఫరా నిలిపివేశారు. ఆ కార్యాలయం లక్షా నాలుగువేలు బకాయిలుంది. అయితే విద్యుత్ తీగలు తెగి సరఫరా నిలిచిపోయినట్లు అక్కడి సిబ్బంది చెప్పడం విశేషం. ఉన్నతాధికారులు చర్చించి మరుసటిరోజు సరఫరా పునరుద్ధరించుకున్నట్లు సమాచారం. జిల్లాలో మరిన్ని కార్యాలయాల పరిస్థితి ఇలాగే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక స్థానిక సంస్థలపై కొరఢా ఝుళిపించనున్నారు. జనవరి మొదటివారంలోగా సగం పైగా బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి

గృహావసరాలు సహా వ్యాపార, వాణిజ్య మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించారు. జనవరి నెలలో రీడింగ్ తీసుకుంటున్నప్పుడు బకాయిల గురించి తెలిపి వెంటనే చెల్లించేలా సిబ్బంది ద్వారా సూచనలు చేయనున్నారు. బిల్‌స్టాప్ బకాయిలు కూడా దాదాపు రూ.5 కోట్లు ఉండడంతో ఆ కనెక్షన్‌లు తీసుకున్న వారి గురించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించే చర్యలు చేపడుతున్నారు.

బకాయిల వల్ల సంస్థకు అపార నష్టం - ఎస్ఈ

విద్యుత్ ఉత్పత్తి ఎలా ఉన్నా కొనుగోలు చేసి 24 గంటల కరెంటు ఇస్తున్నప్పుడు బిల్లుల చెల్లింపులు సక్రమంగా ఉండాలని ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బకాయిల వల్ల సంస్థ ఆర్థికంగా బలహీనపడుతుందని, దీంతో కొనుగోలు కష్టతరమవుతుందన్నారు. బకాయిలు చెల్లించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఇందులో సరఫరా నిలిపివేత ఒక భాగమన్నారు. చౌర్యం కూడా సంస్థకు నష్టం చేకూర్చడమే కాక కేంద్ర పథకాల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. కావున బకాయిలున్న అన్నివిభాగాలు చెల్లించి సహకరించాలన్నారు.

సోమశిల వెనుకజలాల్లో
మత్స్యశాఖ అధికారుల దాడులు

● రెండు బస్తాల ఎండుచేపలు ● పది అలివివలలు స్వాధీనం

గోపవరం, డిసెంబర్ 30: సోమశిల ప్రాజెక్టు వెనుకజలాల్లో మత్స్య, అటవీశాఖల అధికారులు శనివారం సాయంత్రం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సోమశిల ప్రాజెక్టు వెనుకజలాల్లో అలివి వలలతో మత్స్యసంపదను కొల్లగొడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై స్పందించిన అధికారులు దాడులు నిర్వహించి రెండు బస్తాల ఎండు చేపలు, 10 అలివి వలలను స్వాధీనం చేసుకున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రబ్బాని తెలిపారు. శనివారం సాయంత్రం వెనుకజలాల్లోకి పరిశీలనకు వెళ్లగా తమను గమనించిన మత్స్యకారులు పారిపోయారని, అక్కడ ఉన్న ఎండు చేపలను, అలివి వలలను స్వాధీనం చేసుకొని కడపకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎంపీఈఏ చెన్నారెడ్డి, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

లింగాల, డిసెంబరు 30: జనవరి 3వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందుల నియోజకవర్గంలోని పార్నపల్లె చిత్రావతి డ్యాంను సందర్శించనున్నా రు. దీంతో ఇప్పటికే పలువురు అధికారులు పర్యటన స్థలా న్ని పరిశీలించారు. శనివారం జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ పరిశీలించారు. ముందుగా సీఎం దిగే హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అక్కడ 200మీటర్ల వరకు చుట్టు పక్కల కంపచెట్లు తొలగించాలని అధికారులకు తెలిపారు. హెలిప్యాడ్ నుంచి గండికోట నుంచి వచ్చేనీటి స్థలం 500మీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడ కూడా కంపచెట్లు, రాళ్లు తొలగించాలని అధికారులకు, స్థానిక పోలీసులకు తెలిపారు. అనంతరం నీటిపారుదల శాఖ ఎస్ఈ వరదరాజులు, మైనర్ ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చి పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం ప్రొక్లెయిన్లు, టిప్ప ర్లు, రోలర్లు తదితర యంత్రాలు సీబీఆర్ వద్దకు చేరుకుని పనులు ప్రారంభించాయి. పైలాన్ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. కార్యక్రమంలో పులివెందుల ఏఎస్పీ కృష్ణారావు, తహసీల్దార్ ఖాసీంఖాన్, టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, పుల్లానాయుడు, వెంకటనాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అట్టాడ బాబూజీ

బాల్ బ్యాడ్మింటన్ విజేత ఎస్ఆర్ఎం యూనివర్శిటీ

● ద్వితీయ స్థానంలో ఆంధ్ర ● తృతీయ స్థానంలో ఆది కవి నన్నయ్య ● నాలుగవ స్థానంలో మద్రాస్ యూనివర్శిటీ





విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు, జిల్లా జడ్జి శ్రీనివాస్



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న ఆంధ్రా యూనివర్శిటీ జట్టు



తృతీయ బహుమతి అందుకుంటున్న ఆదికవి నన్నయ యూనివర్శిటీ జట్టు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 30 : ఈనెల 27వ తేదీ నుంచి 30 వరకు వైవీయూలో జరిగిన ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయంలో పురుషుల బాల్ బ్యాడ్మింటన్ విజేతగా తమిళనాడుకు చెందిన ఎస్ఆర్ఎం యూనివర్శిటీ నిలిచింది. శనివారం వైవీయూ వైస్‌ఛాన్సలర్ అత్తిపల్లి రామచంద్రారెడ్డి అధ్యక్షతన వైవీయూలో జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులు విచ్చేసిన కలెక్టర్ బాబూరావునాయుడు, జిల్లా జడ్జి శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే వారికి మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దానిని పూర్తిగా నివారించాలంటే వారికి మానసిక స్థితి, సమస్యలు పరిష్కరించుకునే శక్తి, ఓటమిని తట్టుకునే శక్తి రావాలంటే క్రీడలు తప్పనిసరిగా ఆడాలని సూచించారు. జాతీయ పరిశీలకుడు డాక్టర్ చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా టోర్నమెంటును విజయవంతం చేశారని తెలిపారు. లోక్ అదాలత్ ఛైర్మన్ విష్ణుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంటులో పాల్గొనే వారు ప్రతి ఒక్కరూ ఈరోజు కాకపోయినా ఏదో ఒకరోజు విజయం సాధిస్తారన్నారు. పాల్గొనడమే ముఖ్యమని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ డాక్టర్ చంద్రయ్య, టోర్నమెంటు కార్యదర్శి, వైవీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ చాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

మొదటి లీగ్ : మద్రాసు యూనివర్శిటీపై ఎస్ఆర్ఎం యూనివర్శిటీ 31-35, 35-25, 35-26తో విజయం సాధించింది.

రెండవ లీగ్ : ఆది కవి నన్నయపై ఆంధ్రా యూనివర్శిటీ 35-28, 35-26తో విజయం సాధించింది.

మూడవ లీగ్ : మద్రాసు యూనివర్శిటీపై ఆంధ్రా యూనివర్శిటీ 35-32, 35-32తో విజయం సాధించారు.

నాల్గవ లీగ్ : ఎస్ఆర్ఎంపై ఆది కవి నన్నయ 31-35, 35-25, 35-20తో విజయం సాధించింది.

ఐదవ లీగ్ : మద్రాసు యూనివర్శిటీపై ఆది కవి నన్నయ 35-32, 35-32తో విజయం సాధించింది.

ఆరవ లీగ్ : ఆంధ్రా యూనివర్శిటీపై ఎస్ఆర్ఎం 35-31, 35-27తో విజయం సాధించింది.

3,4 తేదీల్లో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు

కడప కల్చరల్, డిసెంబరు 30 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాయల్ అంధుల సంఘ ఆధ్వర్యంలో అంధుల లిపి కర్త లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు జనవరి 3, 4 తేదీల్లో ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి కె.సాంబశివుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తేదీ జేసీ-2 శివారెడ్డి, పర్యాటక శాఖ ఆర్‌డీ జి.గోపాల్ తదితరులు ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలోని అంధ ఉద్యోగులందరికీ 3, 4, 5 తేదీల్లో ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ముగింపు సమావేశం 4వ తేదీ సాయంత్రం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి శాసనమండలి విప్ పి.రామసుబ్బారెడ్డి, కలెక్టర్ బాబూరావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తదితరులు హాజరవుతారన్నారు. ఇందులో భాగంగా 3, 4 తేదీల్లో మెడికల్ క్యాంపు, ఆర్టీసీ బస్ పాస్‌ల పంపిణీ ఉంటుందని తెలిపారు. కావున జిల్లా నలుమూలల నుంచి పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టీడీపీలో చేరిన కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు ఎంపీ సురేష్

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 30 : కడప నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎంపీ సురేష్ శనివారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు ఆఫీసులో ఆయన చేతుల మీదుగా కండువా వేయించుకుని టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన ఎంపీ సురేష్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసు ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎంపీ సురేష్ మాట్లాడుతూ కడప నగర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. నగరపాలక సంస్థ టీడీపీ ఆధీనంలో లేకున్నా ఆ పార్టీ నాయకుల సూచనల మేర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నదని, దీంతో అభివృద్ధి చేసే టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకుని ఈరోజు చేరామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఎంతో మంది ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారన్నారు. త్వరలో ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ నేతలు మన్మోహన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీ సురేష్, చిత్రంలో వాసు, రెడ్యం, మన్‌మోహన్‌రెడ్డి, వికాస్ హరిక్రిష్ణ, రాంప్రసాద్‌రెడ్డి


వైరస్ సోకిన మిరప పంట

మళ్లీ రైతు కంట్లో కారం

● మళ్లీ ముంచిన మిర్చి ● వైరస్‌తో తీవ్ర నష్టం

వాణిజ్య పంటగా పేరుగాంచి వ్యవసాయ పంటల్లో రారాజుగా కీర్తిగాంచిన మిరప పంట రెండేళ్లుగా రైతుల కళ్లలో కారం చల్లుతోంది. గత ఏడాది దిగుబడి పెరిగి ధరలు పెరుగగా ఈ ఏడాది పంటకు సోకిన వైరస్, తెగుళ్లు, చీడ పీడలు ఆశించడంతో పెట్టిన పెట్టుబడి సరికదా... గింజల ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదు. మిర్చి తోటలకు వైరస్ తెగులు సోకడం, తెగుళ్లు ఆశిం చిన మొక్కలు చిన్నవిగా మారి పైకి ముడుచుకు పోతున్నాయి. చేసేదేమి లేక మిర్చి పంట రైతు బతుకులపై దెబ్బకొట్టిందంటూ ఆవేదనతో రైతులు సగంలోనే మిర్చి పంట దున్నేసిన పరిస్థితి నెలకొంది.

● కౌలు రైతు పరిస్థితి దారుణం



మైలవరం, డిసెంబరు 30

మిర్చి పంట మండల రైతాంగాన్ని మళ్లీ ముంచింది. ఎర్రబంగారంగా పిలుచుకునే వాణిజ్యపంట మిర్చికి గత ఏడాది గిట్టుబాటు ధర రాక కలాల్లోనే వదిలేసి తీవ్రంగా నష్ట పోయిన రైతాంగం ఈ ఏడాది సాగు తగ్గించి వేసుకున్న పొలాల్లో పంట ఏపుగా పెరుగుతూ ఆశలు కల్పిం చినా కొన్నిచోట్ల పూత, కొన్నిచోట్ల కాపు రాక, వైరస్ తెగుళ్లతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండల పరిధిలోని తొర్రివేముల, నార్జాంపల్లె, కల్లుట్ల, చిన్నకొమెర్ల గ్రామాల్లో ఈ ఏడాది దాదాపు 600 హెక్టార్లకు పైగా మిరప పంట సాగు చేశారు. గతేడాది దిగుబడులు బాగా పెరగ డంతో గిట్టుబాటు ధర తగ్గి క్వింటాకు కనిష్టంగా రూ.3వేల ధర పలుకగా గరిష్టంగా రూ.11 వేల వరకు వచ్చింది.

● **వైరస్ తెగుళ్లతో..**

మిర్చి తోటలు పూత, కాపు దశలో వైరస్ తెగుళ్ల ఆశించడంతో మొవ్వ కుళ్ల తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా తెల్ల దోమ ద్వారా వైరస్ సోకుతున్నట్లు, దీంతో మొక్కలు చిన్నవిగా మారి ముడుచుకు పోతున్నాయంటున్నారు. పలు రకాల మం దులు పిచికారి చేసినా పంట సరిగా రాలే దని రైతులు తెలిపారు. మండలంలో మిరప సాగు చేసిన రైతుల పరిస్థితి అధ్వా నంగా మారింది.

ఖర్చు రూ.70వేలు వచ్చింది రూ.20 వేలు

నాగరాజు, రైతు, కల్లుట్ల

కల్లుట్ల గ్రామానికి చెందిన బట్టు నాగరాజు గత ఏడాది రూ.25 వేలకు పొలం కౌలుకు తీసుకుని 200 క్వింటాళ్లు మిర్చి పండిం చాడు. ఈ ఏడాది అదే పొలాన్ని రూ.28 వేలకు కౌలుకు తీసుకుని 20 క్వింటాళ్లు పండించారు. గత ఏడాది దిగుబడి వచ్చినా ధరలేదు. ఈ ఏడాది తెగుళ్ల, వైరస్ సోకి మిరప పంట ఆకులు ముడుచుకుపోయి పంట దిగుబడి రాలేదు. హెక్టారుకు రూ.50నుంచి రూ.70 వేలు పెట్టుబడి పెట్ట గా చేతికొచ్చింది రూ.20 వేలు మాత్రమే. కౌలు ధర రాలేదు. మిరప పంట సాగుచేసిన రైతుల నష్టాలతో అప్పులపాలు కావాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.



వైభవంగా శ్రీవారి చక్రస్నానం

తరించిన భక్తజనం

కడప కల్చరల్, డిసెంబరు 30

ముక్కోటి ఏకాదశి పర్వదినం అనంతరం ద్వాదశి శనివారం దేవునికడపలో వైభవంగా చక్రస్నానం జరిగింది. భక్తజనం వెంటరాగా శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను, చక్రత్తాళ్వార్‌ను ఆలయ పూజారులు ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి చందనాభిషేకం నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య శ్రీవారి చక్రానికి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానం తిలకించేందుకు విశేషంగా భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


చక్రస్నానానికి ఉత్సవమూర్తులతో ఊరేగింపుగా పుష్కరిణికి వెళుతున్న దృశ్యం



గండికోట ముఖద్వారం



గండికోటలో ప్రత్యేక ఆకర్షణగా జుమ్మా మసీదు



సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నా-చిత్రావతి గండి



గత వైభవానికి ప్రతీక

గండికోట



గండికోట ప్రాకరంలో చార్మినార్

రాజులు, నవాబులు, పెత్తందారులు కాలగర్భంలో కలిసిపోయినా.. పౌరుషాలు, నాడు నిర్మించిన కట్టడాలు నేటికి సాక్షాలుగా నిలిచిన గండికోట గత పాలకుల వైభవానికి ప్రతీకగా నిలిచింది. గండికోట చుట్టూ అందమైన లోయలు, శత్రు దుర్భేద్యమైన కోట, నాటి ప్రాచీన కట్టడాలు, ఎటుచూసినా అబ్బురపరిచే కమనీయ దృశ్యాలు గండికోట ఒడిలో దాగి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని ఏలిన ఎందరో రాజులు, రాజ వంశాలు పరాక్రమానికి నాటి రాజకీయ, సామాజిక, పరిస్థితులకు నిలువుటద్దంగా నిలిచిన గండికోట చరిత్ర పుటల్లోకి వెళదాం.

జమ్మలమడుగు రూరల్



రంగనాథస్వామి దేవాలయం

పెన్నా- చిత్రావతి రెండు నదుల మధ్య కలిసే చోట సహజసిద్ధంగా ఏర్పడిన బ్రహ్మాండమైన గండికి పక్కనే ఎత్తైనప్రదేశంలో కోటను నిర్మించడంతో దీనికి గండికోట అనే పేరు వచ్చినట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది.

కోట నిర్మాణంలో ఒక కథనం ప్రచారంలో ఉంది. నాడు కోటను నిర్మించే సమయంలో కూలీలు తొలి సంధ్యలో పెన్నానదిలో ఇసుకయందు ఒక్కోరు ఒక్కో కుప్ప ఇసుకపోగు చేసి పనికి వెళ్లేవారు. తీరా వచ్చిన తర్వాత చూస్తే అందులో ఎవరి పనికి తగ్గ కూలి బంగారు నాణేల రూపంలో లభించేదని కథనం .

కోట నిర్మాణానికి ఉపయోగించిన ఒక్కో రాయి టన్ను బరువు కలిగి మూడు రక్షణ ప్రాకారాలతో, కోట ముఖద్వారం రెండు పెద్ద ఇనుప తలుపులతో ఏనుగులతో పగులకొట్టడానికి వీల్లేకుండా అంకుశం లాంటి ఇనుప గుబ్బలు రక్షణగా ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగు నుంచి గండికోట సుమారు 14 కి.మీ. దూరంలో పెన్నానది ఒడ్డున నిర్మితమైన గండికోట కాకతీయ ప్రభువులచే నిర్మింపబడి విజయనగర రాజుల వీర క్రమాన్ని చవిచూసి కాలక్రమంలో ముస్లిం పాలకుల చేతుల్లోకి వెళ్లింది. అనంతరం ఆంగ్లేయుల ఆధీనంలోకి వచ్చినా గండికోట చరిత్రలో జరిగిన ఎన్నో యుద్ధాలకు సాక్షి. పూర్వకాలంలో గండికోట ప్రాంతాన్ని గిరిదుర్గం అని పిలిచేవారు. గండికోట నిర్మాణం చారిత్రాత్మక ప్రదేశంగా నిలిచింది.

గండికోట తామరశాసనం ప్రకారం కీ.శ.116, శాలివాహన శకం 1028లో సదాశివ కాకరాజు, స్థానిక పూర్వపు బొమ్మే పల్లెవాని ములికినాటి సీమ అధికారిగా, 12 మంది ఆయ గాండ్లు, 20 మందికిపైగా విలుగాండ్లు, రెండు వేల మంది పనివారితో కర్నాటక రాష్ట్రం నుంచి బయల్దేరి బళ్లారి, గుత్తి, తాడిపత్రి మీదుగా కొండాపురం గండ్లూరు కొండ ప్రాంతంలో జమ్మలమడుగుకు చేరుకున్నారు. అక్కడ ప్రవహిస్తున్న పెన్నానది చల్లదనానికి, ప్రకృతి సోయగానికి పరవశించి అక్కడ శత్రుదుర్భేద్యమైన కోటను నిర్మించ దలచారు. దాని సమీపాన రాజుల కాలంలో వినోదం కోసం చార్మినార్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారని తెలుస్తోంది. గండికోట చుట్టూ 101 బురుజులు గోడల వెంబడి సైనికులు నివసించేందుకు అవసరమైన నిర్మాణాలు, ఫిరంగులు అందించేందుకు వీలుగా పెద్ద పెద్ద రంధ్రాలతో గోడకు నిర్మించారు. అప్పటి కాలంలో దీన్నిబట్టి ధర్మం ఏవిధంగా ఉండేదోనని అర్థమవుతుంది. అప్పట్లో కాకరాజు పండితులచే మొదటి రంగనాథస్వామి గుడికి, తర్వాత కోటకు పునాదులు వేసినట్టు తెలుస్తోంది. కీ.శ.1106 నుంచి 1781 వరకు అనేక రాజవంశాలు పరిపాలించాయి.


మీర్‌జుమ్లా గండికోటలోని హిందూ దేవాలయాలను, విగ్రహాలను దోచుకుని 20 ఫిరంగులను తయారు చేయుటకు పోర్చుగ్రీస్ దేశానికి చెందిన మైలే అనే వ్యక్తికి అప్పగించారు. కోటలో ఉన్న శివాలయాన్ని పడగొట్టించి దాని స్థానంలో పెద్ద జుమ్మా మసీదు నిర్మించినట్టు తెలుస్తోంది. ఈ కోటలో నేటికి చెక్కు చెదరకుండా ఇప్పటికి ప్రత్యేక ఆకర్షణగా . 10 మీటర్ల ఎత్తులో 12 స్తంభాలతో ధాన్యాగారాన్ని నిర్మించారు. ధాన్యం తడువకుండా పైన కంకరతో గచ్చు వేయించాడు. పైనుంచి ధాన్యం పోయడానికి పక్కనే వందల స్థాయిలో మెట్లను నిర్మించారు. ఎక్కడ కరవు వచ్చినా రెండు సంవత్సరాల వరకు ఇబ్బంది లేకుండా ధాన్యం నిల్వ ఉంచుకోవడానికి ధాన్యాగారం ఏర్పాటుచేశారు. గోడలకు చెక్కు చెదరకుండా సుందరంగా శిల్పాలు, నాట్య శిల్పాలు, దేవతా స్త్రీలు, నాగ కన్యలు, శివలింగాలు, జంతువులు, బల్లులు, తాబేళ్లు తదితర రేఖా చిత్రాలను గీయించారు. కోటలో ఎర్రకోనేరు ఎంతో ప్రసిద్ధిగాంచింది. మాధవరాయస్వామి దేవాలయానికి దక్షిణాన రాయల చెరువు నిర్మించారు. రాయలచెరువులో ఫిరంగి గుండ్లు, దేవతల విగ్రహాలు, కంచు రథం మొదలైనవన్ని అప్పట్లో పడవేసినట్లు తెలుస్తోంది. అలనాటి గండికోటను భవిష్యత్తు తరాలకు కాపాడేందుకు ఇంకా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గండికోట చరిత్ర.. పాలకులు


1106 నుంచి 1128 వరకు కాకరాజు, అక్కడి నుంచి త్రిభువన మల్లుడు, సోమేశ్వరుడు పాలించారు. 1138 నుంచి 1148 వరకు త్రిలోచనమల్లుడు, 1192లో నల్లసిద్ధమౌలా మహారాజు, 1212లో అంబదేవుడు, 1407 నుంచి 1413 వరకు అన్నారెడ్డి మల్లారెడ్డి, 1415లో దేవరాయలు, 1417లో భూపతిరాయలు, శ్రీకృష్ణదేవరాయుల కాలంలో 1509 నుంచి 1523 వరకు క్రిష్ణప్పనాయుడు, 1545లో అతివీరబ్రహ్మానాయుడు, 1584లో గంగరాజు, అలియరామరాయుల పరిపాలించారు. విజయనగరాజ్య పతనాంతరం పెమ్మసాని తిమ్మనాయుడు అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. అనంతరం కూలి కుతుబ్‌షాహి వంశీయుల ఏలుబడిలో 1652 మీర్‌జుమ్లా, 1700 నుంచి 1717 వరకు అబ్దుల్ నజీర్‌ఖాన్, 1735 నుంచి 1775 వరకు మొగలాయులు, 1784లో టిప్పుసుల్తాన్, 1785లో మోచామియాల పాలన, తదితరులు గండికోటను పరిపాలించారు. అనంతరం గండికోట ఆంగ్లేయుల పాలనలోకి వచ్చింది. 1852 గండికోట మొదటిసారి హిందూరాజుల నుంచి మహమ్మదీయుల రాజుల చేతుల్లోకి వెళ్లింది.



రాయలచెరువు



ఇనుప తలుపులు



ధాన్యం నిల్వ చేసే ధాన్యాగారం



పురాతన కాలం నాటి ఫిరంగి



శిల్ప కళతో అలరారుతున్న మాధవరాయస్వామి దేవాలయం

ఉత్తర కొరియా–ఆంక్షలు

ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించడంతో ఉత్తర కొరియాపై ఐక్యరాజ్యసమితి కఠిన ఆంక్షల్ని విధించింది. ఈమేరకు సమితి తీర్మానం కూడా చేసింది. మొదటిసారిగా భద్రతా మండలిలోని 15 సభ్య దేశాలు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఉత్తర కొరియాకు ప్రధాన వ్యాపార భాగస్వాములుగా ఉన్న రష్యా, చైనా సైతం ఆంక్షల తీర్మానానికి మద్దతుగా ఓటు వేయడం విశేషం.

ఐరాస విధించిన తాజా ఆంక్షలు

1. ఉత్తర కొరియాకు ఎగుమతయ్యే 89 శాతం శుద్ధిచేసిన పెట్రోల్ పై నిషేధం విధించారు.
2. ఆ దేశానికి చమురును తీసుకెళ్లే నావలపై మరింత నిఘాను పెంచనున్నారు.
3. విదేశాల్లో ఉన్న వేలాది మంది ఉత్తర కొరియా పౌరులను రెండేళ్లలోగా వారి స్వస్థలాలకు పంపేయనున్నారు.

అమెరికా ప్రతిపాదిత ఆంక్షలు

ఒకపక్క ఉత్తర కొరియా సమస్యను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరుకుంటూనే మరోవైపు అమెరికా ఈ కింది ఆంక్షలను ప్రతిపాదించింది.

1. ఏటా పెట్రో బ్యారెల్స్ సరఫరాను 5 లక్షలకు, క్రూడ్ ఆయిల్ బ్యారెల్స్ సరఫరాను 40 లక్షలకు పరిమితం చేయాలి.
2. విదేశాల్లో పనిచేస్తున్న ఉత్తర కొరియా పౌరులందర్నీ ఏడాదిలోగా స్వదేశానికి తిరిగి పంపించాలి. దీనివల్ల ఆ దేశానికి వచ్చే విదేశీ మారక ద్రవ్యాన్ని నియంత్రించాలన్నది అగ్రరాజ్యం ఉద్దేశం.
3. ఉత్తర కొరియాకు చెందిన యంత్రాలు, ఎలక్ట్రిక్ వస్తువుల ఎగుమతులపై కూడా నిషేధం విధించాలి.

అమెరికాకు భయం ఎందుకు?

గతంలో ఉత్తర కొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల్ని చాలాసార్లు పరీక్షించింది. అయితే నవంబరులో ప్యాంగ్యాంగ్ ప్రయోగించిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి గతంతో పోల్చితే సాంకేతికపరంగా చాలా అధునాతనమైనదని అమెరికా ధ్రువీకరించింది. ఉత్తర అమెరికాలోని ఏ ప్రాంతాన్నయినా లక్ష్యంగా చేసుకుని అణు వార్ హెడ్స్‌తో దాడిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నామంటూ ఉత్తర కొరియా ప్రకటించడం కూడా అగ్రరాజ్యం వెన్నులో వణుకు పుట్టించింది. నిజానికి ఉత్తర కొరియా గనక ఉన్మాదంతో అణుదాడులకు పాల్పడితే ఫలితం దారుణంగా ఉంటుందని భావించిన అమెరికా ఆ దేశంపై ఆంక్షల విషయంలో చొరవ తీసుకుంది. భద్రతామండలి సభ్యదేశాలు ఈ విషయంలో ఏకాభిప్రాయానికి రావడం ఇదే తొలిసారి. గతంలో వచ్చిన ప్రయత్నాలను ఉత్తర కొరియాకు మిత్రదేశాలైన చైనా, రష్యాలు వ్యతిరేకించాయి. ఈసారి ఆ దేశాలు కూడా మద్దతు తెలపడంతో ఉత్తర కొరియాపై ఆంక్షలకు మార్గం సుగమమైంది.

కరెంట్ టాపిక్

ముఖ్యాంశాలు

1. అమెరికా, దక్షిణ కొరియా నిర్వహించిన సంయుక్త సైనిక విన్యాసాలకే కాదు పొరుగు దేశానికి అగ్రరాజ్యం ఇస్తున్న మద్ధతు తనకు ఎప్పుడైనా ప్రమాదమేనని ఉత్తర కొరియా భావిస్తోంది. ఫలితంగా సైనిక పాటవాన్ని పెంపొందించేందుకు వీలుగా ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని ప్రయత్నిస్తోంది.
2. అమెరికా దాడుల నుంచి రక్షించుకునేందుకు దేశ జీడీపీలో 25 శాతం నిధుల్ని రక్షణ రంగానికే ఉత్తర కొరియా కేటాయిస్తోంది.
3. అమెరికా పెనుముప్పు నుంచి కాపాడే రక్షణ కవచంగా ఉత్తర కొరియాను చైనా భావిస్తోంది.
4. ఉత్తర కొరియాలో సుమారు కోటి 80 లక్షల మంది ఆకలిబాధలతో అలమటిస్తున్నట్టు ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తోంది.

ఆంక్షల వెనక ఉద్దేశం

ఉత్తర కొరియాపై ఆంక్షలు విధించడం వెనక గల ప్రధాన ఉద్దేశాలు ఇలా ఉన్నాయి.



1. అణు కార్యక్రమాలను ఆ దేశం ఆపేలా ఒత్తిడి తీసుకురావడం.
2. నిరాయుధీకరణ చర్చల దిశగా ఉ.కొరియాను ఒప్పించడం.
3. చమురు నిల్వలు, ఆర్థిక రంగాల్లో కొరత సృష్టించడం ద్వారా అణ్వాయుధ కార్యక్రమాలను నియంత్రించడం.

గతంలో విధించిన ఆంక్షలు

1. అమెరికా దాదాపు దశాబ్ద కాలంగా ఉత్తర కొరియాపై ఆంక్షలు విధిస్తూనే ఉంది.
2. గతేడాది ఉత్తర కొరియా బొగ్గు ఎగుమతులను 60 శాతానికి తగ్గిస్తూ ఆంక్షలు విధించింది ఐక్యరాజ్యసమితి. ఇది ఉత్తర కొరియా -చైనా మధ్య బొగ్గు వ్యాపారంపై ప్రభావం చూపించింది. కాపర్, నికెల్, సిల్వర్, జింక్ ఎగుమతులపై కూడా ఆంక్షలు విధించింది.
3. మరోసారి ఈ ఏడాది ఆగస్టులో ఉత్తర కొరియా బొగ్గు, ఇతర ముడి ఖనిజాల ఎగుమతులపై ఐరాస నిషేధం విధించింది. దీంతో ఉత్తర కొరియాలో పెట్టుబడులు గణనీయంగా పడిపోయాయి. ఫలితంగా 100 కోట్ల డాలర్ల వరకూ ఆ దేశానికి నష్టం వాటిల్లింది.

ఎవరు ఏమన్నారు?

1. తమ దేశాన్ని ఆర్థిక దిగ్బంధనం చేయడమంటే యుద్ధంతో సమానమే: ఉత్తర కొరియా
2. ఐక్యరాజ్యసమితి తాజా తీర్మానం కీలకమైన అడుగు: అమెరికా
3. ఉద్రిక్తతలను తగ్గించేందుకు కృషి చేయాలి: చైనా
4. రెండు దేశాలు అంగీకరిస్తే మధ్యవర్తిత్వం చేసేందుకు సిద్ధం: రష్యా

ముగింపు

పౌర అణుఒప్పందం విషయంలో ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశాలు కొంత విజయం సాధించాయి. ఉత్తర కొరియా విషయంలోనూ పట్టువిడుపుల్ని ప్రదర్శించి ప్రపంచాన్ని, మరీ ముఖ్యంగా తూర్పు ఆసియాను అణ్వస్త్రరహితంగా చేయడంలో అందరూ కృషిచేయాలి.



బొబ్బిలి శ్రీధరరావు

వేరుశనగ పిండి

స్వయం ఉపాధి

ఆహార పదార్థాల తయారీలో వేరుశనగలకు ఉన్న ప్రాధాన్యం అందరికీ తెలిసిందే. వేరుశనగ నూనె, చిక్కి, ఉప్పు - మసాలా వేరుశనగలు, పులిహోర వంటి ఆహార పదార్థాల్లో వేయించిన వేరుశనగల వినియోగం సర్వసాధారణ విషయం. ఇటీవలికాలంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో వేరుశనగ ఆధార అనేక నూతన ఉత్పత్తుల ఆవిష్కరణలు జరిగి, నిత్యజీవితంలో వాడకానికి దోహదపడుతున్నాయి. వేరుశనగ వెన్న, పాలు, పన్నీరు, పెరుగు, వేరుశనగ పిండి ఉత్పత్తులు బాగా ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.



ఆంధ్రప్రదేశ్‌లో 18.80 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగవుతూ 26.32 లక్షల టన్నుల వేరుశనగ కాయల దిగుబడి ప్రతి సంవత్సరం జరుగుతున్నది. తెలంగాణలో 1.52 లక్షల హెక్టార్లలో ఈ పంట సాగవుతూ 2.13 లక్షల టన్నుల కాయల దిగుబడి ప్రతి సంవత్సరం జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా నాలుగు రాయలసీమ జిల్లాల్లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు వేరుశనగ సాగవుతుండగా, తెలంగాణలో వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగుచేస్తున్నారు.

వేరుశనగపిండి

వేరుశనగ నూనె వినియోగం గణనీయంగా తగ్గింది. దీంతో వేరుశనగ ఆధార నూతన ఉత్పత్తుల తయారీతో మాత్రమే రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుంది. వివిధ ఆహార పదార్థాల తయారీలో గృహ, వాణిజ్య అవసరాలకు ప్రతిరోజూ వినియోగానికి అవకాశం ఉన్న ఉత్పత్తి వేరుశనగ పిండి.

వేరుశనగలో ఉండే నూనెను పూర్తిగా లేదా పాక్షికంగా తొలగించి వేరుశనగ పిండి తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన పిండిలో కొవ్వు తక్కువగా ఉంటుంది. ప్రోటీన్ల శాతం అధికంగా ఉండి, ఆరోగ్యకర ఉత్పత్తిగా వివిధ ఆహార పదార్థాల తయారీలో మంచి వాసన, రుచి బలవర్థక పోషక విలువలను అందిస్తుంది.

పరిశ్రమ వ్యయం

ఉత్పత్తి సామర్థ్యం: రోజుకు 300 కేజీలు
పరిశ్రమ వ్యయం: రూ.25 లక్షలు

వినియోగం

బేకరీ ఉత్పత్తులు, సాస్‌లు, కెచ్అప్‌లు, వేరుశనగ టోఫీల తయారీ, బ్రేక్‌ఫాస్ట్ బార్లు & స్నాక్స్, స్వీట్స్, బలవర్థక ఆహార పదార్థాలు, పెంపుడు జంతువులకు ఆహారం, స్పోర్ట్స్ పర్సన్స్‌కు శక్తినిచ్చే ఆహారం, వేరుశనగ పేస్ట్ లేదా వెన్న తయారీ వంటి అనేక ఆహార పదార్థాల తయారీలో వేరుశనగ పిండిని ఉపయోగిస్తున్నారు. మాంసాహారం నుంచి లభించే ప్రోటీన్ల కన్నా వెజిటబుల్ ప్రోటీన్లకు గిరాకీ పెరుగుతుండటం కూడా వేరుశనగ పిండి వినియోగ వృద్ధికి తోడ్పడుతుంది.

తయారీ

వేరుశనగ గింజలను రోస్టర్ ద్వారా వేయించి పల్వరైజర్‌తో పూర్తి కొవ్వు ఉండే వేరుశనగ పిండిని తయారుచేయవచ్చు. లేదా మినీ ఆయిల్ మిల్లులో వేరుశనగల్లో ఉండే నూనె పూర్తిగా లేదా సగం అనగా 42-45% లేదా 20-32% తొలగించగా వచ్చిన మీల్‌ను రోస్టర్‌లో వేయించి తరవాత పల్వరైజర్‌తో పొడిగా చేసి, జల్లించి 500 గ్రా, 1000 గ్రాములు, 25 కేజీలు ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు పంపుకోవాల్సి ఉంటుంది.

టార్గెట్ మార్కెట్

గృహ వినియోగదారులు, ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, వేరుశనగ పిండిని చక్కెర లేదా బెల్లం పాకంలో వేసి, సువాసన ద్రవ్యాలు, ప్రిజర్వేటివ్స్ వేసి రుచికరమైన క్యాండిస్ & స్నాక్స్ తయారీ చేయవచ్చు.

యంత్ర పరికరాలు

నూనె మిల్లు, రోస్టర్, పల్వరైజర్, జల్లెడలు, తూనిక యంత్రాలు, ప్యాకింగ్ యంత్రాలు.

ముడి పదార్థాలు

నాణ్యమైన వేరుశనగ గింజలు, నూనె ప్యాకింగ్ డబ్బాలు, పొడి ప్యాకింగ్ మెటీరియల్స్.

నాణ్యమైన ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ ప్రారంభించాలని భావించే యువతీ యువకులకు ఈ పరిశ్రమ ఒక మంచి స్వయంఉపాధి అవకాశం.



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

అడ్మిషన్స్

పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా వివిధ పీజీ, డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
పీజీ కోర్సులు: ఎమ్మెస్సీ(మేథ్స్, జువాలజీ).
అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ ఉత్తీర్ణత.
- ఎంఎ(ఇంగ్లీష్, తెలుగు, మ్యూజిక్ అండ్ ఉమెన్ స్టడీస్), ఎల్ఎల్ఎం(లా డిగ్రీ ఉండాలి).

అర్హత: ఏదైనా డిగ్రీ. ఎంఎ మ్యూజిక్‌లో చేరాలంటే బిఎ మ్యూజిక్ చేసి ఉండాలి.
పీజీ డిప్లొమా కోర్సులు: ఫ్యామిలీ అండ్ హెల్త్ కౌన్సెలింగ్, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్, పబ్లిక్ రిలేషన్స్, అప్లికేషన్ సాఫ్ట్‌వేర్.
అర్హత: ఏదైనా డిగ్రీ.
డిప్లొమా కోర్సులు: మ్యూజిక్
అర్హత: పదో తరగతితో పాటు మ్యూజిక్‌లో ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
చివరి తేదీ: 2018 మార్చి 31
చిరునామా: Director, Directorate of Distance Education, Sri Padmavati Mahila Visvavidyalayam, Tirupati - 517502.
వెబ్‌సైట్: http://www.spmvv.ac.in/

జాదవ్‌పూర్ యూనివర్సిటీ

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
- డిప్లొమా - ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్

కోర్సు వ్యవధి: 3 సెమిస్టర్లు
అర్హత:బిఎస్సీ(ఎంపిసి) లేదా బిఇ/బిటెక్/బిఆర్క్/బిఫార్మసీ
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
చివరి తేదీ: 2018 జనవరి 19
రాత పరీక్ష: 2018 జనవరి 31
చిరునామా: The Director,
School of Environmental Studies,
Jadavpur University,
Kolkata - 700 032.
వెబ్‌సైట్: http://www.jaduniv.edu.in/

స్వాతంత్ర్యానంతరం విద్యా కమిషన్లు

తీగల జాన్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ



విశ్వవిద్యాలయాల కమిషన్

స్వాతంత్ర్యానంతరం విశ్వవిద్యాలయ విద్యపై సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన 1948లో ఈ కమిషన్‌ను నియమించారు. ఇది 1949లో నివేదిక సమర్పించింది. అందులోని సిఫారసులు...

- విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులను మూడు రకాలుగా వర్గీకరించాలి. అవి 1) ప్రొఫెసర్, 2) రీడర్, 3) లెక్చరర్. ప్రతిభ ఆధారంగా ప్రమోషన్లు ఉండాలి. విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల పని పరిస్థితులను మెరుగుపరచాలి.
- విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యా ప్రమాణాలు కాపాడటానికి మాధ్యమిక విద్యా దశలో విద్యా ప్రమాణాలను పెంచాలి.
- మొదటి డిగ్రీ కోర్సు కాలపరిమితిని రెండు సంవత్సరాల వరకు పొడిగించాలి
- ఎం.ఎ., ఎంఎస్‌సి, పిహెచ్‌డి కోర్సుల్లో విద్యార్థులను అఖిల భారత ప్రాతిపదికన చేర్చుకోవాలి.
- విద్యార్థుల నైతిక స్థాయిని పెంపొందించడానికి ఉన్నత విద్యా పాఠ్యప్రణాళికలో అన్ని మతాలకు సంబంధించిన నైతిక బోధనలను చేర్చాలి.
- విశ్వవిద్యాలయ దశలో ప్రాంతీయ భాషలను బోధన భాషలుగా ప్రవేశపెట్టాలి.
- పరీక్ష విధానం మారాలి. వ్యాసరూప పరీక్షలను ఆబ్జెక్టివ్ పరీక్షలతో సమన్వయం చేయాలి.
- స్త్రీ విద్యను అభివృద్ధి చేయడానికి మరిన్ని మహిళా కళాశాలలను స్థాపించాలి
- విశ్వవిద్యాలయ విద్య ఉమ్మడి జాబితాలో ఉండాలి. ఉన్నత విద్యను సమన్వయ పరచి వాటి ఆర్థిక కార్యక్రమాలను నిర్వహించడానికి యుజిసిని నియమించాలి.
- గ్రామీణాభివృద్ధి కోసం గ్రామీణ విశ్వవిద్యాలయాలను స్థాపించాలి

ఉన్నత విద్యాలక్ష్యాలు:

- రాధాకృష్ణ కమిషన్ విశ్వవిద్యాలయ విద్యా లక్ష్యాలు ఈ విధంగా ఉండాలని సూచించింది.
- రాజకీయం, పరిపాలన, వాణిజ్యం, వ్యాపారం, వ్యవసాయం, పరిశ్రమలు మొదలైన రంగాలకు కావలసిన నాయకత్వాన్ని తయారు చేయడం.
- మన నాగరికతను, సంస్కృతిని కాపాడటం, అభివృద్ధి చేయడం
- నైతిక విలువలను పెంపొందించడం
- విద్యార్థులకు పౌరసత్వ శిక్షణ ఇవ్వడం
- నూతన భావాలను కనుగొనడం
- విద్యార్థులను మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చేయడం
- విద్యార్థుల్లో అంతర్జాతీయతత్వాన్ని పెంపొందించడం



మాధ్యమిక విద్యా కమిషన్

(Secondary Education Commission-1953)

1953లో భారత ప్రభుత్వం మాధ్యమిక విద్యాసంస్థలను సంస్కరించడానికి తగిన సూచనలిచ్చేందుకు అప్పటి మద్రాసు యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ఉన్న డాక్టర్ లక్ష్మణస్వామి మొదలియార్ అధ్యక్షతన ఒక కమిషన్ CABE నియమించింది. ఈ కమిషన్ మాధ్యమిక విద్యా లక్ష్యాలు, వాటిని సంస్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై సిఫారసులు చేసింది. అవి

1. పౌరసత్వ శిక్షణ
2. మూర్తిమత్వ అభివృద్ధి
3. నాయకత్వ శిక్షణ
4. వృత్తి సామర్థ్యాన్ని మెరుగుపర్చడం

- ప్రాథమిక విద్య అనంతరం మాధ్యమిక విద్య ఏడు సంవత్సరాలు ఉండాలి. ఈ ఏడు సంవత్సరాలను రెండు దశలుగా విభజించాలి. మొదటి మూడు సంవత్సరాలు మాధ్యమిక దశ(Middle Secondary Stage) గాను, తరవాత నాలుగు సంవత్సరాలు మాధ్యమికోన్నత దశ(Higher Secondary Stage) గాను పరిగణించాలి
- విద్యా స్వరూపం 5+3+4+3గా ఉండాలి.
- ఇంటర్మీడియెట్ కోర్సు రద్దు పరచి జూనియర్ ఇంటర్‌ను హయ్యర్ సెకండరీ దశకు కలిపి నాలుగు సంవత్సరాల హైయ్యర్ సెకండరీని ప్రవేశపెట్టాలి. సీనియర్ ఇంటర్‌ను డిగ్రీ కోర్సులో కలిపి మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టాలి.

- హయ్యర్ సెకండరీ దశలో బహుళార్థక పాఠశాలలను స్థాపించాలి. ఈ పాఠశాలల్లో విద్యార్థుల అభిరుచులకు, సామర్థ్యాలకు అనుగుణంగా వైవిధ్యంగల కోర్సులను ప్రవేశపెట్టాలి
- గురుకుల పాఠశాలలను స్థాపించాలి. సాంకేతిక పాఠశాలలను పారిశ్రామిక కేంద్రాల వద్ద స్థాపించాలి. వీటిని ప్రత్యేకంగా గాని, బహుళార్థక సాధక పాఠశాలల్లో భాగంగా గాని ప్రారంభించాలి. పరిశ్రమల సహాయంతో వీటిని నిర్వహించాలి.
  పరిశ్రమలపై సాంకేతిక విద్యా పన్నును విధించి ఆ విధంగా వచ్చిన డబ్బును సాంకేతిక విద్యాభివృద్ధికి ఉపయోగించాలి.
- విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా వృత్తిపరమైన కోర్సులను ఎన్నుకోవడానికి సలహా, మార్గదర్శక కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- స్వయంపోషకంగా పబ్లిక్ పాఠశాలలు కొనసాగించాలి
- మాధ్యమిక విద్య దశలో మాతృభాష బోధన భాషగా ఉండాలి
- పాఠ్యప్రణాళిక వాస్తవ జీవితానికి ఉపయోగపడే విధంగా రూపొందించాలి.
- బోధన విధానంలో క్రియా పద్ధతిని, ప్రాజెక్ట్ పద్ధతిని ప్రవేశపెట్టాలి
- విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడానికి క్రీడలు, స్కౌటింగ్, ఎన్‌సిసి వంటి సహపాఠ్య కార్యక్రమాలను నిర్వహించాలి.
- పరీక్షా విధానాన్ని సంస్కరించాలి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలను ప్రవేశపెట్టి పరీక్షా విధానంలో ఉన్న ఆత్మాశ్రయతను తగ్గించాలి.
- డిగ్రీస్థాయిలో ఉపాధ్యాయ విద్యలో శిక్షణ పొందిన వారినే మాధ్యమిక స్థాయిలో ఉపాధ్యాయులుగా నియమించాలి. వారికి జీవిత బీమా పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాలను కల్పించాలి. శక్తి సామర్థ్యాలు గల ఉపాధ్యాయులను 60 ఏళ్ల వరకు పదవిలో కొనసాగించాలి.
- దేశవ్యాప్తంగా మాధ్యమిక విద్యా కార్యక్రమాలను సమన్వయం చేయడానికి, కేంద్రీయ మాధ్యమిక విద్యా పరిషత్‌ను స్థాపించాలి.
- నాణ్యమైన పాఠ్య పుస్తకాలను ప్రచురించడానికి టెక్స్ట్ బుక్ కమిటీలను నియమించాలి.
- సెకండరీ స్కూల్ స్థాయిలో ఒకే పబ్లిక్ పరీక్ష ఉండాలి
- కో ఎడ్యుకేషన్ పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించి అవసరమైనచోట ప్రత్యేక బాలికల పాఠశాలలను స్థాపించాలి.

ఫలితాలు:

1. బహుళార్థక ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు
2. 1953లో కేంద్ర మూల్యాంకన సంస్థను ఏర్పాటు చేశారు
3. అఖిల భారత మాధ్యమిక పరిషత్తు ఏర్పాటు

కొఠారి కమిషన్ (1964-66)

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగంలో పొందుపరచిన విలువలకు అనుగుణంగా, సంపూర్ణ విద్యా విధానం కోసం సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఆనాటి యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ చైర్మన్ డాక్టర్ దౌలత్ సింగ్ కొఠారీ అధ్యక్షన భారతీయ విద్యా కమిషన్‌ను 1964 జూలై 14న కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ తన పనిని 1964 అక్టోబరు 2 నుంచి ప్రారంభించి 1966 జూన్ 29న 'విద్యా - జాతీయ అభివృద్ధి లేదా వికాసం' అనే పేరుతో ఆనాటి కేంద్ర విద్యా మంత్రి ఎం.సి. చాగ్లాకు తన నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో మొదటి వాక్యం 'దేశ భవిష్యత్ తరగతి గదిలో నిర్మితమవుతుంది' అని పేర్కొని, విద్య మార్పునకు సాధనం అని, ఇది దేశ ప్రజల జీవన అవసరాలకు, ఆశయాలకు సంబంధించి ఉండాలని నివేదికలో ప్రస్తావించారు.

కొఠారి కమిషన్ సిఫారసులు:

జాతీయ విద్యా లక్ష్యం కింది విధంగా ఉండాలి

1. విద్య ఉత్పాదకతను పెంచాలి
2. జాతీయ, సామాజిక సమగ్రతను సాధించాలి
3. ఆధునికీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
4. ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠ పరచాలి
5. సామాజిక, నైతిక విలువలను పెంపొందించాలి

- విద్యా స్వరూపం 10+2+3గా ఉండాలి
- సామాన్య పాఠశాలను ఏర్పాటు చేయాలి
- అన్ని విద్యా దశల్లో సాధారణ విద్య అంతర్భాగంగా పని అనుభవాన్ని ప్రవేశపెట్టాలి
- అన్ని విద్యా దశల్లో సామాజిక, జాతీయ సేవ అంతర్భాగంగా ఉండాలి.
- మాధ్యమిక విద్యను వృత్తిపరం చేయాలి
- అన్ని విద్యా దశల్లోనూ మాతృభాష బోధన భాషగా ఉండాలి
- పాఠశాల దశనుంచే ఇంగ్లీష్ అధ్యయనాన్ని ప్రోత్సహించాలి. ఉన్నత విద్యా దశలో అనుసంధాన భాషగా ఇంగ్లీష్ ఉండాలి.
- కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో నైతిక, సామాజిక, ఆధ్యాత్మిక విద్యను ప్రవేశపెట్టడంలో చొరవ తీసుకోవాలి.
- మాధ్యమిక పాఠశాలలు రెండు రకాలుగా ఉండాలి
- విద్య స్వతంత్ర ప్రతిపత్తిగల వైజ్ఞానిక శాఖగా గుర్తింపు పొందాలి
- ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఉద్దేశించిన ఉపాధ్యాయ శిక్షణకాలం రెండు సంవత్సరాలు, మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఉద్దేశించిన ఉపాధ్యాయ శిక్షణకాలం ఒక సంవత్సరం ఉండాలి.
- పది సంవత్సరాల పాఠశాల విద్యలో భాగంగా సైన్స్, మేథ్స్ తప్పనిసరి సబ్జెక్టులుగా బోధించాలి
- పరీక్ష పత్రాలను శాస్త్రీయంగా తయారు చేసి బాహ్య పరీక్ష విధానాన్ని మెరుగుపరచాలి
- విద్యార్థి వికాసం అన్ని అంశాలను మూల్యాంకనం చేసేలా అంతర్మూల్యాంకనం సమగ్రంగా ఉండేలా చూడాలి
- అంతర్జాతీయ ప్రమాణాలను సాధించడానికి ప్రముఖ విశ్వవిద్యాలయాలను, అభ్యుదయ అధ్యయన కేంద్రాలను స్థాపించాలి.
- వ్యవసాయ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి
- వయోజన విద్యను అమలు చేయడంలో సామూహిక ఎంపిక విధానాన్ని అనుసరించాలి
- వికలాంగులైన, వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య విషయంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- విద్యా విస్తరణను యోచించేటప్పుడు మానవశక్తి అవసరాలు గమనంలో ఉంచుకోవాలి
- విద్యార్థులను సరైన దారిలో పెట్టడానికి మార్గదర్శక, మంత్రణల సేవలను విద్యలో అంతర్భాగంగా ప్రవేశపెట్టాలి
- ఉపాధ్యాయుల ఆర్థిక, సాంఘిక, వృత్తిపరమైన అంతస్థును పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలి
- పాఠ్యప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకన విధానాలను మెరుగుపరచాలి.

ప్రాముఖ్యత: కొఠారి కమిషన్ భారతీయ విద్యా విధానాన్ని మెరుగుపరచడానికి ముఖ్యమైన, విలువైన సిఫారసులను చేసింది. భారత ప్రభుత్వం అనేక సిఫారసులను ఆమోదించి అమలు చేసింది. కొన్ని రాష్ట్రాలు కమిషన్ సిఫారసులను అనుసరించి జీతభత్యాలను పెంచాయి. 1968లో ఈ కమిషన్ సిఫారసులను అనుసరించే మొదటి జాతీయ విద్యావిధానం ఏర్పడింది.

జాతీయ విద్యా విధానం (1968)

ముఖ్యాంశాలు:

- 6-14 సంవత్సరాల పిల్లలకి నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను అమలు చేయడానికి గట్టి చర్యలు చేపట్టాలి.
- విద్యకు ఆటంకంగా మారిన వృథా, స్థబ్దతలను తగ్గించాలి
- ఉపాధ్యాయ అర్హతలను బట్టి వారి వేతనాలు ఉండాలి
- ఇన్ సర్వీస్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- మాతృభాషలోనే బోధించాలి
- సెకండరీ స్థాయిలో త్రిభాషా సూత్రాన్ని పాటించాలి
- ఆంగ్లం, ఇతర అంతర్జాతీయ భాషల అధ్యయనానికి ప్రాధా న్యం ఇవ్వాలి.
- విద్యలో ప్రాంతీయ అసమానతలు తగ్గించాలి
- అన్ని సాధారణ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచాలి
- విద్యలో పని అనుభవం, జాతీయ సేవ అంతర్భాగంగా ఉండాలి
- జాతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడానికి విజ్ఞాన శాస్త్రం, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ప్రతి రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి
- మూల్యాంకనం నిరంతర ప్రక్రియగా ఉండాలి
- శారీరక అభివృద్ధి కోసం క్రీడలను అభివృద్ధి చేయాలి
- విద్యాస్వరూపం 10+2+3గా ఉండాలి
- జాతీయ ఆదాయంలో విద్యకు 6 శాతం నిధులు కేటాయించాలి

శ్రీవారికి ధనుర్మాస పూజలు

రైల్వేకోడూరు, డిసెంబర్30: పట్టణంలోని శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ధనుర్మాసపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి బండాత్మ కూరుమణికంఠశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామివారికి అలంకరణలు, తోమాలసేవ కార్యక్రమాలు నిర్వహించారు. వందలాదిమంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని పూజలుచేశారు. తీర్థప్రసాదాలను శ్రీవారి భక్తులు గునిశెట్టిరామచంద్రయ్య, క్రిష్ణయ్యలు పంపిణీచేశారు.



కొత్త సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి



పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

ఓబులవారిపల్లె, డిసెంబర్.30 : కొత్త సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఓబులవారిపల్లె ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. ప్రధానంగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్లపై అల్లరి చేస్తే చర్యలు తప్పవన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుట, ట్రిపుల్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచామ న్నారు. 10బృందాల వాహనాలతో తనిఖీలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు. రాత్రి 8గంటల నుంచి తెల్లవారి 6గంటల వరకు తనిఖీలు ఉంటాయని, ఎవరైనా మద్యం సేవించి పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అంతే కాకుండా ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో పరిధిలోని పాత నేరస్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదాలకు గురికావద్దు

● నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి ● రైల్వేకోడూరు సీఐ కె.సాయినాథ్





అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ సాయినాథ్, పాల్గొన్న సాయి విద్యార్థిని, విద్యార్థులు

రైల్వేకోడూరు, డిసెంబర్30: యువత నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని వాహనాల్లో అతి వేగంగా వెళ్లి రోడ్డు ప్రమాదాలకు గురికావద్దని రైల్వే కోడూరు సీఐ కె.సాయినాథ్ సూచించారు. శనివారం స్థానిక సాయిడిగ్రీకాలేజి ఆవరణలో కాలేజి అధినేత ముత్యాలపెంచలయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రోడ్డుభద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు మద్యంసేవించివాహనాలు నడపరాదని, ఓవర్‌టేక్ చేయరాదని, రద్దీప్రదేశాల్లో నెమ్మదిగా వెళ్లాలని, ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్లకూడదని తెలిపారు. కొందరు యువకులు మద్యం సేవించి వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాటన్నింటిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. విలువైన ప్రాణాలుపోతే కుటుంబంపడే బాధలు అన్నీ ఇన్నీకావన్నారు. రోడ్డుప్రమాదాలు నివారించడానికి అనేక చర్యలుతీసుకుంటున్నామన్నారు. ఎక్కడ సమస్యలు ఎదురుకాకుండా ప్రతి 20కిలోమీటరుకు వాహనాలు ఏర్పాటుచేసి అక్కడ సిబ్బంది ఉండేవిధంగా చర్యలు తీసుకుటున్నామన్నారు. ప్రజలసహకారంతోనే పోలీసులు ముందుకువెళతారని, ప్రజలు అన్నివిధాలసహరించాలన్నారు. ఎర్రచందనం అక్రమరవాణా విషయంలో సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా గణాంకాలు

ఏఎస్‌వో కోనేరువెంకటేశ్వర్లు,
సెల్‌నెం.9959097249



ఇంటర్వ్యూ

రైల్వేకోడూరు, డిసెంబర్30: పారదర్శకంగా గణాంకాలు జరుగుతున్నాయని కోడూరు రెవెన్యూ అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి(ఏఎస్‌వో) కోనేరు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జనాభాలెక్కలు, వ్యవసాయగణాంకాలు, ఆర్థికగణాంకాలు, చిన్నతరహా నీటివనరుల గణాంకాలు చేస్తామని తెలిపారు. సర్వేలు చేయించేప్పుడు సక్రమంగా లోపాలులేకుండా చేయించి ప్రభుత్వానికి తహశీల్దార్ ద్వారా నివేదికలు పంపుతామని తెలిపారు.

ప్రశ్న: 2011జనాభా లెక్కల ప్రకారం రైల్వేకోడూరులో ఎంతమంది జనాభా ఉన్నారు?

జవాబు: 90,814 మంది జనాభా ఉన్నారు. ఇందులో స్త్రీలు 45,146మంది, పురుషులు 45,668మంది ఉన్నారు.

ప్రశ్న: ఆర్థికగణాంకాలు ఎలాఉన్నాయి?

జవాబు: చిన్నతరహా, మధ్యతరహా, కుటీరపరిశ్రమలు ఉన్నాయి. ఇందులో 30చిన్నతరహా,మధ్యతరహాపరిశ్రములు ఉన్నాయి. 1500 కుటీరపరిశ్రమలు, 4900 దుకాణాలు ఉన్నాయి.

ప్రశ్న: చిన్నతరహా నీటివనరులు ఎన్ని ఉన్నాయి?

జవాబు: చెరువులు, కుంటలు 22, బోర్లు 2200ఉన్నాయి.

ప్రశ్న: సర్వేలు ఎలాచేస్తారు?

జవాబు: ప్రతిగ్రామంలో ఉన్న వ్యవసాయబోర్లు, నీటికుంటలు, చెరువులు, పంటలు, దుకాణాలు తదితరవాటిని లెక్కించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతాము.

రూ.1.96కోట్ల పనుల్లో రూ.7500 రికవరీ



సోషల్ ఆడిట్‌లో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ సురేష్

పుల్లంపేట, డిసెంబర్.30 : మండలంలో 2017 జనవరి నుంచి అక్టోబర్ చివరి వరకు జరిగిన 1.96కోట్ల రూపాయల పనుల్లో 7500రూపాయలు రికవరీ చేసినట్లు అడిషనల్ పీడీ సురేష్ తెలిపారు. శనివారం మండలంలోని 20పంచాయతీల్లో ఉపాధి పనులపై సోషల్‌ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది రికార్డులు సక్రమంగా నిర్వహించనందుకు 4వేల రూపాయలు జరిమానా విధించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబందించి 7రకాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. రికార్డులన్నీ పంచాయతీ కార్యాలయంలో ఉంచాలన్నారు. పనులపై గ్రామసభలో తీర్మానం తప్పనిసరిగా జరగాలని సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించాలన్నారు.

కూలీల గిట్టుబాటు అయ్యే విధంగా పనులు చేయించాలని ముఖ్యంగా కేంద్రం నుంచి వచ్చే ఉపాధి నిధులతో చేస్తు న్న పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ఉండాల ని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గౌరీశంకర్, ఏపీ వరప్రసాద్, ఈవోఆర్‌డి నాగార్జునరావు, ఏపీవో చంద్రకళ, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

ఓబులవారిపల్లె : మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రైల్వేకోడూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఓబులవారిపల్లె ఎస్ఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. కొత్త మంగంపేటకు చెందిన కొత్తి శాంతయ్య, గోవిందంపల్లె పంచాయతీ సిరిగిరాజుపల్లెకు చెందిన సిరిగిరాజు మణిరాజు, నాగవరం వడ్డిపల్లెకు చెందిన కొర్రపోతుల వెంకటసుబ్బయ్యలు మద్యం తాగి వాహనాలు నడుపుతూ వాహన తనిఖీతో పట్టుపడ్డారన్నారు. కేసు నమోదు చేసి రైల్వేకోడూరు కోర్టుకు హాజరు పెట్టగా న్యాయ మూర్తి మూడు రోజులు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రవీంద్రభారతీస్కూల్లో ముందస్తు నూతన వేడుకలు



నూతనసంవత్సరం సంబరాలు జరుపుకుంటున్న పిల్లలు

రైల్వేకోడూరు, డిసెంబర్30: స్థానిక రవీంద్రభారతీస్కూలులో శనివారం ముందస్తు నూతనసంవత్సరం వేడుకలు ప్రిన్సిపాల్ గంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పిల్లలకు అన్ని శుభాలు జరగాలని భగవంతుడిని కోరుకున్నామని తెలిపారు. అనంతరం పిల్లలు ఒకరినొకరు శుభాంకాక్షలు తెలుపుకున్నారు. అమ్మాయిలకు ముగ్గులపోటీలు, అబ్బాయిలకు గాలిపటాలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూలు ఇన్‌ఛార్జ్ వసంతమ్మ, లావణ్య, మేనేజర్ బాలసుబ్బయ్య, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

వై.కోటలో సిమెంటు రోడ్డు పనులకు శ్రీకారం

ఓబులవారిపల్లె, డిసెంబర్.30 : మండలంలోని వై.కోట దళితవాడలో శనివారం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్‌రాయులు సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు. వై.కోట దళితవాడలో దశాబ్దాలుగా సిమెంటు రోడ్లకు నోచుకోలేదు. దీంతో సర్పంచ్ బాలాజీ దళితవాడలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని బత్యాలను కోరారు. వెంటనే నిధులు మంజూరు చేయించి పనులకు భూమి పూజ చేయించారు. కార్యక్రమంలో రైఏల్వకోడూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ జోగినేని మణి, జెడ్పీటీసీ రమణయ్య, ఓబులవారిపల్లె, సర్పంచ్ శ్రీధర్, మాజీ సర్పంచ్ నరసయ్య, కోడి ప్రభాకర్ పాల్గొన్నారు.



రోడ్డు భూమి పూజలో మాజీ ఎమ్మెల్సీ బత్యాల

వెంకయ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు

రైల్వేకోడూరు, డిసెంబర్30: పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయనిర్వాహకులు చంద్రయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
రైల్వే కోడూరు
13
కడప । ఆదివారం 31 డిసెంబరు 2017
రైల్వేకోడూరు । పెనగలూరు । చిట్వేలి । పుల్లంపేట । ఓబులవారిపల్లె

కోడూరులో బీజేపీ శక్తి కేంద్రాలు ఏర్పాటు

రైల్వేకోడూరు, డిసెంబర్30: మండలంలో బీజేపీ శక్తికేంద్రాలు ఏర్పాటుచేసినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గల్లాశ్రీనివాసులు, రాష్ట్రకిసాన్‌మోర్చా కార్యవర్గసభ్యులు తోటశ్రీనివాసులు తెలిపారు. శనివారం బూత్‌కమిటీల విస్తరణ, శక్తికేంద్రాల నియామకం గురించి చర్చించారు. బీజేపీని నియోజకవర్గంలో బలోపేతంచేయడానికి ముమ్మరంగా కృషిచేస్తామని, అన్ని మండలాల్లో బూత్‌కమిటీలు వేస్తామన్నారు. సమావేశంలో ఓబీసీ కార్యవర్గసభ్యులు బత్తలసుబ్రమణ్యం, జిల్లా కార్యవర్గసభ్యులు ఊటుకూరుచలపతి, కోడూరు అధ్యక్షులు వాకదర్లసుబ్బారావు, నాయకులు ఇరువూరిమహేష్ పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం




:సమావేశానికి హాజరైన ప్రజలు, సమావేశంలో ప్రసంగిస్తున్న బ్యాంకు మేనేజర్

రాజంపేట రూరల్, డిసెంబర్ 30 : డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండలంలోని ఊటుకూరు ఆంధ్రప్ర గతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ బాబునా యక్, మునిప్రసాద్‌లు పేర్కొన్నారు. రాజంపేట మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీలో డిజిటల్ లావాదేవీలు, వ్యక్తిగత ఖాతాల పొదుపు, బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీ రుణాలు, బ్యాంకులో డబ్బులను దాచుకోవడం వల్ల కలిగే ఉప యోగాలను గ్రామ ప్రజలకు వివరించారు. శనివారం రాజంపేట మండలంలోని ఊటుకూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ బాబునాయక్, మునిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలకు బ్యాంకు లావాదేవీలను వివరించారు. అదే విధంగా కడప నుంచి ప్రత్యేకంగా వచ్చిన కె.ఎస్.రూరల్ మీడియా కళాజాగృతి బృందం సభ్యులచే ఆట పాటలు, చిన్న లఘు చిత్రాల ద్వారా ప్రజలకు బ్యాంకు ఉపయోగాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుతం వస్తున్న అపోహాలను ప్రజలు నమ్మరాదని, బ్యాంకులు ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందించడం జరుగుతున్నదని వారు తెలిపారు.

బ్యాంకులో నగదు దాచుకోవడం వల్ల భద్రతతో పాటు నమ్మకం కూడా ఉంటుందని, బ్యాంకులో రుణాలు, గోల్డ్‌లోన్‌లు, వ్యక్తిగత లోన్‌లు, పొదుపు పథకాలు, గ్రామీణ మహిళలకు రుణాలు తదితర అంశాలను వారు వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులకు జైలు



రైల్వేకోడూరు, డిసెంబర్30: మద్యంతాగి వాహనాలు నడిపిన వ్యక్తులకు జైలు, జరిమానా విధిస్తూ శనివారం రైల్వేకోడూరు న్యాయస్థానం న్యాయమూర్తి ప్రసూన తీర్పు నిచ్చినట్లు రైల్వేకోడూరు సీఐ కె.సాయినాథ్, ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. కోడూరులో వారు మాట్లాడుతూ 38కేసులకు సంబంధించిన వ్యక్తులను కోర్టులో హాజరుపరిచగా వాటిని పరిశీలించిన న్యాయమూర్తి రైల్వేకోడూరు మండలంలోని మాదవరంపోడు గ్రామానికిచెందిన ఈశ్వర్‌రాజు అనేవ్యక్తికి రూ.4500, మూడురోజులపాటు జైలుశిక్షవిధించారని తెలిపారు. కోడూరు పట్టణంలోని ధర్మాపురంకుచెందిన తోటబాలసుబ్రమణ్యంకు మూడురోజులజైలుశిక్ష, రూ.4500జరిమానా విధించారని, న్యూక్రిష్ణానగర్‌కుచెందిన జి.రమేష్‌కు మూడురోజులజైలుశిక్ష, రూ.4వేలు జరిమానా విధించారని తెలిపారు. ఓబులవారిపల్లె మండలంలోని కొత్తమంగంపేటకుచెందిన కట్టి శాంతయ్యకు మూడురోజుల జైలుశిక్ష, రూ.4500జరిమానా, శింగిరివారిపల్లెగ్రామానికిచెందిన శిరిగిరాజుమణిరాజు, చిట్వేలిమండలంలోని నాగవరంకుచెందిన కొరవట్లవెంకటసుబ్బయ్యకు మూడురోజులపాటు జైలుశిక్ష, రూ.4500జరిమానా విధించినట్లు తెలిపారు. వారందరిని రాజంపేటసబ్‌జైలుకు తరలించామన్నారు.

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు



పూర్వ విద్యార్థి రవీంద్రను సన్మానిస్తున్న భూమన శివశంకర్‌రెడ్డి

నందలూరు, డిసెంబర్.30 : ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టంతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని జిల్లా మేజర్ గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు భూమన శివశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎస్టీ జోసెఫ్ పాఠశాలలో చదువుకొని ఇటీవల నిర్వహించిన గ్రూప్-3లో జిల్లా టాపర్‌గా నూ, గ్రూప్-2లో కూడా అర్హత సాధించిన కొత్తపల్లి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ 8 నుండి 10 వరకు జోసఫ్ పాఠశాలలో చదివి నేడు మంచి స్థానాల్లో నిలిచారన్నారు. ఇటువంటి విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ఒక ప్రణాళిక ప్రకారం ఆ పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలను తయారు చేసుకొని సమయాన్ని కేటాయించి చదివితే ప్రతి ఒక్కరూ విజయం సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.కమల మ్మ, ఉపాధ్యాయులు శేరి, ఫైరోజ్‌సింగ్, చైతన్య, దేవర, ఇంతియాజ్, నాగవేణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి సుబ్బరాయుడుకు కన్నీటి వీడ్కోలు




పసుపులేటి సుబ్బరాయుడు భౌతికకాయం, హాజరైన మాజీ ఎమ్మెల్సీ బత్యాల, ఎద్దల సుబ్బరాయుడు

రాజంపేట,డిసెంబరు30: రాజంపేట మండలం శేషమాంబపురం మాజీ డీడీటీ పసుపులేటి సుబ్బరాయుడుకు శనివారం కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు అనేక మంది నాయకులు హాజరయ్యారు.

రేణిగుంట ఎంపీపీ పసుపులేటి విజయభాస్కర్ తండ్రి, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్‌వీ రమణ మామ అయిన పసుపులేటి సుబ్బరాయుడు శుక్రవారం మృతి చెందారు. శనివారం జరిగిన అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయులు, ఆర్టీసీ రీజనల్ మాజీ ఛైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, తిరు పతి డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సీహెచ్ ప్రతాప్ తిరుపతి ఆర్టీఓ జి. వివేకానందరెడ్డి, చిత్తూరు జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారులు, అనంతరం జిల్లా ఆర్టీఓ మలికార్జున తిరుపతి డీఎస్పీ మునిరామయ్య, నందలూరు మాజీ మండలాధ్యక్షుడు కలువకూటలి సాయిబాబా, పల్లె సుబ్రమణ్యం, టీడీపీ మహిళా నేత పత్తిపాటి కుసుమకుమారి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, నందలూరు కథానిలయం అధ్యక్షుడు అబ్బిగారి రాజేంద్రప్రసాద్‌తోపాటు రాజంపేట, కోడూరుకు చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు.

అభివృద్ధే టీడీపీ లక్ష్యం

సుండుపల్లె, డిసెంబర్30: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి తెలిపారు. శనివారం మడితాడు గ్రామం ఉప్పరపల్లెలో రూ.6 లక్షలతో సిమెంటు రోడ్డు ఏర్పాటుకు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాయవరం మాజీ సర్పంచ్ పీవీ రమణయ్య, తిమ్మసముద్రం సింగిల్‌విండో అధ్యక్షులు జయరామనాయుడు, నాయకులు ఆనందరెడ్డి, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విస్తృతంగా వాహన తనిఖీలు

పుల్లంపేట : నూతన సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా తీసుకున్న జాగ్రత్త చర్యల్లో భాగంగా 31రాత్రి 8గంటల నుంచి జనవరి ఉదయం 6గంటల వరకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా 10టీములు ఏర్పాటు చేశామన్నారు. తాగి వాహనాలు నడిపినా.. మద్యం సేవించి రోడ్లపై అల్లర్లు చేసినా వాహనాలు సీజ్ చేయడంతో పాటు నడిపిన వారి ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన నెంబర్‌తో పాటు పూర్తి సమాచారాన్ని సేకరించి పోలీసు రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు కారణంగా ఉద్యోగ రీత్యా కానీ, పాస్‌పోర్టు, వీసా పొందడంలో పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్ పొందడంలో పోలీసుల నుంచి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అధిక వేగంగా వెళ్ళినా, త్రిబుల్‌రైడింగ్ చేసినా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే పోలీసుల అనుమతి లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు కానీ, బాణా సంచా పేలుళ్ళు చేసినా కేసులు పెడతామన్నారు. ముఖ్యంగా అశ్లీల నృత్యాలు చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

క్రీడల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


రాజంపేట రూరల్, డిసెంబర్.30 : రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో పాల్గొని జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమణరాజు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం, కోల్‌కత్తాలో కరాటే చాంపియన్‌షిప్ జరిగింది. కళాశాలకు చెందిన 6మంది విద్యార్థులు జగదీష్‌కుమార్, మస్తాన్ షరీఫ్, పెంచలరాజు, నవీన్, శ్రీనివాసులు, మహేష్‌బాబు ఈ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారన్నారు. జగదీష్‌కుమార్ కట్టి నందు బంగారు పతకం, నవీన్ కుమిత్తే నందు బంగారు పతకం, మహేష్‌బాబు కట్టి నందు బంగారు పతకం, 60కేజీల విభాగంలో మస్తాన్‌షరీఫ్, 52కేజీల విభాగంలో 65కేజీల పెంచలరాజు, హెవీవెయిట్ కట్టి నందు రజత పతకాలను సాధించినట్లు స్పోర్ట్స్ డిజిటల్ డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. కళాశాలలో 6 బంగారు పతకాలు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ రమణరాజు, కరాటే మాస్టర్ ఆనందాచారి విద్యార్థులను అభినందించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 4, 8


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కమ్యూనికేషన్ రంగం వారికి శుభప్రదం. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): వేడుకలకు ఖర్చు చేస్తారు. ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.


మిథునరాశి: (మే21-జూన్21): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పెన్షన్, మ్యూచువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్‌మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు. చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. చిన్నారుల విజయం అనందం కలిగిస్తుంది.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రుల కలయికతో ఇల్లు సందడిగా ఉంటుంది. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీసోదరుల సహకారం లభిస్తుంది.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): స్పెక్యులేషన్లు లాభిస్తాయి ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): విందుల్లో పాల్గొంటారు. వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరతారు. లేదా వారి నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.


మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సీసీ , బాడీవార్న్ కెమెరాలతో నిఘా

● ప్రజలు సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలి
● జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ● ఎస్పీ అట్టాడ బాబూజీ



కడప క్రైం, డిసెంబరు 30 : జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు, ప్రధాన కూడళ్లలో పికెట్‌లు, స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేశామని ఎస్పీ అట్టాడ బాబూజీ పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రతి సంవత్సరం చాలా మంది యువకులు రోడ్డు ప్రమాదాల బారిన పడి తమ అమూల్యమైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సీసీ, బాడీవార్న్ కెమెరాల ద్వారా నిఘా ఉంటుందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, బైక్ రేసింగ్‌లు చేసినా, బైక్‌లకు సైలెన్సర్ తీసి విపరీతమైన శబ్దాలు చేస్తున్న వారిని కెమెరాల ద్వారా గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబరు 31 తేది రాత్రి 10గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా బ్రీత్ అనలైజర్, స్పీడ్‌గన్‌లతో వాహనాలు తనిఖీ నిర్వహిస్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో, విద్యార్థినులవసతి గృహాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నా రు. నూతన సంవత్సర వేడుకల పేరిట ఇతరులకు ఇబ్బంది కలిగించినా, సాం స్కృతిక కార్యక్రమాల పేరిట అసభ్య నృత్యాలను నిర్వహించినట్లు తెలిస్తే మాత్రం వారి తాట తీస్తామని హెచ్చరించారు. నూతన సంవత్సర సందర్భం గా మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసే సమయాల్లో కానీ, ఆలయాలకు వెళ్లే సమయాల్లో కానీ చైన్ స్నాచింగ్ జరిగే అవకాశాలు ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువత, తల్లిదండ్రులు పిల్లలకు మోటారు బైక్‌లు ఇవ్వకుండా చూడాలన్నారు.జిల్లా ప్రజలు సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు నూత న సంవత్సర శుభాకాంక్షలను ఎస్పీ బాబూజీ తెలిపారు.

సబ్సిడీ రుణాల సమస్యలకు పరిష్కార చర్యలు

కడప, ఐటిఐ సర్కిల్, డిసెంబర30 : జిల్లాలో వెనుకబడిన తరగతుల వారికి, కాపు సామాజిక వర్గం వారికి ఆయా కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేస్తున్న రాయితీ రుణా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2017- 18 ఆర్థిక సంవత్సరానికి గాను యూనిట్ల ఏర్పాటుకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన రాయితీ ఆయా బ్యాంకులకు పంపడం జరిగిందన్నారు. అభ్యర్థులు వారికి సంబంధించిన బ్యాంకు మేనేజర్లను సంప్రదించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే ఆయా డివిజన్ల పరిధిలో ఉన్న మండలాల సమస్యలను పరిష్కరించడానికి ముగ్గురికి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్లను నియమించడం జరిగిందన్నారు. రాజంపేట డివిజన్‌కు సంబంధించి సెల్ 98850 21440, కడప డివిజన్‌కు 9849981659, జమ్మలమడుగు డివిజన్‌కు 9491054116 నంబర్లను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

2న డిప్యూటీ సర్వేయర్లు సర్టిఫికెట్లతో హాజరు కావాలి

కడప కలెక్టరేట్, డిసెంబరు 30 : ఏపీపీఎస్‌సీ ద్వారా జిల్లాలో డిప్యూటీ సర్వేయర్లుగా కొత్త నియామకమై ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు జనవరి 2వతేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని జిల్లా సర్వే, భూమి రికార్డుల సహాయ సంచాలకుడు మారుతీప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే సెటిల్‌మెంట్, భూముల రికార్డులు స్పెషల్ కమిషనర్ విజయవాడ ఉత్తర్వుల మేరకు నియామకం అయిన అభ్యర్థులు రెండు జతల అటెస్ట్ సర్టిఫికెట్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో కలెక్టరేట్‌లోని సి.బ్లాక్ సెకండ్ ఫ్లోర్‌లో ఉండే జిల్లా సర్వే శాఖ కార్యాలయంలో ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9866169507కు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం కావాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ సెక్రటరీ దినేష్‌కుమార్

కడప కలెక్టరేట్, డిసెంబరు 30 : ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వేగవంతానికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేషకుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అమరావతిలోని చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శి గృహ నిర్మాణం, జాతీయ ఉపాధి హామీ పథకం, ఎన్‌టీఆర్ జలసిరి, ట్రైబల్ డ్రింకింగ్ వాటర్, పీఎం, జీఎస్‌వై, సీసీ రోడ్లు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం తదితర అంశాల పురోగతిపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అధికారులకు నిర్ధేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణంలో ఎన్ని గృహాలు మంజూరయ్యాయి, ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయని ఇంకా ఎన్ని పెండింగులో ఉన్నాయనే దానిపై ఆరా తీసి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి గృ హ నిర్మాణాల పురోగతికి కృషి చేయాలన్నారు. కలెక్టర్‌ను జిల్లాగృహ నిర్మాణాలకు సంబంధించి పురోగతి గురించి అడగ్గా, అందుకు కలెక్టర్ గృహ నిర్మాణాల పురోగతికి కృషి చేస్తామని నివేదించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ హరిహరనాథ్, డీఆర్‌వో బాబయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ శాస్త్రవేత్తలు మీరే...

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ లింగారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30 : అవసరాలకు అనుగుణంగా సరికొత్త ఆలోచనలతో పరిశోధనలు నిర్వహిస్తే భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో శనివారం 45వ జవహర్‌లాల్ విజ్ఞానశాస్త్ర, గణితశాస్త్రం, పరిసరాల ప్రదర్శన ముగింపు సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాలను ప్రత్యేక దృష్టితో గమనిస్తే కొత్త కొత్త ఆలోచనలు వస్తాయని, వాటిని విజ్ఞానంతో పరిశోధిస్తే మంచి పరిశోధన వస్తుందన్నారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. పరిశోధన చేయాలంటే దానిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా సైన్స్‌అధికారి రవికిరణ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 160 ఎగ్జిబిట్స్ వచ్చాయన్నారు. వీటిలో రాష్ట్ర స్థాయికి 18 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు.నెల్లూరులో జనవరి 3,4,5 తేదీల్లో జరుగు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఉప విద్యాధికారి జిలానీబాష ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాధికారి హేమలత, వ్యాఖ్యాత పార్వతి, హెచ్‌ఎం సత్యసుజాత, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

విజేతలు...

వ్యక్తిగతం... మహ్మద్‌రఫీ (మాసాపేట జడ్పీహెచ్‌ఎ స్) , పి.శివయ్య (ఎస్‌బీపీఎస్‌ఎస్ హైస్కూలు), సి.వనజ (జడ్పీహెచ్‌ఎస్, సీకేదిన్నె), ఎం.రెడ్డిమణి(కేజీబీవీ , సంబేపల్లె) కె.అశ్విని(కేజీబీవీ,ఎల్‌ఆర్‌పల్లె),జి.దీపికాలక్ష్మి (కేజీబీవీ,మైదుకూరు) ఎంపికయ్యారు.

గ్రూపులు... పి.గంగాభవాని, హరిత (జడ్పీహెచ్‌ఎస్ పోట్లదుర్తి), ఎస్.వెంకటేశ్వరరాజు, బాలక్రిష్ణ (జడ్పీహెచ్‌ఎస్ తాళ్లపాక), ఎస్.జావీదు, కాశిమ (పుష్పగిరివిద్యా సంస్థలు), రెడ్డిదేవి, వి.భార్గవి (జడ్పీహెచ్‌ఎస్ వలూరు), వి.స్మృతి, చంద్రకళ (కేజీబీవీ, గాలివీడు), నాగహర్ష, అనూష (రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూలు, ఖాజీపేట),

ఉపాధ్యాయుల ఎగ్జిబిట్స్... బీపీ విజయప్రసాద్ (జడ్పీహెచ్‌ఎస్, లేబాక), ఎస్ఆర్ వెంకట జనార్ధన్‌రెడ్డి (జడ్పీహెచ్‌ఎస్, ఉప్పలూరు), ఎస్.సిబువితుల్లా (జడ్పీహెచ్‌ఎస్, చిట్వేలి), కె.అరుణ (కేజీబీవీ, రామాపురం), సుభాషిణి (కేజీబీవీ, పుల్లంపేట), డి.శ్రీనివాసులు (జడ్పీహెచ్‌ఎస్, లక్కిపేట).


ప్రసంగిస్తున్న లింగారెడ్డి,


రాష్ట్ర స్థాయికి ఎంపికయిన విద్యార్థులతో లింగారెడ్డి, కత్తి నరసింహారెడ్డి

హైదరాబాద్ ● ఆదివారం, 31 డిసెంబర్ 2017



ఒకటికి మూడు

చిత్రంలో కనిపిస్తున్న జంతువును తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!

1. ఒంటె
2. camel
3. ऊँट




తేట తెలుగు

కౌశలం = నేర్పు

అనలం = నిప్పు

సలిలం = నీరు

వైనం = విధం



వారిద్దరూ చిన్న పిల్లలు. అక్కాచెల్లెళ్లు. ఇంకా ఆట పాటలతో కాలం గడిపే పసితనపు ఛాయలైనా వదలిపోలేదు. కానీ ఇంత చిన్న వయసులోనే సేవా భావనతో తమ పెద్దమనసును చాటుకుంటున్నారు. ఆ చిన్నారులు తమ సొంత ఇంటి లోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి తోటి విద్యార్థులకు పుస్తకాలు చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు ఆ అక్కాచెల్లెళ్లు.

పేద విద్యార్థుల కోసం పిల్లల పుస్తకాలయం!



మనస్వి దుగార్ వయసు 12 ఏళ్లు. సుహాసిని దుగార్ వయసు 9 ఏళ్లు. ఈ అక్కాచెల్లెళ్లు ఇద్దరు కోల్‌కతా, బాలీగంజ్, దోవర్‌లోని తమ ఇంటిలో, ఓ గదిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 300 చ. అడుగుల విస్తీర్ణం ఉంటుంది. ఈ గ్రంథాలయంలో సైన్స్, చరిత్ర, భూగోళ శాస్త్రం, ఇంగ్లీష్ కథలు లాంటి వివిధ రకాల పుస్తకాలు వెయ్యికి పైగా ఉన్నాయి. సోమవారం నుంచి శనివారం వరకు ఈ గ్రంథాలయం తెరచి ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 11 గం. నుంచి రాత్రి 7. గం. వరకు పిల్లలు పుస్తకాలు చదువుకోవచ్చు. తొలుత ఈ చిన్నారులు పేద విద్యార్థులకు పుస్తకాలు కొనివ్వాలనుకున్నారు. కానీ అలా చేస్తే తక్కువ మందికే సహాయం చేయగలమని భావించారు. తల్లి శీతల్ దుగార్ సహాయంతో దగ్గర్లోని సెయింట్ లారెన్స్ స్కూల్, సుశీలా బిర్లా స్కూల్ నుంచి ఇక్కడకు అన్ని వయసుల పిల్లలు వస్తున్నారు. వారికి నచ్చిన పుస్తకాలు చదువుకుంటున్నారు. వారి దగ్గర నుంచి ఎలాంటి ఫీజు, సభ్యత్వ రుసుం తీసుకోవటం లేదు. మనస్వి, సుహాసినిల సేవాభావాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.



పద్యం

ఎప్పుడు సంపదకలిగిన
నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్
తెప్పలుగ జెరువు నిండిన
కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!

భావం : చెరువు నిండుగా ఉన్నప్పుడు కప్పలు ఉన్నట్లే, సంపద ఉన్న చోట బంధువులు, మిత్రులు వంద మంది చేరుతారు.

పొడుపు కథలు

చెట్టుకు కాయని కాయ
కరకరలాడే కాయ
తడిస్తే గుప్పెడు
ఎండితే బుట్టెడు



నోరు తిరుగుతోందా?

The thirty three thieves thought that they thrilled the throne through out thursday.

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. కెట్‌క్రి ▶ ....
2. ఫుబాట్‌ల్ ▶ ....
3. బావాలీల్ ▶ ....
4. ట్‌బాస్కెల్‌బా ▶ ....
5. గ్‌జంలాంప్ ▶ ....


సామెతలు

అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు
ఆకాశానికి నిచ్చెన వేసినట్లు

జవాబులు

జంతర్‌మంతర్ : 1. క్రికెట్ 2. ఫుట్‌బాల్
3. వాలీబాల్ 4. బాస్కెట్‌బాల్ 5. లాంగ్‌జంప్
ఒకటికి మూడు : ఊంట్

బొమ్మ గీయండి



సూక్తి

మనకున్న దానితో సంతృప్తి పడటం ఉత్తమమే కానీ, మనకున్న జ్ఞానం చాలనుకోవడం అజ్ఞానం.

- సర్వేపల్లి రాధాకృష్ణన్



రేపు దాంపత్య వ్రత మహాయాగం

కడప (కల్చరల్), డిసెంబరు 30 :



రామదూత స్వామి

నగరంలోని స్కాట్ హాలు గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం 5 గంటలకు శ్రీగురుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రత మహాయాగం దత్త అవధూత భగవాన్ రామదూత స్వామి ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాస రాజు, రామసుబ్బారెడ్డి, టింబర్ డిపో సుధీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంతానం లేని వారికి సంతానం కలగడం, అన్యోన్యత లేని భార్యాభర్తల మధ్య సఖ్యత, కోర్టు సమస్యల పరిష్కారం, మాన సిక అనారోగ్యాల నుంచి ఉపశమనం, వివాహ విష యాల్లో నవగ్రహ శాంతి కలిగి మంచి సంబంధాలు వస్తాయని తదితర ప్రయోజనాలు ఈ యాగం వల్ల కలు గుతాయని వారు వివరించారు. రామధూతస్వామి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు హాజరు కావాలని కోరారు. పూజా సామగ్రి వేదిక వద్ద ఉచితంగా అందిస్తారని వారు తెలిపారు.

జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్, డిసెంబరు 30 : జనవరి 3 నుంచి 6వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్ బాల్ జట్టును ఎంపిక చేశారు.

ఎర్రగుంట్లలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రాబ బుల్స్ శిక్షణ పొందిన వారి నుంచి చక్కటి ప్రతిభ కనబరి చిన వారిని ఎంపిక చేశారు. వీరిని జిల్లా ఫుట్‌బాల్ అధ్య క్షుడు షేక్ మహబూబ్‌హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాని యల్ ప్రదీప్, పీవో తిరుపాల్‌రెడ్డి ఎంపిక చేశారు. ఈ టోర్న మెంటుకు మేనేజరుగా అనిల్‌కుమార్, కోచ్ వెంకటేష్‌లు వ్యవహరిస్తారు.

క్రీడాకారులకు అభినందన : రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన వారిని జిల్లా సైనిక సంక్షేమాధికారి డాక్టర్ మలిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అడ్‌హాక్ కమిటీ చైర్మన్ తోటక్రిష్ణ అభినందించారు.

జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు : కరీముల్లా (కెప్టెన్), చంద్ర కాంత్, జయప్రకాష్, శ్రీధర్, బాబాపీర్, శ్రీనివాసులు, నరేష్, రవి, పెద రాయుడు, సాయినాధ్, అ.జయ్‌కుమార్, ముక్తియార్, అలెన్‌బాబు, సయ్యద్, మల్లిఖార్జున, వీరాంజనేయులు, ఖలీల్, రాజశేఖర్, రామగోపా లచారి, హర్షఆచారి ఎంపికయ్యారు.



ఫుట్‌బాల్ జట్టును అభినందిస్తున్న రామచంద్రారెడ్డి, తోటక్రిష్ణ

యువత సామర్థ్యం తెలుసుకోవాలి




మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ మమత, హిందూజను అభినందిస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్, డిసెంబరు 30: యువత వారి సామర్థ్యాలను తెలుసుకుని ముందుకు పోవాలని స్టెప్ సీఈఓ మమత అన్నారు. శనివారం భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో యువ మహోత్సవాలను నిర్వహించారు. ఈ నెల 26 నుంచి 30 వరకు స్వామి వివేకానందుని జయంతి వేడుకలు పురస్కరించుకుని నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ బహుమతుల ప్రదానంలో భారత్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫరూక్‌అహ్మద్, కేఎస్‌ఆర్‌ఎం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవాని, రాధ స్టెప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిబెట్ - అంజనన్విత (మొదటి), కేశవసంతోష్ (రెండవ), ప్రణవ్ (మూడు)
సెమినార్ - ప్రశాంత్ (మొదటి), యశశ్విని (రెండు)
ఫ్యాన్సీ డ్రస్ - జ్యోత్స్న అండ్ గ్రూప్ (మొదటి), గౌస్‌బాష అండ్ గ్రూప్ (రెండు), మధులిక అండ్ గ్రూప్ (మూడు)
సైక్లింగ్ బాలురు - అన్వర్ ఆలి (మొదటి), సాయివంశి (రెండు), ఖాదర్‌బాష (మూడు)
సైక్లింగ్ బాలికలు- షహనాజ్ (మొదటి), గీతిక (రెండు), శకుంతల (మూడు),
ఖోఖో - అప్జల్‌ఖాన్ గ్రూప్ మొదటి
రెజ్లింగ్ బాలురు - సురేష్
రెజ్లింగ్ బాలికలు - హిందూజ, సులోచన
వెయిట్‌లిఫ్టింగ్ -గౌస్ అహ్మద్
జిమ్నాస్టిక్స్ బాలురు - హర్షద్‌ఖాన్
జిమ్నాస్టిక్స్ బాలికలు - కళ్యాణి
యూత్‌క్లబ్ - ఎంవీ సుబ్బారెడ్డి, ఎస్‌ఐఆర్‌డి సొసైటీ, రాజశేఖర్,రాణిశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఓబులేసు, నిఖిల, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, ఎం.నాగరాజు, ప్రీతి ఫౌండేషన్‌సుబ్బారెడ్డి, గ్రామీణవికాస సేవా సంఘం సాధించారు.

ప్రజలపై ఎఫ్‌ఆర్‌డీఐ మోపడం దారుణం : ఆర్‌సీపీ

కడప రవీంద్రనగర్, డిసెంబరు 30: కేంద్ర ప్రభుత్వం మరోమారు భారతదేశ ప్రజలపై (ఎఫ్‌ఆర్‌డీఐ) ఫైనాన్షియల్ రెవల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ ప్రమాద కర బిల్లు తీసుకొస్తోందని, ఇది అమలైతే సామాన్య, మధ్యతరగతి ప్రజలు కుటుంబ అవసరాల కోసం బ్యాంకుల్లో దాచుకున్న డిపాజిట్లను కోల్పోతారని, అందుకు వెంటనే బిల్లును కేంద్రం వ్యతిరేకించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 2017లో సంస్కరణల పేరుతో 2వ ఆర్థిక సంస్కరణలు తెచ్చిందన్నారు. ఇందులో నోట్ల రద్దు, జీఎస్‌టీ నోట్ల రద్దు అని ప్రకటించిన తర్వాత ఈ రెండు సంస్కరణల మూలంగా భారతదేశానికి మేలు జరగలేదన్నారు. భారత ఆర్థిక సంఘం స్వర్ణోత్సవ వేళ ప్రఖ్యాత అర్థశాస్త్రవేత్తలుగా కీర్తించబడిన మాజీ ఆర్‌బీఐ గవర్నర్ రంగరాజన్, వైవీరెడ్డి నోట్ల రద్దు వల్ల భారతదేశాన్ని 30 ఏళ్ల వెనక్కి నెట్టివేయబడినట్లయిందని వ్యాఖ్యానించారన్నారు. జీఎస్‌టీ భారతదేశ ఆర్థికాభివృద్ధికి తీవ్ర నష్టాన్ని కలగజేసిందన్నారు. ఇది చాల దన్నట్లుగా ఎఫ్‌ఆర్‌డీఐ అనే ప్రమాదకర బిల్లును తీసుకువచ్చేందుకు చూడడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దివాలా తీసిన బ్యాంకులో ఎవరైతే డిపాజిట్ చేసి ఉంటారో వారు ప్రజలు కానీ ఉద్యోగులుగా వారి డిపాజిట్లను అనుమతి లేకుండా పెట్టుబడిగా మార్చి ఆ నష్టాన్ని తీర్చుకునేది ఈ క్లాజ్ ఉద్దేశమన్నారు. కావున ఈ ఎఫ్‌ఆర్‌డీఐ చట్టం వల్ల తీవ్ర నష్టం ఉంది కాబట్టి దీనిని అమలు చేయవద్దని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు పుష్పగిరి విద్యార్థులు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 30: కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో 27, 28 తేదీల్లో జరిగిన 63వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫీల్డ్ ఆర్చరీ పోటీల్లో పుష్పగిరి పాఠశాలకు చెందిన సిద్దార్‌రెడ్డి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈయన జనవరి 12- 15 వరకు జరుగు జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈయనను పాఠశాల అధినేత వివేకానందారెడ్డి, మన కడప సేవా సమితి అధ్యక్షుడు, జిల్లా ఇన్‌ఛార్జ్ మోహన్‌క్రిష్ణ అభినందించారు. రాష్ట్ర స్థాయి వీవీఎం ఆన్‌లైన్ ఎగ్జామ్‌లో రఫియా (8వతరగతి) ప్రతిభ కనబరిచినదుకు అభినందించారు. ప్రిన్సిపాల్ హరిక్రిష్ణ, షెహనాజ్, పీఈటీ జయచంద్ర,జోసెఫ్‌లు పాల్గొన్నారు.




సిద్దారెడ్డిని, రఫియానుఅభినందిస్తున్న కరెస్పాండెంట్, తదితరులు

రేపటి నుంచి యోగా శిక్షణ

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30: స్థానిక పటేల్ రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో జనవరి 1వతేది నుంచి మూడు రోజులు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ రంగనాధరెడ్డి, డాక్టర్ కల్పన తెలిపారు. వివరాలకు 9440074773 ని సంప్రదించాలని కోరారు.

ఉక్కుఫ్యాక్టరీని ఏర్పాటు చేయండి

కడప వైవీయూ, డిసెంబరు 30: జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ త్వరగా పూర్తి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని వైవీయూ స్టూడెంట్ జాక్ నేతలు శ్రీనివాసులు, రమేష్ డిమాండ్ చేశారు. శనివారం వైవీయూలో లైబ్రరీ ఆవరణలో సమావేశం నిర్వహించారు.

రక్తదానం చేయండి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వైఎస్‌ఆర్ యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య పిలుపునిచ్చారు. రాజారెడ్డివీధిలో శనివారం నూతన సంవత్సరం పురస్కరించుకుని రాజారెడ్డివీధి క్రిష్టియన్ యూత్ అధ్యక్షులు ఫ్రాంక్లిన్ ఆధ్వర్యంలోరక్తదాన శిబిరం నిర్వహించారు.

మతగురువు హత్య దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కడప మారుతీనగర్, డిసెంబరు 30: మతగురువు మహమ్మద్ ఫారూక్‌ను దుండగులు కర్రలతో దాడి చేసి హత్య చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు ఖాదర్‌ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం లాలాచెరువు సమీప బత్తిననగర్‌లో మసీదు మతగురువు మహమ్మద్ ఫారూక్‌ను ప్రార్థన చేసేందుకు సిద్ధమవుతుండగా గుర్తు తెలియని దుండగులు కర్రలతో దాడి చేసి హత్య చేయడం దారుణమన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత గురువును హత్య చేసిన హంతకులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అక్కడే ఉన్న మత గ్రంధాన్ని కూడా దహనం చేయడం సరైంది కాదన్నారు. మూడు మాసాల కిందటే బీహార్ ఫారూక్ బీహారు నుంచి మసీదుకు వచ్చారన్నారు. ఆ ప్రాంత పరిసర వాసుల ఎవరితోనూ ఆయనకు ఎలాంటి వివాదాలు లేవనే సమాచారం తెలిసిందన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి జకరయ్య, సీనియర్ నేతలు గౌస్‌పీర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ పాల్గొన్నారు.

సీమ సంస్కృతిని అవమానిస్తే ఊరుకోం

కడప కల్చరల్, డిసెంబరు 30: రాయలసీమ సంస్కృతిని అవమానించే విధంగా సినిమా డైరెక్టర్ చేస్తున్న దాడిని చూస్తూ ఊరుకోమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కొండూరు పిచ్చమ్మ వెంకటరాజు స్మారక సంస్థ ఆధ్వర్యంలో శని వారం బ్రౌన్ గ్రంధాలయంలో సమావేశం జరిగింది. సంగీత ఉపాధ్యాయులు యలమర్తి మధుసూదన్, జన విజ్ఞాన వేదిక నేతలు రఘునాధరెడ్డి, రచయితలు పుత్తా పుల్లారెడ్డి, పాలెం వేణుగోపాల్, పంతుల పవన్‌కుమార్, కేవీ రమణారెడ్డి, జ్యోతి జార్జి, శివారెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెల్లాల వేంకటేశ్వరాచారి, కోటేశ్వర్‌రావు, కరీముల్లా, కొండూరు జనార్ధన్‌రాజు, సిద్దవటం సీతారామయ్య, బాలకొండ గంగధర్ ప్రసంగించారు. రాయలసీమ సంస్కృతిని నరహంతకులుగా చిత్రించడం మూర్ఖులు చేసే పని అన్నారు. రాయలసీమ చరిత్రపై అలనాటి నటులు పౌరాణిక చిత్రాలు తీసి మెప్పించారన్నారు. సినిమాకు రాయలసీమ వాసులు ఆద్యులన్న సంగతి వర్మ మరిచాడన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో శ్రీహరి విద్యార్థుల ప్రతిభ

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30: కడప నగరం బాలాజీనగర్ శ్రీహరి డిగ్రీ కళాశాలలో మలీనేషన్ సంస్థ మైటాక్స్ ఫిలర్‌లెబేస్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ కరుణాకర్

ఘనంగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలు




కేక్ కట్ చేస్తున్న లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల యాజమాన్యం,
విద్యార్థులతో కేక్ కట్ చేస్తున్న ఎలియాస్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30: కడప నగరంలో ఘనంగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో కేక్ కట్ చేసి పిల్లలు శుభాకాంక్షలు తెలిపారు. కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీ లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సర ఆవశ్యకత విద్యార్థులకు వివరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. శాంతినికేతన్ పాఠశాలలో పాఠశాల వ్యవస్థాపకులు ఎలియాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధే ధ్యేయం : ఛైర్మన్



చిత్రమాలిక ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ ఛైర్మన్ తదితరులు

కడప కల్చరల్, డిసెంబరు 30: జిల్లావాసులు అన్ని రంగాల్లో రాణించాలన్నదే నా ధ్యేయం, పుస్తక పఠనం ద్వారా అది సాధ్యం .గ్రంథాలయాలను జిల్లా మారుమూల గ్రామాలకు సైతం విస్తరించాలనే సంకల్పంతో ప్రయత్నం చేస్తున్నానని జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ జంబాపురం వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా గ్రంధాలయ సంసంస్థ సమావేశ మందిరంలో ఏ.భగీరథమ్మ, శివరంజని సంయుక్తంగా కూర్చిన పుష్పగిరి చిత్రదర్శిని ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 16 ప్రదేశాల్లో స్థల సేకరణ జరిగి గ్రంథాలయ భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మూడు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు తన హయాంలో చేయిస్తున్నట్లు తెలిపారు. మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు విచ్చేసి పుష్పగిరి క్షేత్ర విశేషాలను అందించిన రచయిత్రులను అభినందించారు. కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది రాజ్‌కుమార్, కె.ప్రకాష్, కిశోర్‌రెడ్డి, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం డిసెంబరు 30 : బి.మఠం మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వి రమణయ్య ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, ఎం.రాధాక్రిష్ణమూర్తి, జిల్లా కౌన్సిలర్ చంద్రహాసన్‌రెడ్డి, హెచ్ రవికేశవరావు, బి.శ్రీనివాసులు, నారాయణస్వామి, వెంకటేశ్వర్లు, దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో నూతన సంవత్సర 2018క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు, ఉపాధ్యాయులకు డైరీలను అందజేశారు.

మంజూరు చేయలేనప్పుడూ మీరెందుకూ...

కౌన్సిల్ సమావేశంలో అధికారులపై మండిపడ్డ రఘురామిరెడ్డి

మైదుకూరు, డిసెంబరు 30 : ఏవరికైన పింఛన్ లేదా రేషన్ కార్డు, గృహాలను ఇవ్వలేనప్పుడు జన్మభూములెందుకు... అధికారులైన మీరెందుకంటూ శాసనసభ్యులు ఎస్ రఘురామిరెడ్డి అధికారులపై మండిపడ్డారు. పట్టణంలోని మెప్మాభవన్‌లో శనివారం చైర్మన్ రంగసింహా అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిలర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ తెలుగుదేశం, ప్రతిపక్ష పార్టీ వైసీపీ కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను లేవనెత్తారు. పారిశుధ్య చర్యలు చేపట్టడంలేదని, తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించడంలేదని, వీధి స్తంబాలు లేవూ.. వీధిలైట్లు లేవు అంటూ శాసనసభ్యులు రఘురామిరెడ్డి సమక్షంలో లేవనెత్తడం.. భోజనంకు కూడా సరిగా డబ్బులు లేక అనాథగా ఉంటూ నాలుగేళ్లుగా భిక్షాటన చేస్తున్న ఓ వృద్ధుడికి వృద్యాప్య పింఛన్ మంజూరు చేయకపోవడం దారుణమని వైసీపీ కౌన్సిలర్ ఒకరు చెప్పడంతో శాసనసభ్యులు జోక్యం చేసుకున్నారు. ప్రభుత్వ పథకాలను జన్మభూమి కమిటీ అంటూ సిఫారసు చేయడం ఏమిటీ.. అధికారులకే అధికారం లేనప్పుడూ జన్మభూములెందుకూ.. రేపు జరగబోమే జన్మభూమిలో అధికారులు మీరూ పాల్గొంటే జనం కొడతారంటూ అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పాలన చేపట్టి నాలుగేళ్లు అయ్యింది... అజెండాలో లేని అంశాలకు బిల్లులు చెల్లిస్తున్నారు. పైపు లైనుకు కోటి రూపాయల దాక పనులు చేపట్టినట్లు రికార్డులు చూపుతున్నారూ.. అంతా నాదగ్గరా అవినీతి చిట్టా ఉంది.. ఏదో కొత్తగా వచ్చారూ పోనీలే అని ఊరుకున్నా... ఇక మిగిలింది సంవత్సరమే ఇక ఊరుకుండనూ.... ఇప్పటి నుంచైనా అర్హులకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయడంతో పాటు పార్టీలకు సంబంధం లేకుండా మున్సిపాలిటీ అంతా అభివృద్ధి పనులు చేయాలంటూ అధికారులతో రఘురామిరెడ్డి పేర్కొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యలపై వివరిస్తున్న టీడీపీ కౌన్సిలర్

కోటి రూపాయలతో సీసీ రోడ్లు...

పట్టణంలోని పలు వార్డుల్లో కోటి రూపాయలతో సీమెంట్ రోడ్లు వేసేందుకు సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మొత్తం 16 అంశాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులతో పాటు తెలుగుగంగ నుంచి నీటి సరఫరా నిమిత్తం అవసరమయ్యే ప్రణాళికల ఖర్చులు తదితర వాటిని సభ్యలకు చదివి వినిపించగా, వాటిని ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ఖాజీపేట డిశంబరు 30 : చేతికందొచ్చిన పైరు మరి కొద్ది రోజుల్లో చేతికి వచ్చి కష్టాలు తీరుతాయని ఎన్నో ఆశలతో పొలానికి వెళ్ళితే ఆ రైతును విద్యుత్ కబళించింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని సంజీవనగర్ బీసీ కాలనీకి చెందిన నాదెండ్ల నరూర్‌బాష (38) అనే రైతు తమ పొలం వద్దకు శనివారం వెళ్ళాడు. పొలంలోని మోటారు వేసేందుకు ప్రయత్నించగా విద్యుత్ సరఫరా జరిగి మృత్యువాతపడ్డాడు. స్థానికులు గమనించి మృతుడి కుటుంబానికి సమాచారం అందించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. కుటుంబీకులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతుడి కుటుంబాన్ని తేదేపా మండలాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, రెడ్యం వెంకట్రామిరెడ్డి పరామర్శించారు.


మృతిచెందిన నూర్‌బాష

మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని పథకాలు అందేలా కృషిచేస్తామని తెలిపారు.

మద్యం తాగి వాహనాలను నడిపితే క్రిమినల్ కేసులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 30 : మండలంలోని యువకులు డిసెంబరు 31వ తేదీన ఎవరైనా మద్యం సేవించి వాహనాలను నడిపితే వారిపై క్రిమినల్ కేసులతోపాటు, వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని బి.మఠం ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలకు యువకులు జాగ్రత్తగా సాయంత్రం 8 గంటలలోపలే తమ కార్యక్రమాలను ముగించుకోవాలని, పోలీసువారి చెకింగ్‌లో డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో ఎవరైనా పట్టుబడితే వారిపై క్రిమినల్ కేసులతోపాటు లైసెన్స్‌లు రద్దుచేసి వాహనాలను కోర్టుకు పంపడం జరుగుతుందని ఎస్‌ఐ హెచ్చరించారు. ఆ మేరకు విద్యార్థులు, యువకులు, మండల ప్రజలు ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఎస్‌ఐ తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగరాజు

రాష్ట్రస్థాయి పోటీలకు ఉపాధ్యాయుడి ఎంపిక

చాపాడు, డిసెంబరు30 : మండలంలోని లక్ష్మిపేట గ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు దరిశ శ్రీనివాసులు రాష్ట్రస్థాయి గణితం పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ నరహరిశర్మ తెలిపారు. ఈనెల 39, 30 తేదీల్లో కడపలోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అధికారులు శ్రీనివాసులును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈపోటీల్లో గణితం విభాగంలో వాస్తవ జీవితంలో సమితులపాత్ర అనే ప్రాజెక్టు నమూనాను ప్రదర్శించారు. వచ్చేనెల మూడవ తేదీన నెల్లూరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చైర్మన్ మల్లెలలింగారెడ్డి, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి శ్రీనివాసులుకు ప్రశంసాపత్రం అందజేశారు. గైడ్‌టీచర్ శ్రీనివాసులరెడ్డిని అభినందించారు.


శ్రీనివాసులుకు ప్రశంసాపత్రం అందిస్తున్న చైర్మన్ లింగారెడ్డి

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు రెయిన్‌బో విద్యార్థుల ఎంపిక

ఖాజీపేట డిశంబరు 30 : కడపలోని మున్సిపల్ ఉన్నతపాఠశాలలో 45వ జవహర్‌లాల్ నెహ్రూ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో స్థానిక రెయిన్‌లో హైస్కూల్‌కు చెందిన నాగ హర్షిత, అనూషలు గణిత నమూనాలలో తార్కిన్ ఆలోచన అనే అంశంపై ప్రదర్శన చేశారు. ఇందుకు గాను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ తవ్వా సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పౌరసరఫరాల శాఖామాత్యులు మల్లెల లింగారెడ్డి ప్రశంశాపత్రం అందించారు.

మఠం మఠాధిపతులచేత క్యాలెండర్ ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 30 : శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మంగారిమఠం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరబోగవసంత వెంకటేశ్వరస్వామి చేతులమీదుగా విశాలాంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మఠాధిపతులు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పండితులు గోవిందేశ్వరశర్మ, సీపీఐ మండల కార్యదర్శి హృదయనాథ్, సురేష్, రమణయ్యలు పాల్గొన్నారు.


విశాలాంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మఠాధిపతులు

ట్రాఫిక్ నిబంధనలతోనే ప్రమాదాలు అరికట్టవచ్చు

ఖాజీపేట డిశంబరు 30 : ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని మైదుకూరు రూరల్ సీఐ హనుమంతనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో వున్న భీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. అనంతరం ఎస్‌ఐ హాజీవలి మాట్లాడుతూ సురక్షితంగా గమ్యాన్ని చేరేందుకు తగు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భీరం సుబ్బారెడ్డి, ఆ పాఠశాల మేనేజ్‌మెంట్ భీరం శ్రీకాంత్‌రెడ్డి, సీఈఓ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాదితోనే సంవత్సరం ఆరంభం

మైదుకూరు, డిసెంబరు 30 : తొలి పండుగ ఉగాది నుండే సంవత్సరం ఆరభం అవుతుందని, జనవరి 1న కాదని హిందూ ఐక్యవేదిక కన్వీనరు కామనూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బ్రిటీష్ వారు ఒక ప్రణాళిక ప్రకారం విద్యా వ్యవస్థను నాశనం చేసి, మన గ్రంథాలయాలు తగుల బెట్టి, చరిత్రను వక్రీకరించారన్నారు. ఇంకా క్యాలెండర్లను, డైరీలను ఉగాది నుంచి సంవత్సరంగా గుర్తించేలా ముద్రించాలని కోరారు. ఈ మేరకు వారు ముద్రించిన 'భారతీయులారా ఒకసారి ఆలోచించండీ' అనే కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీమాదవరాయస్వామి ఆలయ చైర్మన్ ఆకుల కృష్ణయ్య, శివశక్తి కన్వీనరు జి.కిరణ్‌కుమార్, మండల ధర్మప్రచారక్ జి.గోపాల్‌రెడ్డి, సభ్యులు నాగరాజు, సుబ్బరాజు, లక్ష్మి నరసయ్య, బెల్లం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ

మైదుకూరు, డిసెంబరు 30 : పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో శనివారం సాయంత్రం ఎస్‌టీయూ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను మండల విద్యాధికారి మల్లేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన జీవోలు, సూచనలు, సలహాలతో కూడిన అన్ని అంశాలు క్యాలెండర్, డైరీలల్లో ఉన్నాయని, ఇది దాచి పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఎంతో మందిని మేధావులుగా చేసిన ఘనత ఉపాధ్యాయులది అని పేర్కొన్నారు. ఎస్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు బీకే సురేష్ మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు, రెండు విడతల కరువు భత్యాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. డీఎస్సీలో పాల్గొనే మన కడప జిల్లా అభ్యర్థులకు అన్యాయం జరుగబోతోందని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తే, సెంకడరీ గ్రేడ్ పోస్టుల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

రవీంద్రభారతి పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: వైఎంఆర్ కాలనీలోని రవీంద్రభారతి హైస్కూలులో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ నూతన సంవత్సర విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని, విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఎస్ఎం.షరీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కొండన్న



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దముడియం, డిసెంబరు30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధుల సహకారం ఎంతైనా అవసరమని ఎంపీడీవో కొండన్న అన్నారు. మండల కేంద్రమైన పెద్దముడియంలో శనివారం ఎంపీపీ సుబ్బలక్షుమ్మ అధ్యక్షతన మండల సాదారణసర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు వారి శాఖల్లో అమలు అవుతున్న పథకాలు, లక్ష్యాల గురించి సభకు వివరించారు. అనంతరం ఎంపీడీవో కొండన్న మాట్లాడుతూ పెద్దముడియం మండలం ఓడీఎఫ్ మండలంగా మారాలంటే 90 వ్యక్తిగత మరుగుదొడ్ల కుంటలు తవ్వించాలని, వాటిని తవ్వించేందుకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని ఆయన సభకు వివరించారు. అధికారులు ఎంత ప్రయత్నించినా ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం లేకపోతే ప్రభుత్వాల లక్ష్యాలు నెరవేరవన్నారు. జనవరిలో జరగబోయే జన్మభూమి కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలు ఓడీఎఫ్ గ్రామాలుగా ప్రకటించినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధుల శ్రమ ఫలిస్తుందన్నారు. కొన్ని గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజల నుండి సహకారం ఆశించినస్థాయిలో లేదన్నారు. మండలంలోని అధికార యంత్రాంగమంతా గ్రామాల్లోనే తిరుగుతూ లబ్ధిదారుని ప్రతి ఒక్కరి ఇంటికి వెళుతున్నారని, అధికార యంత్రాంగం పనితీరువల్లే మండలం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో మంచి స్థాయిలో ఉందన్నారు. అందరి కృషి వల్లే పెద్దముడియం మండలం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో ఆశించినస్థాయిలో ముందుకెళుతుందని, ఆ దిశగా కలెక్టర్‌కూడా ప్రశంసించారని అన్నారు. జన్మభూమి కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఎంపీడీవో కోరారు. జన్మభూమి కార్యక్రమానికి వెళ్లే సమయానికి ఆయా శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు. జన్మభూమి విజయవంతానికి గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని ఆయన కోరారు. ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇలు వీరారెడ్డి, కమాల్‌సాహెబ్, విశ్వనాథ్, ఏపీవో వెంకటసుబ్బమ్మ, ఏపీఎం గురుకుమార్, పశువైద్య అధికారి సుధాకర్, ఇతర అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలి



జమ్మలమడుగులో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న శివకుమార్

జమ్మలమడుగు రూరల్: విద్యార్థులు అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం జమ్మలమడుగులో ఎస్ఎఫ్ఐ 48వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1970 డిసెంబరు 30 కేరళ రాష్ట్రంలో త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. చదువు, పోరాడు నినాదంతో, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగుతోందన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి ఎల్లయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు రూరల్, డిసెంబరు30 : జమ్మలమడుగు పట్టణంలోని డాక్టర్ ఎంపీ మునిరెడ్డి కాంప్లెక్స్‌లో శనివారం జమ్మలమడుగు రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2018 క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సేవా సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంపీ మునిరెడ్డి, న్యాయవాది మునిసుబ్బారెడ్డి మాట్లాడుతూ రెడ్లలో చైతన్యం రావాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం రెడ్ల సంఘం ఐక్యత కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తాతిరెడ్డి తులశమ్మ

జమ్మలమడుగు, డిసెంబరు 30: జనవరి రెండు నుండి ప్రారంభమయ్యే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌన్సిలర్లు, అధికారులకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ తాతిరెడ్డి తులశమ్మ సూచించారు. శనివారం సాయంత్రం నగర పంచాయతీ కార్యాలయ సభాభవనంలో తులశమ్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో పందుల సమస్యను పరిష్కరిస్తామన్నారు. వైస్‌చైర్మన్ ముల్లాజానీ మాట్లాడుతూ పాత బస్టాండులో ప్రస్తుతం ద్విచక్రవాహనాలు, తోపుడుబండ్లు నిలుపుతున్న చోట్ల టెండర్ ద్వారా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మాజీ వైస్‌చైర్మన్, కౌన్సిలర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గూడెం చెరువు సమీపంలోని రాజీవ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ గృహాలను పూర్తి చేస్తామన్నారు. కమిషనర్ లక్ష్మిరాజ్యం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి జ్వరమొచ్చింది



ఆస్పత్రిలో డాక్టర్ లేక పోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

ముద్దనూరు: మండలంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్, నర్సుల కొరత ఏర్పడింది. దీంతో ప్రజలకు వైద్యం సరిగా అందలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో దాదాపు 34వేల పైచిలుకు జనాభా ఉంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో 24 గంటల కాన్పుల కార్యక్రమం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రంలో ఇద్దురు డాక్టర్‌లు ఉండాలి. నలుగు హెడ్ నర్సులు ఉండాలి. ఆరోగ్య కేంద్రంలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న డాక్టర్ కడప, జమ్మలమడుగులో జరుగు పల్స్‌పోలియో, టీబీ బిడ్జి ట్రైనింగ్ కార్యక్రమాలకు వెళుతుంటారు. అంలేకాకుండా అప్పుడప్పుడు సెలవులు పెడుతుండటంతో ఓపీలో సమస్య ఏర్పడుతోంది. ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన రోగులు డాక్టర్ లేకపోవడంతో వెనుదిరిగిపోయి. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. జనవరిలో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు డాక్టర్ వెళ్లాల్సి ఉంది. దీంతో కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆరోగ్య కేంద్రంలో కాన్పులు ఎక్కువగా జరుగుతుంటాయి. రాత్రి వేళ్లలో కూడా స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇద్దరు నర్సులు ఉండటం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆరోగ్య కేం ద్రంలో అన్ని వసతులు అంతంత మాత్రంగా ఉన్నా. డాక్టర్ల, నర్సుల సమస్యలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యకేంద్రంలో డాక్టర్‌ను, స్టాఫ్ నర్సును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భవన నిర్మాణానికి నిధుల మంజూరు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు30: అమృతనగర్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు గదుల నిర్మాణానికి రూ.14.50 లక్షల నిధుల మంజూరైనట్లు పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ డీఈ గోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో మూడు గదుల నిర్మాణానికి 2వేల200చదరపు అడుగల్లో ఈగదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈనిర్మాణానికి టెండర్లు కూడా పిలిచినట్లు డీఈ చెప్పారు. అమృతనగర్‌లోనే మడూరు రోడ్డులో నిర్మిస్తున్న ప్రధాన రోడ్డును పూర్తి చేయడానికి రూ.10లక్షలు నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు. ఈ నిధులను జిల్లా మైనింగ్ ట్రస్టు పథకం కింద మంజూరైనట్లు డీఈ వివరించారు.

12న క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: జనవరి 12న స్వామి వివేకానంద 155వ జయంతిని పురస్కరించుకుని క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ భాగ్ కన్వీనర్ రవితేజ తెలిపారు. ఆదివారం గీతాశ్రమంలో మహిళలకు కబడ్డీ పోటీలు జనవరి 7వ తేదీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని, మహిళలు, కబడ్డీపోటీల్లో విద్యార్థులు క్రికెట్ పోటీలలో పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

హలో.. ఆంధ్రజ్యోతి

Hello Andhra Jyothi

- మీ సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.
- ఎర్రగుంట్ల - 9441112349
- ముద్దనూరు - 8099575259
- జమ్మలమడుగుటౌన్ - 9948300003
- జమ్మలమడుగురూరల్- 9848855313
- మైలవరం - 9912265711
- పెద్దముడియం - 9494835608
- కొండాపురం- 9440941345

సినిమాగైడ్

జమ్మలమడుగు

టీపీఆర్ : కంట్రీస్
టీఎస్ఆర్:ఎంసీఏ మిడిల్‌క్లాస్ అబ్బాయి
సాయిరాం : హలో

శాఖా హారం ఆరోగ్య రక్ష : ధ్యానరత్న ఓబయ్య


ర్యాలీ నిర్వహిస్తున్న వేదవ్యాస పిరమిడ్ నిర్వాహకులు

వేంపల్లె, డిసెంబరు 30: శాఖాహారం తీసుకునే వారు ఆరోగ్యపరంగా బాగుంటారని కడపకు చెందిన ధ్యానరత్న, సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఓబయ్య పేర్కొన్నారు. వేంపల్లె లోని పలు ప్రాంతాల్లో, ఆలయాల్లో వేదవ్యాస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు ధ్యానంపై 40 రోజులు అవగాహన కల్పించారు. శనివారం ముగింపు సందర్భంగా పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. శాఖాహారం తీసుకోవడంతో మానవాళి జీవన ప్రమాణాలు పెంపొందుతాయని ధ్యానరత్నం ఓబయ్య పేర్కొన్నారు. ధ్యా నం ద్వారా మానసిక ప్రశాంతత ఒనగూరి ఏకాగ్రత పెరుగుతుందని, ఆరోగ్య సమస్యలు చాలా వరకు తొలగిపోతాయన్నారు. వేదవ్యాస పిరమిడ్ నిర్వాహకులు మేడా శ్రీను, రెడ్డిలక్షుమయ్య, ప్రభాకర్, లక్ష్మి పాల్గొన్నారు.

2016 పంటల బీమా ఏమైనట్లో ?

సింహాద్రిపురం, డిసెంబరు 30: 2016 రబీసాగులో బుడ్డశనగ పంటల బీమా ఏమైనట్లో అర్థం కావడం లేదని రైతులు అయోమయంలో పడ్డారు. 2016 ప్రీమియం చెల్లించిన ఏడు వేల మంది రైతులకు పైగా ఈ బీమా మొత్తాల కోసం ఎదురుచూస్తున్నారు. కాగా వారిలో కేవలం మండల వారీగా 96 మందిని అనర్హులుగా గుర్తిస్తూ జాబితా బీమా కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయానికి సమాచారం అందింది. మిగిలిన రైతులంతా అర్హులైనట్లేగా అని రైతులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. చుట్టుపక్కల మండలాలకు పంటల బీమా మొత్తాలు చాలా రోజులుగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. కానీ సింహాద్రిపురం మండలంలో ఒక్క రైతుకు కూడా ఇంత వరకు జమపడకపోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈసమస్యపై వ్యవసాయ జిల్లా ఉన్నతాధికారులు కూడా పెదవి విప్పకపోవడంతో రైతుల్లో మరింత ఆవేదన, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కరువు రైతులను ఆదుకునేందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు బీమా సంస్థలపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం జరిగేలా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2012-13కు సంబంధించిన బీమా మరి కొందరు రైతులకు రావాల్సి ఉందని ఆ రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. 2014-15 బుడ్డశనగ పంటకు మంజూరైన బీమా మొత్తాలు బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులకు కొన్ని నెలల కిందటే వారి ఖాతాల్లో జమపడ్డాయి. నాన్‌లోనీ కింద ప్రీమియం చెల్లించిన రైతులకు ఇంత వరకు ఒక్కరికి కూడా పంటల బీమా అందిన పాపానపోలేదన్నారు. ఇలా బీమా సంస్థలు రైతుల బతుకులతో ఆడుకోవడం మంచిదికాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రావాల్సిన పంటల బీమా మొత్తాలన్నింటినీ రైతుల ఖాతాల్లో మొత్తాలు జమచేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

చక్రాయపేట, డిసెంబరు 30: విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ఎంఈఓ రవీంద్రనాయక్ తెలిపారు. శనివారం చక్రాయపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఉచితంగా కెరీర్ గైడ్స్, బ్యాగులు అందించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెన్త్ తర్వాత ఏం చేయాలి, ఏ విషయాలు ఉపయోగపడుతాయో, ఆర్థికంగా ఎదగాలంటే ఏం చేయాలి అనే విషయాలపై ఎంఈఓ తెలియజేశారు. ప్రభుత్వం స్వచ్ఛందంగా కంపెనీలు, స్కాలర్‌షిప్‌లు, శిల్పకళ, చిత్రలేఖన, సంగీతం, నృత్యం, ఫొటోగ్రఫీ, ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టిందని, వాటిలో చేరి మీ కెరియర్‌ను సజావుగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ కొలువు పొందాలంటే విద్యార్థులకు ఎంతో కష్టంగా ఉందని, విద్యార్థులు నైపుణ్యం కలిగిన టెక్నికల్ కోర్సులు చేసి వాటి ద్వారా భవిష్యత్తును బాగుపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రవికుమార్, చంద్రబాను, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

సీఎం సభాస్థలానికి చకాచకా ఏర్పాట్లు

సభావేదికను పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్

పులివెందుల టౌన్, డిసెంబరు 30: పట్టణంలో 3వ తేదీ జరిగే జన్మభూమి, ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో సీఎం బహిరంగ సభను ఏర్పాటుపై క్రీడామైదానాన్ని ఎస్పీ అట్టాట బాబూజీ, కలెక్టర్ బాబూరావునాయుడు పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిర్వహిచేందుకు ఎస్పీ సభాస్థలాన్ని పరిశీలించారు. రూట్ మ్యాప్‌పై కూడా ఎస్పీ కలెక్టర్‌తో చర్చించారు. ఏఎస్పీ కృష్ణారావు, సీఐ ప్రసాద్, ఆర్డీఓ నాగన్న, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్ మధుసూధన్‌రెడ్డి, టీడీపీ నాయకత్వ శిక్షణా శిబిర డైరెక్టర్ రామగోపాల్‌రెడ్డి, తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, అధికారులు, టీడీపీ నేతలు ఉన్నారు.

అంతర్జాతీయ కరాటేలో 'చైతన్య' ప్రతిభ


ఐమాన్‌ను అభినందిస్తున్న చక్రపాణిరెడ్డి తదితరులు

వేంపల్లె, డిసెంబరు 30: అంతర్జాతీయ కరాటే పోటీల్లో వేంపల్లె చైతన్య హైస్కూల్ విద్యార్థి ఐమాన్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. అండర్ -14 విభాగంలో 50-55 కిలోల కుమ్మితే ఫైట్‌లో అంతర్జాతీయ స్థాయిలో వెండిపతకం సాధించాడని చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. 23, 24వ తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో గోజుఆర్‌వైయూ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ -2017 పోటీల్లో భాగంగా నిర్వహించగా ఐమాన్ ప్రతిభ కనబరిచి పతకం సాధించాడు. ఐమాన్‌ను, కరాటే మాస్టర్ విజయ్, సిహాన్‌ను కరస్పాండెంట్, ఎండీ చేతన్‌రెడ్డి అభినందించారు.

అంజన్న సేవలో తెలంగాణ ముఖ్యమంత్రి అనుచరులు


తెలంగాణ నాయకులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

చక్రాయపేట, డిసెంబరు 30: తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అనుచరులు సికింద్రాబాద్‌కు చెందిన టీఆర్ఎస్ నేతలు నరసింహారెడ్డి, అనంతరెడ్డి, బుచ్చిరెడ్డి కుటుంబ సమేతంగా గండి అంజన్నను దర్శించుకున్నారు. వీరికి సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, పూజారులు కేసరి, రాజారమేష్ స్వాగతం పలికారు. అనంతరం స్వామికి పూజలు నిర్వహించారు. శాలువాకప్పి సత్కరించారు. ఆంజనేయస్వామి మహిమలను అడిగి తెలుసుకున్నారు. దేవాలయ అభివృద్ధిని చూసి మెచ్చుకున్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు బైరెడ్డి అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌజన్ హత్య దారుణం

వేంపల్లె, డిసెంబరు 30: రాజమండ్రి మసీదులో మౌజంను హత్య చేయడం దారుణమని ఆవాజ్ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ గఫార్ ఖండించారు. మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

పులివెందుల	
మారుతి	: సప్తగిరి ఎల్‌ఎల్‌బి
లక్ష్మీ	: జవాన్
శ్రీనివాస	: గృహం
సుజాత	: హలో
వేంపల్లె	
తిరుమల	: బాహుబలి - 2
వెంకటేశ్వర	: రాజుగారి గది - 2
నూర్జహాన్	: ఆక్సిజన్

వృద్ధులకు విద్యార్థుల చేయూత


వృద్ధులకు సామగ్రిని పంపిణీ చేస్తున్న విద్యార్థులు

లింగాల, డిసెంబరు 30: వేంపల్లె విజయభారతి స్కూల్ విద్యార్థులు ప్యాకెట్ మనీకి ఇచ్చిన డబ్బును సమకూర్చి వృద్ధులకు అవసరమైన వివిధ రకాల వస్తువులను అందించి ఔదార్యం చాటుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో డబ్బును సమకూర్చి మంచం, డ్రమ్ము, స్టీల్ సామాన్లు తదితర వస్తువులను కొనుగోలు చేసి రాజీవ్‌కాలనీలోని మథర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో అందించారు. విద్యార్థి దశలోనే సాటి మనుషులను ఆదుకోవాలనే ఆలోచన రావడం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ రాధామాధవశర్మ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఖలీల్, మహ్మద్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కోసం కృషిచేయండి

సతీష్‌రెడ్డిని సన్మానించిన మార్కెట్ యార్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్


సతీష్‌రెడ్డి సన్మానిస్తున్న పులివెందుల మార్కెట్ యార్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్

వేంపల్లె, డిసెంబరు 30: రైతు సమస్యల పరిష్కారం కోసం వారికి ప్రయోజనం కలిగే విధంగా మార్కెట్‌యార్డు ద్వారా కార్యక్రమాలు చేపట్టాలని శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి సూచించారు. పులివెందుల మార్కెట్ యార్డుకు ప్రస్తుతం ఉన్న పాలక మండలిని మరో రెండేళ్లు కొనసాగేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఛైర్మన్ రాఘవరెడ్డి, వైస్ ఛైర్మన్ దొంతు సుబ్బారావు శనివారం రాత్రి సతీష్‌రెడ్డిని కలిశారు. రెండవదఫా పాలక మండలిలో అవకాశం కల్పించినందుకు సతీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి రైతుల మన్ననలు పొందాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు షబ్బీర్, నీటి సంఘం అధ్యక్షులు రామచంద్రారెడ్డి, గండి ఛైర్మన్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇమ్యునైజేషన్ సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

లింగాల, డిసెంబరు 30: వందశాతం ఇమ్యునైజేషన్ సాధించేందుకు వైద్యసిబ్బంది కృషిచేయాలని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్వాడీ టీచర్లకు జడ్పీ బాలుర హైస్కూల్‌లో శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ క్రమం తప్పకుండా సకాలంలో వేయించాలన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరితోను పరిచయాలు ఏర్పరచుకుని పనిచేసినప్పుడే లక్ష్యాలను సాధించగలరన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్బారావు, హెచ్‌ఈ బాబాఫకృద్దీన్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

'జన్మభూమి'ని విజయవంతం చేయాలి

కమలాపురం: జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విజయభాస్కర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనవరి 2వ తేదీ ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాల్లో ఆయా శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు. 2వ తేదీన సంబటూరు, కోగటంలో జన్మభూమి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

2 నుంచి 'జన్మభూమి'

సీకేదిన్నె, డిసెంబరు 30: 2018 జనవరి 2వ తేదీ నుంచి జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. 2వ తేదీన ఇప్పెంట, 3న బుగ్గలపల్లె, 4న కొలుములపల్లె, 5న బుసిరెడ్డిపల్లె, 6న కమ్మవారిపల్లె, 7న పబ్బాపురం, పాపాసాహెబ్‌పేట, 8న కొప్పర్తి, 9న తాడిగొట్ల, 10న రసూల్‌పల్లె, 11న సీకేదిన్నెలో గ్రామసభలు జరుగుతాయన్నారు.

వీఎన్ పల్లె మండలంలో...

వీరపునాయునిపల్లె, డిసెంబరు 30: మండలంలో జనవరి 2వ తేదీ నుంచి జన్మభూమి-మాఊరు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి తెలిపారు. 2వ తేదీన అనిమెల, తలపనూరు, 3న కొమ్మద్ది, వీఎన్‌పల్లె, 4న ఇందుకూరు, 5న పాయసంపల్లె, మిట్టపల్లె, 6న యు.వెంకటాపురం, గంగిరెడ్డిపల్లె, 7న మొయిళ్లచెరువు, సర్వరాజుపేట, 8న యు.రాజుపాళెం, ఎరమలపల్లె, 9న తంగేడుపల్లె, ఎన్.పాలగిరి, 10న ఉరుటూరు, ఎస్.పాలగిరి, 11న వెల్దుర్తి, గోనుమాకులపల్లె గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. ఈ గ్రామసభల్లో అర్హులైన లబ్దిదారులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, గృహాలు తదితర సంక్షేమ పథకాలకు సంబంధించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి

వల్లూరు, డిసెంబరు 30: ఆంధ్రప్రగతి బ్యాంకు సేవలను రైతులు, పొదుపు సంఘాల మహిళలు ఉపయోగించుకుని తద్వారా తమ ఆర్థిక ప్రగతిని సాధించుకోవాలని ఏపీజీబీ మేనేజరు రామక్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం తోళ్లగంగనపల్లె గ్రామంలో కళాబృందంతో బ్యాంకులో ఉండే వివిధ ఖాతాల గురించి నృత్య రూపంలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకులో ఉన్న వివిధ పొదుపు పథకాలు, రుణ పథకాల గురించి వివరించారు. సకాలంలో తీసుకున్న రుణాలును వడ్డీలతో కడితే చాలా మంచిదన్నారు. ప్రజలు, పొదుపు సంఘాల మహిళలు తమ బ్యాంకు సేవలతో స్వశక్తిపై నిలబడాలని, ఇందుకోసం తమ బ్యాంకు సేవలు నిరంతరం ఉంటాయన్నారు. కార్యక్రమంలో రామిరెడ్డి, బాలగురప్ప, గౌరీ పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వాలి





గెలుపొందిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

వల్లూరు, డిసెంబరు 30: విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీలను కూడా బాగా ఆడి మంచి భవిష్యత్తు సాధించవచ్చని, తల్లిదండ్రులు ఈ విషయాలను గమనించి తమ పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని వేదాస్ పాఠశాల కరస్పాండెంట్ దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వేదాస్ పాఠశాలలో జోనల్ స్థాయి ఆటల పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలను కరస్పాండెంట్ దిలీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో జోనల్ స్థాయి హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ పోటీలను బాలబాలికలకు నిర్వహించారు. ఈ టోర్నమెంటులో హ్యాండ్‌బాల్ బాయిస్ మొదటి స్థానాన్ని, విద్యామందిర్ పాఠశాల ద్వితీయ స్థానం, జడ్పీహెచ్ఎ్ స నందిమండలం బాలికలు మొదటి స్థానంలో విద్యామందిర్, ద్వితీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ టక్కోలి పాఠశాల విజయం సాధించారు. అలాగే ఫుట్‌బాల్‌లో బాయిస్ మొదటిస్థానంలో జడ్పీహెచ్ఎస్ కొండపేట, ద్వితీయ స్థానంలో సాయివిజ్ఞాన్ స్కూలు, బాలికల విభాగంలో మొదటిస్థానంలో జడ్పీహెచ్ఎస్ వల్లూరు, ద్వితీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ కొండపేట విజయం సాధించారు. ఈ ఆటల పోటీల్లో విజయం సాధించినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాలల యాజమాన్యం దిలీప్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ ధర్మధీరజ్, పీఈటీలు బి.లక్ష్మిదేవి, తిరుపాల్‌రెడ్డి, సుబ్బన్న, విజయలక్ష్మి, రాజశేఖర్, సురేంద్ర ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు, డిసెంబరు 30: ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వారికి చేదోడు వాదోడుగా నిలిచేందు కోసమే సీఎం సహాయనిధి ఏర్పాటు చేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. వల్లూరు మండలంలో అనారోగ్యం చెంది చికిత్స చేసుకున్న ఏడుగురికి సీఎం సహాయనిధి నుంచి దాదాపు నాలుగు లక్షల రూపాయల చెక్కులను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, ప్రజల శ్రేయస్సు కోరే ఇటువంటి ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తూ రాజధాని అమరావతిని నిర్మించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 30: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి సాధికార మిత్రలను ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు ఏపీఎం సునీల్‌బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం సాధికార మిత్రలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాధికార మిత్రలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వేదాస్‌లో రంగోలి

వల్లూరు, డిసెంబరు 30: రాబోవు నూతన సంవత్సర సందర్భంగా పాఠశాల విద్యార్థులు రంగులను చల్లుకుంటూ హ్యాపీ న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ వేదాస్ పాఠశాలలో రంగులు చల్లుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధీరజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా తమ కరస్పాండెంట్ దిలీప్‌రెడ్డి ఆధ్వర్యంలో రంగోలిని నిర్వహించామన్నారు. ఆనందంగా గడుపుతూ ఈ సంవత్సరం కూడా చదువులో రాణించాలని కోరుకుంటున్నామని తెలిపారు.

ఉపాధ్యాయులంతా ఏకం కావాలి

సీకేదిన్నె, డిసెంబరు 30: తమ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులంతా ఏకం కావాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పాలం మహేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో శనివారం నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారం కాని ఇంక్రిమెంట్లు, ఏకీకృత సర్వీస్ రూల్స్ తదితర సమస్యలపై పోరాడాలన్నారు.



యూటీఎఫ్ నూతన క్యాలెండరును ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎస్టీయూ క్యాలెండరు ఆవిష్కరణ



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కళావతి, తదితరులు

పెండ్లిమర్రి, డిసెంబరు 30: నందిమండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇది ఎంతో బాగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ధర్మారెడ్డి, సాంబశివారెడ్డి, గాలి సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థలం కోసం ఘర్షణ

- 13మందికి గాయాలు
- ఇరువురి పరిస్థితి విషమం

చెన్నూరు: ప్రభుత్వ స్థలం కోసం గొడవపడ్డ రెండు వర్గాలలో 13మంది గాయపడగా వారిలో ఇరువురి పరిస్థితి విషమంగా మారింది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని దౌలతాపురంలో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నాయి, ఇటీవల అదేప్రాంతంలోని చక్కెర కర్మాగారానికి వెనుకవైపు వున్న స్థలాన్ని ఆ ప్రాంతానికి చెందిన రెండు దళితవర్గాలు ఆక్రమించుకోవాలని ప్రయత్నించారు. స్థలం విలువ కూడా బాగా ఉండటంతో నాదంటే నాదంటూ ఇటీవల పునాదులు వేసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి గొడవలకు దిగారు. శనివారం ఉదయం కూడా వారి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్పటికే ఓవైపు దేవరాజు వర్గం, మరోవైపు మార్తమ్మ వర్గం రాళ్లు, కట్టెలతో కలియబడ్డారు. ఈ సంఘటనలో దేవరాజు వర్గంవైపు అతనితో పాటు ఏసన్న, మణిపాల్, రత్నపాలు, మరియమ్మ, ఆనందమ్మ, గ్రేసమ్మ గాయపడగా మరోవైపు మార్తమ్మ, మరియమ్మ, స్వప్న, రవి, కేసర్, సమ్మి గాయపడ్డారు. వీరిలో ఆనందమ్మ, రవి పరిస్థితి విషమంగా మారడంతో ఆనందమ్మను కర్నూలుకు, రవిని తిరుపతికి తరలించారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి ఇరువురి వర్గాలపై కేసులు నమోదు చేశారు. కాగా తహసీల్దార్ సత్యానందం స్థలవిషయమై మాట్లాడుతూ దౌలతాపురంలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉందని, తొందరలో ఆ ప్రాంతంలో ఇంటిస్థలాలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని, అటువంటి పరిస్థితుల్లో ఎవరైనా స్థలాలు ఆక్రమించాలని ప్రయత్నించినా, నిర్మాణ పనులు చేపట్టినా కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

రేపు జన్మభూమిపై సమీక్ష సమావేశం

పెండ్లిమర్రి, డిసెంబరు 30: పెండ్లిమర్రి మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం జన్మభూమి కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు మండల స్థాయి అధికారులు పాల్గొని నివేదికలు అందజేయాలన్నారు.

సినిమా గైడ్

కమలాపురం	
ప్రదీప్	: ఎంసీఏ
చెన్నూరు	
కృష్ణ	: ఆక్సిజన్

జనవరి 2 నుంచి 5వ విడత జన్మభూమి

పోరుమామిళ్ల, డిసెంబరు 30 : జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు పోరుమామిళ్ల మండలంలోని 17 పంచాయతీల్లో 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామక్రిష్ణయ్య, తహసీల్దార్ శేషారాంసింగ్‌లు తెలిపారు. 2న సంచర్ల, పుల్లీడు, 3న అక్కలరెడ్డిపల్లె, దమ్మనపల్లె, 4న చిన్నఎరసాల, తిమ్మారెడ్డిపల్లె, 5న కొర్రపాటిపల్లె, కవలకుంట్ల, 6న పోరుమామిళ్ల, 7న ముసల్‌రెడ్డిపల్లె, వెంకటరామాపురం, 8న రాజాసాహెబ్‌పేట, సిద్ధవరం, 9న చల్లగిరిగెల, గానుగపెంట, 10న రంగసముద్రం, 11న టేకూరుపేట పంచాయతీల్లో జన్మభూమి గ్రామసభలు జరుగుతాయని, ప్రజలు ఈ గ్రామసభల్లో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోగలరన్నారు. జన్మభూమి కార్యక్రమంలో ఎంపీడీఓటీం, తహసీల్దార్‌టీం ఆధ్వర్యంలో జరుగుతుంది.

నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి : ఎమ్మెల్యే

బద్వేలు, డిసెంబరు 30 : నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే జయరాములు అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక నిధులను కేటాయించారన్నారు. ప్రతి పక్షనాయకులు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదంటూ విమర్శలు చేస్తున్నారు. ప్రతిపక్షనాయకులు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి వెళ్లి పరిశీలిస్తే అభివృద్ధి కనపడుతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 6,500 పెన్షన్లు ఇచ్చామని, అలాగే పోరుమామిళ్ల, బద్వేలు ప్రధాన రహదారికి రూ.37.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని, రహదారి పనులు కూడా ప్రారంభమయ్యాయని, అలాగే పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద నుంచి బయనపల్లె సబ్‌స్టేషన్ వరకు రూ. 7.50కోట్లతో సీసీ రోడ్లు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో 125 రైతు రథాలను(ట్రాక్టర్లు) ఇచ్చామని, వాటిలో అర్హులైన ఎస్సీలకు 25 మందికి కేటాయించడం జరిగిందన్నారు. అంబేద్కర్ భవన నిర్మాణం కోసం జిల్లాలో ఎక్కడాలేని విధంగా రూ.2.50 కోట్లతో బి.కోడూరు మండలంలో అంబేద్కర్ భవన నిర్మాణపనులను ప్రారంభించబోతున్నామన్నారు. నియోజకవర్గంలో రూ. 1.90 కోట్లు వసతిగృహ నిర్మాణాలకు ఖర్చుచేయబోతున్నామన్నారు. తెలుగు గంగ పడమటి కాలువకు 1.50 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని, సోమశిల బ్యాక్‌వాటర్‌ను బద్వేలు ప్రాంతానికి తెచ్చేందుకు ముఖ్యమంత్రితో చర్చించామని, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు ముఖ్యమంత్రి దగ్గర ఉన్నాయని, 2018లో అభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకు వెళతామని, మున్సిపాలిటీలో అన్ని వార్డులను అభివృద్ధి పరుస్తామని, 2018-19లో అభివృద్ధి కోసం కావాల్సిన నిధులను మంజూరు చేయించుకొని, నియోజకవర్గాన్ని అత్యంత సుందరీకరణగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రపతిచేత రూ. 499 కోట్లతో ఫైబర్‌గ్రిడ్‌ను ప్రారంభించామని, ఏపీలో ప్రతి ఇంటికి ఇంటర్నెట్, వైఫై, టెలిఫోన్ సౌకర్యం వంటివి 24 గంటలు పనిచేస్తాయని, ఏపీని సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నారని, లక్షల కోట్లరూపాయలతో అనేక పరిశ్రమలు వస్తున్నాయని, రాజధానిలో అన్ని మౌలిక వసతులు సమకూర్చి రాజధాని నిర్మాణ పనులను చేపడుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొంకుల రాంబాబు, టీడీపీ నాయకులు కొలవలి వేణుగోపాల్, గొల్లపల్లె పుష్పరాజు, వెంకటసుబ్బయ్య, పిచ్చయ్య, గొడుగునూరు క్రిష్ణ, రంగనాయకులు, కొమ్మురాజు శ్రీనివాసులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాములు

జన్మభూమిలో డ్వాక్రా సభ్యుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

గోపవరం, డిసెంబరు 30 : రాష్ట్ర ప్రభుత్వం 5వ విడత చేపడుతున్న జన్మభూమి కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యుల పాత్ర కీలకమని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జన్మభూమి నిర్వహణపై వెలుగు సభ్యులతో సమీక్షా సమావేశం ఏపీఎం వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, ఇందులో ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజెప్పి, వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలన్న విషయాన్ని ప్రజలకు వివరించడంతోపాటు, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత కూడా డ్వాక్రా సంఘ సభ్యులమీద, సాధికార మిత్రులమీద ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ముందు సభ్యులు తెలుసుకోవాల్సి ఉంటుందని, ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సేవలు అందించేలా చూడాలన్నారు. టీడీపీనేత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మహిళలే మార్గదర్శకులుగా పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవచేయాలన్నారు. అనంతరం డ్వాక్రా సభ్యులకు ట్యాబ్‌లను 12 మందికి పంపిణీ చేశారు. 2017కు వీడ్కోలు పలుకుతూ, 2018కి స్వాగతం పలుకుతూ కేక్‌కట్‌చేసి అధికారులు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నరసింహులు, జయచంద్ర, అర్జున్, వెలుగు సిబ్బంది డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఇంటి పన్నులను నేడూ చెల్లించవచ్చు

బద్వేలు టౌన్, డిసెంబరు 30 : మున్సిపాలిటీ పరిధిలో నివశిస్తున్న ప్రజలు 2018కి గాను రెండవ అర్థసంవత్సరానికి అపరాధ రుసుము లేకుండా ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటిపన్నులు చెల్లించని వారు వెంటనే చెల్లించుకోవచ్చని, ఆన్‌లైన్‌లో కట్టే సౌకర్యం ఉందని, స్మార్ట్‌ఫోన్ ఉపయోగించేవారు పురసేవ యాప్ ద్వారా చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ శివరామిరెడ్డి అన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోపవరం, డిసెంబరు 30 : యూటీఎఫ్ 2018 డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్లను ఎంపీపీ శిరీష, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు ఓబుళరెడ్డి, టీడీపీనేత ప్రభాకర్‌రెడ్డిలు శనివారం స్థానిక సెయింట్‌పాల్స్ యూపీ పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ రూపొందించిన క్యాలెండర్, డైరీలు ప్రతి ఒక్కరికీ చాలా ఉపయోగకరమని, డైరీనందు పొందుపరిచిన జీవోలు, డీఎలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ సంవత్సరం అందరికీ మేలు జరగాలని ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి ఉపాధ్యాయుడు ఈ డైరీని చదవాలని, పాఠశాల విద్యను అభివృద్ధి బాటలో నిలపాలని ఓబుళరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం మండల అధ్యక్షుడు క్రిష్ణపర్, సుధారాణి, అనురాధ, గురుమూర్తి, కంచిరెడ్డి, మేరిఫ్లారెన్స్, మెర్సి, వినోద్, ఎంవి సుబ్బయ్య, ఎన్‌వి భాస్కర్, వసంత, విజయబాను, గురుప్రసాద్, అంకయ్య, సునీత, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 2నుంచి జన్మభూమి మా ఊరు కార్యక్రమాలు

బి.కోడూరు, డిసెంబరు 30 : బి.కోడూరు మండలంలో జనవరి 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి - మా ఊరు కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారీఖువారీగా పంచాయతీల్లో జరిగే జన్మభూముల కార్యక్రమంలో ప్రజల సమస్యలను తీర్చేందుకు ముందుండాలని ఆయన తెలిపారు. 2వ తేదీ తుమ్మలపల్లె గ్రామపంచాయతీలో, 3వ తేదీన తంగెడుపల్లె, 4వ తేదీన ప్రభలవీడు, 5న పెద్దుళ్లపల్లె, 6న పాయలకుంట్ల, 7న బికోడూరు, 8న ఐత్రంపేట, 9న మేకవారిపల్లె, 10న మున్నెల్లి, 11న ఎస్.పాపనపల్లె గ్రామ పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమం జరుగునని, దీనిని ప్రజలు తమ తమ గ్రామ పంచాయతీల్లో సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి


గ్రామంలో మొక్కలను నాటుతున్న అధికారులు

గోపవరం, డిసెంబరు 30 : సమాజసేవలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని గోపవరం ఎస్‌ఐ హేమాద్రి శ్రీనివాసపురాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి పనులు చేపట్టడం హర్షించదగ్గ విషయమని తహసీల్దార్ నరసింహులు, మండల టీడీపీ నేత ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం శ్రీనివాసపురం గ్రామంలో రోడ్ల వెంట మొక్కలునాటే కార్యక్రమాన్ని ఎస్‌ఐ హేమాద్రి చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఉన్నతస్థాయి ఉద్యోగులంతా సేవా దృక్పథంతో ఉంటూ, ఆయా గ్రామాల అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. శ్రీనివాసపురం అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములం అవుతామన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శ్రీనివాసపురాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అందరి సహకారం అవసరమన్నారు. గ్రామాన్ని 100 శాతం పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ఎక్కడా చెత్త బయటవేయకుండా కుప్పతొట్లను ఏర్పాటు చేయడంతో పాటు, వీధుల్లో చెట్లు నాటించి, ప్రజలు కూర్చొనేందుకు అక్కడక్కడా బెంచీలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామం జాతీయ రహదారి పక్కన ఉన్న కారణంగా ఒక బస్సుషెల్టర్‌ను కూడా ఏర్పాటు చేయిస్తామని గ్రామస్తులు తాగునీటి కోసం ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారని, దానిని కూడా ఉన్నతాధికారులతో చర్చించి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, టీడీపీనేతలు రవీంద్రనాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ తహసీల్దార్

బి.కోడూరు, డిసెంబరు 30 : మండల కేంద్రమైన బికోడూరులో శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీలను ఎంపీడీఓ మల్లయ్య, తహసీల్దార్ దుగ్గిరెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాలెండర్, డైరీల యందు ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అవసరమైన విలువైన సమాచారం ఉందని తెలిపారు. అలాగే ఎస్టీయూ మండల అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డీఏ, పీఆర్సీల బకాయిలు కొత్త సంవత్సరం కానుకగా ఉద్యోగులకు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, కుమార్‌బాబు, మనోహర్‌రెడ్డి, సత్యప్రవీన్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

బద్వేలు	
శేఖర్	: ఒక్కక్షణం
నౌషాద్	: ఎంసీఏ
లక్ష్మీనరసింహ	: హలో
పోరుమామిళ్ళ	
వెంకటేశ్వర	: హలో
దేశాయి	: ఎంసీఏ

చౌడూరు చౌక దుకాణంపై విచారణ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు30: చౌడూరులో ఉన్న చౌక దుకాణం డీలరు సుబ్బారెడ్డిపై పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో సుబ్బారెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డి ప్యూటీ తహసీల్దారు తాజుద్దీన్, ఎస్‌ఐ కృష్ణారెడ్డి శనివారం తనిఖీ చేశారు. అంత్యోదయ కార్డులకు వచ్చే చక్కరను పం పిణీ చేయడం లేదని కార్డుదారులపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ నిర్వహించారు. ఆదివారం కూడా విచారణ కొనసాగుతుందని ఎస్‌ఐ తెలిపారు.

నందిని కాంప్లెక్స్ క్రమబద్ధీకరణ అనుమతులు చెల్లవు

● వైసీపీ ఫ్లోర్‌లీడర్ మురళి ఫిర్యాదు

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు 30: ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని దేవాదాయ శాఖకు చెందిన మిట్టా పాపయ్య సత్రం స్థలంలో నిర్మించిన నందిని కాంప్లెక్స్ నిర్మాణం అక్రమ పద్ధతుల్లో సాగిందని ఈ అక్రమ నిర్మాణాన్ని బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) కింద క్రమబద్ధీకరిస్తూ టౌన్‌ప్లానింగ్ ఇచ్చిన అనుమతులు చెల్లవని మున్సిపల్ వైసీపీ ఫ్లోర్‌లీడర్ మురళీధర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మున్సిపల్ మేనేజర్ దేవయానికి ఫ్లోర్‌లీడర్ మురళీధర్‌రెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిని కాంప్లెక్స్ నిర్మాణాల్లో అడుగడుగునా అవినీతి, అక్రమాలు, నాణ్యత లోపాలు, అనుమతుల ఉల్లంఘనలు జరిగాయని, 2011లోనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఇచ్చిందన్నారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని సిఫార్సు చేసిందన్నారు. అనుమతులు ఇచ్చిన అధికారులపై నిర్మాణసంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలిపిందన్నారు. విజిలెన్స్ నివేదికపై ఎటువంటి చర్యలు తసుకోకుండా అక్రమ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించడం తీవ్ర తప్పిదమన్నారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోకుండా అక్రమ నిర్మాణాన్ని క్రమబద్ధీకరణచేయడంపై టౌన్‌ప్లానింగ్ అధికారులపై చట్టపరమైన చర్యలకు అందరూ బాధ్యులవుతారన్నారు.

గాడితప్పిన పురపాలన

● కౌన్సిల్‌లో టీడీపీ, వైసీపీ సభ్యుల ధ్వజం
● చేనేత పింఛన్లపై వైసీపీ సభ్యుల నిలదీత
● కమిషనర్‌పై టీడీపీ కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు


సమావేశంలో వాదులాడుతున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు30: ప్రొద్దుటూరులో పురపాలన వైఫల్యం చెందిందని, ఇందుకు పాలకమండలి అధికారులు ఇద్దరి బాధ్యత వహించాలని టీడీపీ, వైసీపీ సభ్యులు కౌన్సిల్‌లో ధ్వజమెత్తారు. శనివారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం ఉదయం 11 గంటలకు చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో బడ్జెట్‌లో జమా ఖర్చులపై టీడీపీ, వైసీపీ సభ్యుడెవ్వరు మాటాల్డకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కౌన్సిల్ సభ్యులకు బడ్జెట్‌పై కనీస అవగాహన లేదని స్పష్టమైంది. ఒక్క ఏడాది కాలంలో మున్సిపాలిటీలో జరిగిన జమా ఖర్చులుపై ప్రజాప్రతినిధులుగా ప్రజాధనం ఖర్చులపై బాధ్యతాయుతమైన చర్చ చేపట్టవలసి ఉంది. కానీ అలాంటి చర్చలేకుండా కేవలం కౌన్సిల్ సభ్యులు వారి వారి అజెండాపై మాత్రమే సభలో అధికారులు చైర్మన్‌లపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. వైసీపీ ఫ్లోర్‌లీడర్ మురళీధర్‌రెడ్డి, కౌన్సిలర్ రాచమల్లు రమాదేవిలు 77 మంది చేనేత కార్మికుల పింఛన్లు మంజూరైనవి ఎందుకు వెనక్కు పంపారని సభలో వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. కేవలం చేనేతలను అణగదొక్కే ప్రయత్నంలో భాగంగానే పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. ఇందుకు చైర్మన్ రఘురామిరెడ్డి స్పందిస్తూ 77 మంది చేనేతల పింఛన్లను నిబంధనల ప్రకారం వెళ్లినందున అవి పంపిణీ చేయడంలో ఆలస్యమైందన్నారు. జనవరిలో పంపిణీ చేస్తామన్నారు. రాజకీయం చేయవద్దన్నారు. కమిషనర్ శేషన్న సమాధానమిస్తూ కొన్ని ప్రొసీజర్స్ గ్యాప్స్ వల్ల పంపిణీ చేయలేకపోయామన్నారు. 77 మంది జాబితాను ప్రభుత్వంకు పంపామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో జనవరిలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాంతో సంతృప్తి చెందని ఫ్లోర్‌లీడర్ మురళీధర్‌రెడ్డి , కౌన్సిలర్ రమాదేవిలు కమిషనర్ శేషన్నను ఆయన సీటు వద్దకెళ్లి నిలదీశారు. చైర్మన్ అసమర్థత వల్ల చేనేతలకు ఇబ్బందికి గురిచేస్తారా అని విమర్శించారు. దీంతో వైస్‌చైర్మన్ జబివుల్లా, టీడీపీ కౌన్సిలర్ మార్కాపురం బాబులు మాట్లాడుతూ చేనేత పింఛన్లు మంజూరు చేసింది టీడీపీ ప్రభుత్వమని, వైసీపీ అవసరమైన దుష్ప్రచారం చేస్తున్నదన్నారు. చేనేతల్లో 77 మందికేకాక మరో 149 మందికి కూడా అందుతాయన్నారు. 77 మంది చేనేత పింఛన్లు వైసీపీ వాళ్లు దొం గగా తెచ్చుకున్నారని ఆరోపించారు. దీంతో వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాదులాట జరిగింది. చేనేతలను మోసగాళ్లని చెబుతారా అని రమాదేవి తీవ్రంగా ఆగ్రహించారు.

కమిషనర్‌పై టీడీపీ కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు

సభలో కమిషనర్ శేషన్నపై టీడీపీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రొద్దుటూరుకు వచ్చేటప్పుడే నాశనం చేయాలని అనుకొని వచ్చావా అని సీతారామిరెడ్డి కమిషనర్ శేషన్నపై ఆగ్రహించారు. 40 మంది కౌన్సిలర్లలో పది మంది కమిషనర్ బాగా పనిచేస్తున్నాడని పలికించు అని సవాల్ విసిరారు. పనులు చేసేటప్పుడు అభ్యంతరాలు పెట్టరు, బిల్లులు చెల్లింపులకు అభ్యంతరాలు పెడతారా మీ వల్ల చైర్మన్‌కు చెడ్డపేరు వస్తున్నదని ధ్వజమెత్తారు. ఇందుకు కమిషనర్ శేషన్న సందిస్తూ ఇంజినీరింగ్ సెక్షన్‌లో అధికారులు లేరు నేనేం చేయాలి, నేను నోరు తెస్తే బాగుండదని అందరూ ఇబ్బందులు పడతారని కమిషనర్ తీవ్రంగా హెచ్చరించారు. వ్యక్తిగతంగా నీవు అని సంబోదిస్తే దాడి చేయడం సీతారామిరెడ్డికి తగదన్నారు.

● కౌన్సిలర్ సునంద మాట్లాడుతూ రెండేళ్లుగా 32వ వార్డులో 62 లక్షల పనులకు కనీసంటెండర్ పిలువకపోవడం ఏమిటన్నారు.

● తలారి పుల్లయ్య మాట్లాడుతూ 3వ కాలనీలో అంబేద్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలని సంవత్సరాలుగా విజ్ఞప్తిచేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. రాజ్యాంగ నిర్మాణంను అవమానపరచడమేనన్నారు. సభలోబడ్జెట్ అంశాలపై చర్చించకనే సభ ముగించారు.

వైవీ యూనివర్శిటీ క్రికెట్ టీంకు ప్రొద్దుటూరులో శిక్షణ


కోచ్‌తో వైవీ యూనివర్శిటీ క్రికెట్ టీం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: జనవరి మూడవ తేదీ నుండి విజయనగరం జి ల్లాలో జరిగే అఖిలభారత విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో పాల్గొననున్న యోగి వేమన యూనివర్శిటీ క్రికెట్ టీంకు ప్రొద్దుటూరులో శిక్షణ ఇస్తున్నారు. యూత్ క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో 14 మంది టీం సభ్యులకు ఏబీఎం స్కూల్ గ్రౌండ్‌లోని వైసీసీ క్రికెట్ పిచ్‌లపై ఈనెల 27 నుండి శిక్షణ ఇస్తున్నారు. కోచ్ రమణ శిక్షణ ఇస్తున్నారు. టీం సభ్యులకు జార్జ్ కారోనేషన్ క్లబ్‌లో వసతి ఏర్పాటు చేసినట్లు యోగివేమన యూనివర్శిటీ ఫిజికల్ డైరెక్టర్ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. బౌలింగ్ యంత్రంతో వివిధ పిచ్‌లపై బ్యాటింగ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

చేనేతలు మోసగాళ్లని మాట్లాడటం అహంకారం-రాచమల్లు


ఎమ్మెల్యే దీక్షను విరమింపచేస్తున్న సాధు గోపాలకృష్ణ

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు30: చేనేతలు మోసగాళ్లని, దొంగలని టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడటం దారుణమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చేనేతల పింఛన్ల పంపిణీ కోసం ఎమ్మెల్యే చేపట్టిన రిలే నిరాహార దీక్ష మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేతల ఓట్లతో కౌన్సిలర్లు అయిన వాళ్లు వరద అనుచరులు చేనేతలపై దొంగలని వ్యాఖ్యలు చేయడం వారి అహంకారానికి, అజ్ఞానానికి నిదర్శనమన్నారు. వరదరాజులరెడ్డి నోటి దురుసు ఆయన అనుచర కౌన్సిలర్లకు కూడా సోకిందన్నారు. 2019లో ఈ చేనేతలే టీడీపీకి రాజకీయ సమాధి కడతారన్నారు. వరదరాజులరెడ్డి రాజకీయ అధికారం పెత్తనానికి 2018లోనే ముగింపు జరగనుందన్నారు. ఆ తర్వాత వరద గడ్డిపోచ విలువకు కూడా సరితూగడన్నారు. ఇప్పటికైనా వరద, ఆయన అనుచర కౌన్సిలర్లు నోటిని, బుద్దిని అదుపులో పెట్టుకోవాలన్నారు. 77 మంది చేనేతల పింఛన్లకు సంబందించి స్పష్టమైన ప్రకటన కలెక్టర్, కమిషనర్ నుండి లిఖితపూర్వకంగా లేనందునే ఈ దీక్షలు కొనసాగిస్తున్నామన్నారు. ఒకటి నుండి ఏ రోజు వారికి పింఛన్లు పంపిణీ చేసినా దీక్షలు ముగిస్తామన్నారు. సాయంత్రం అయిదు గంటలకు ఎమ్మెల్యేకు ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సాధు గోపాలకృష్ణ పండ్లరసం అందించి దీక్షను విరమింపచేశారు. పట్టణ వైసీపీ అధ్యక్షులు చిప్పగిరిప్రసాద్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మురళీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు శివకుమార్‌యాదవ్, టప్పా గైబూసా, పోసా వరలక్ష్మి, యామిని, గోన సరస్వతి, రమాదేవి, కృష్ణవేణి, రాగులశాంతి, వైసీపీ నేతలు బలిమిడి చిన్నరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

సగర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు30: స్థానిక సగర కులసంఘం కార్యాలయంలో శనివారం ఆసంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళి మాట్లాడుతూ సగర కులాన్ని బీసీఏలో చేరుస్తామన్న హామీని ప్రభుత్వం కొత్త సంవత్సరంలోనైనా నిలబెట్టుకోవాలన్నారు. సగర కులస్థులు సంఘటితంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దచంద్రాయుడు, రమణ, రామలింగయ్య, పార్థసారధి, వెంకటేషు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో...

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన సంవత్సర కాలెండర్‌ను ఆవిష్కరించారు. శనివారం సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు సందు శివనారాయణ, ప్రధాన కార్యదర్శి బొర్రా రామాంజనేయులు ఆధ్వర్యంలో కాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో బీసీలు అభివృద్ధి సాధించాలని, ప్రజలందరికి శుభం జరగాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు సుబ్బరామయ్య, చెంద్రాయుడు, కార్యదర్శులు భాస్కర్‌రావు, జయప్రకాష్, కోశాధికారి వెంకటకృష్ణయాదవ్, సభ్యులు జి.సి.పుల్లయ్య, సంటెయ్య, శంకర్, లక్ష్మినారాయణ, దేవానంద్, జయరాం పాల్గొన్నారు.

గీతాంజలి హైస్కూలులో...

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: గీతాంజలి హైస్కూలులో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థులందరికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి మాట్లాడుతూ 2018 సంవత్సరంలో విద్యార్థులు పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.

టీడీపీకి ఓట్లేయడమే చేనేతలు చేసిన నేరమా?

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత గొర్రె శ్రీనివాసులు

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు30: తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుండి చేనేతలు టీడీపీకి ఓట్లేయడమే వాళ్లు చేసిన నేరమా అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొర్రె శ్రీనివాసులు విమర్శించారు. శనివారం స్థానిక చౌడేశ్వరీనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గొర్రె శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ 25 ఏళ్ల వరదరాజులరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించడమే చేనేతలు చేసుకున్న పాపమన్నారు. 77 మంది చేనేత కార్మికులకు మంజూరైన పింఛను సొమ్మును అందించకుండా వరదరాజులరెడ్డి తన అహంకారాన్ని సంతృప్తిపరచుకోవడానికి అడ్డుకున్నారన్నారు. మూడు నెలలు వరుసగా పెన్షన్ తీసుకోనివ్వకుండా చేస్తే వాటంతట అవే రద్దవుతాయనే కుట్రతో మూడు నెలల పింఛను పంచకుండా వరదరాజులరెడ్డి అడ్డుకున్నారన్నారు. చేనేత పింఛన్ల పంపిణీ అంశాన్ని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఇంత రాజకీయం చేయడం అవసరమా, ఇది ఎమ్మెల్యేగా రాచమల్లుకు తగునా అన్నారు. వరదరాజులరెడ్డి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పౌరుషాలకు, పట్టింపులకు చేనేతకార్మికులే దొరికారా అని విమర్శించారు. వీరిరువురి వల్ల చేనేతలే నష్టపోతున్నారన్నారు. పంపిణీ చేయకపోవడానికి మున్సిపల్ కమిషనర్ శేషన్న, చైర్మన్ రఘురామిరెడ్డి, కలెక్టర్ బాబురావునాయుడులు బాధ్యత వహించాలన్నారు. జనవరి 2న ఏడు మంది చేనేతలకు పింఛను పంపిణీ అంశాన్ని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఇంత రాజకీయం చేయడం అవసరమా అని, ఇది ఎమ్మెల్యేగా రాచమల్లుకు తగునా అన్నారు. వరదరాజులరెడ్డి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పౌరుషాలకు, పట్టింపులకు చేనేత కార్మికులే దొరికారా అని విమర్శించారు. వీరిరువురి వల్ల చేనేత లే నష్టపోతున్నారన్నారు. పంపిణీ చేయకపోవడానికి మున్సిపల్ కమిషనర్ శేషన్న, చైర్మన్ రఘురామిరెడ్డి, కలెక్టర్ బాబురావునాయుడులు బాధ్యత వహించాలన్నారు. జనవరి 2న 77 మంది చేనేతలకు పింఛను పంపిణీ చేయకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గోసంగి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నజీర్ బాష, కార్యదర్శి శ్రీధర్, యువజన అధ్యక్షుడు ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి 'జన్మభూమి'

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 30: జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి తెలిపారు. 2వ తేదీన పందిళ్లపల్లె, 3న కుర్నూతల, 4న కస్తూరాజుగారిపల్లె, 5న దిన్నెపాడు, 6న దప్పేపల్లె, 7న పాలెంగొల్లపల్లె, 8న బీ.యర్రగుడి, 9న కాకులారం, 10న చౌటపల్లె, అనంతపురం, 11న లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం అందాలి

● వంద పడకల ఆసుపత్రి సాధనకు కృషి ● నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న రమేష్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 30: గ్రామీణ ప్రాంత రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడడంతో పాటు పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ప్రస్తుతం ఉన్న 50 పడకల నుంచి వందపడకల ఆసుపత్రి సాధనకు తమ వంతు కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మన ఆసుపత్రిని మనమే అభివృద్ధి చేసుకోవాలని, అలాగే ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. ఆసుపత్రిలో త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని కూడా ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో ఇక్కడ పేద ప్రజలకు వైద్యసేవలు అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. పార్టీ నాయకులు గానే కాకుండా మానవతా దృక్పథంతో ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పడతామన్నారు. ప్రభుత్వాసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు, ఆదుకునేందుకు అభివృద్ధి కమిటీ ఎంతో దోహదపడుతుందన్నారు. ఆసుపత్రికి సమయపాలనలో హాజరు కాని వైద్యులు, ఇతర సిబ్బంది పట్ల అభివృద్ధి కమిటీ చొరవ తీసుకుంటుందన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎస్‌కే హుస్సేన్, సభ్యులుగా నాగభూషణాచారి, ఆంజనేయులుగుప్త ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ దాదాసాహెబ్, మార్కెట్ యార్డు చైర్మన్ గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జగన్‌మోహన్ రాజు, రోటరీక్లబ్ అధ్యక్షుడు సయ్యద్ అస్రఫ్ అలీ ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి సుజాత, ఉపాధ్యక్షురాలు నసీబ్‌జాన్, కార్యనిర్వాహక కార్యదర్శి మస్తాన్‌బీ, పట్టణ ప్రధాన కార్యదర్శి ముస్తాక్‌హుస్సేన్, పట్టణ మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగవేణి, లక్ష్మీదేవి, పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కొప్పల గంగిరెడ్డి, కౌన్సిలర్ రషీద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హారూన్‌బాషా, ప్రభుత్వ న్యాయవాది జక్రియాబాషా, ప్రభుత్వ వైద్యుడు నిస్సార్ అహమ్మద్, కంటి వైద్యుడు రెడ్డెన్న, టీడీపీ నాయకులు గురవయ్య, అశోక్, మహబూబ్‌అలీఖాన్, మతీన్, గ్రంధీగంగాధర్, సత్యారెడ్డి, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి


సంక్రాంతి కానుకలను అందిస్తున్న రమేష్‌రెడ్డి

రామాపురం, డిసెంబరు 30: సంతోషంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్రాంతి కానుక అందజేస్తున్నారని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బండపల్లె గ్రామం పొత్తు కూరివల్లెలో చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, క్రిష్ణారెడ్డి, సదిపిరాళ్ల వెంకట్రామిరెడ్డి, సుకుమార్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, నారాయణ, శ్రీనివాసులరెడ్డి, వీరనాగయ్య, సర్పంచ్ వెంకట్రమణయ్య, డీలర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పేదలకు వరం


చంద్రన్న బీమా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, డిసెంబరు 30: చంద్రన్న బీమా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు వరం లాంటిదని మార్కెట్ యార్డు చైర్మన్ గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బేతల్‌కాలనీలో నివాసం ఉంటున్న షేక్ పరీషా సహజ మరణానికి మంజూరైన రూ.2 లక్షల చంద్రన్న బీమాలో భాగంగా వారి కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. మిగిలిన మొత్తం ఆమె కుమారుడి బ్యాంకు ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘం సభ్యురాలు లక్ష్మీదేవి, బీమా మిత్రలు మౌనిక, చంద్రహాసిని పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్తు

రాయచోటిరూరల్, డిసెంబరు 30: దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని ఎన్జీవో సంఘం మాజీ రాష్ట్ర నేత చింతం వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భారతీయ యువత అనే పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ యువత పెడదోవ పడితే సమాజం కూడా గాడి తప్పుతుందన్నారు. యువత స్వామి వివేకానందుడి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నముక్కపల్లె సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిల్వీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వందపడకల ఆసుపత్రి కోసం నిరంతర ఉద్యమం


రోగుల సమస్యలను తెలుసుకుంటున్న దృశ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 30: రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని వంద పడకలుగా ఏర్పాటు చేసేంతవరకు నిరంతర ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి విశ్వనాథ్, సహాయ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏఐటీయూసీ వెంకటేసు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా రాయచోటి ప్రభుత్వాసుపత్రిని వందపడకలకు పెంచుతామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప చేసిందేమీ లేదన్నారు. వందపడకల ఆసుపత్రితో పాటు రోగులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేసి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా వైద్య అధికారులు సరైన సౌకర్యాలు లేని ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ లీడర్లు మస్తాన్‌బీ, మజహర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్ తరగతులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 30: ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎంసెట్‌లో ర్యాంకు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని ఏడీ ఉష పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆమె ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి బాలికల వసతులు, వంటను పరిశీలించి రాత్రికి అక్కడే బస చేశారు. అన్ని వసతులు బాగున్నాయని కితాబిచ్చారు. ఆదర్శ వసతి గృహాల్లో చదివే విద్యార్థినులకు కార్పొరేట్ కళాశాలలో కూడా ఇలాంటి వసతులు లేవని, ప్రభుత్వం అన్ని సదుపాయాలను కల్పించిందని తెలిపారు. అనంతరం శనివారం ఉదయం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఎంసెట్ కోచింగ్ ఇవ్వాలని, విద్యార్థులకు మంచి విద్యను అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. అలాగే ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత చదువులు చదవాలన్నారు. ఇంటర్, పదో తరగతికి పరీక్షలు సమీపిస్తున్నాయని, ప్రతి విద్యార్థి కష్టపడి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్చనా విద్యాసంస్థల క్యాలెండర్లు ఆవిష్కరణ

రాయచోటి టౌన్, డిసెంబరు 30: 2018 సంవత్సరానికి సంబంధించి అర్చనా విద్యాసంస్థల క్యాలెండర్లు, డైరీలను ఆ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరంలో విద్యార్థులతో పాటు ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్చనా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి, విద్యా సంస్థల ఏవోలు నారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి, అర్చనా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, పీడీ మహేష్, అధ్యాపకులు మహేశ్వర, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కరస్పాండెంట్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

పండ్లతోటల నీటి తడులకు రూ.60.73 లక్షల మంజూరు

● రెండు రోజుల నుంచి రైతుల ఖాతాలకు నగదు జమ

గాలివీడు, డిసెంబరు 30: మండలంలో గత వేసవిలో ఎండిపోతున్న మామిడి తోటలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీటి తడులను అందించినందుకు ప్రభుత్వం రూ.60.73 లక్షలు మంజూరు చేసినట్లు ఉద్యానవన అధికారిణి వనిత పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలో 800 మంది రైతులకు గాను 600 హెక్టార్ల పండ్ల తోటలకు నీటి తడులు అందించామన్నారు. ఈ నీటి తడులు అందించడంలో అయిన ఖర్చులో 20 శాతం రైతులే భరించాల్సి ఉందని, మిగిలిన 80 శాతం ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎకరా పండ్ల తోటలకు నీటి తడులు అందించినందుకు రూ.2,400 ప్రకారం రైతులకు ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల కోసం నిత్యం పోరాటం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీ

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 30: రైతు సమస్యల కోసం ఏపీ రైతు సంఘం నిత్యం పోరాటం చేస్తోందని వ్యవసాయ సహాయ సంచాలకులు దివాకర్ పేర్కొన్నారు. శనివారం రైతు సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంఘం ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా పోరాటాలు చేస్తూ వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారని, పంటల బీమా, ఇతర విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ రైతు సమస్యల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకుడు మద్దిలేటి, సీఐటీయూ రాయచోటి కార్యదర్శి రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

సీపీయం నియోజకవర్గ ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా రామాంజులు

రాయచోటిటౌన్, డిసెంబరు 30: సీపీయం రాయచోటి నియోజకవర్గ ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా అబ్బవరం రామాంజులును నియమించారు. శుక్రవారం ఎన్జీవో హోంలో జరిగిన నియోజకవర్గ స్థాయి మహాసభ సందర్భంగా సీపీయం జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా అబ్బవరం రామాంజులు, సభ్యులుగా భాస్కర్, శివరాం, లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రామాంజులు మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టతను పెంచడానికి కృషి చేస్తామన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీ లేని పోరాటం

చిన్నమండెం, డిసెంబరు 30: ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ రాజీలేని పోరాటం చేస్తున్నదని పీఆర్‌టీయూ మండల బాధ్యుడు మధుసూదన్ పేర్కొన్నారు. చిన్నమండెం విద్యావనరుల కేంద్రంలో శనివారం 2018 పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఎంఈఓ శివానాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు నాగరాజు నాయక్, వాలి నాయక్, రమేష్, బోనాలరెడ్డెప్ప, శ్రీరాములు నాయక్, రమణయ్య నాయక్, రమణయ్య, నారాయణ నాయక్, లక్ష్మీప్రసాద్‌రాజు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శివానాయక్

రూకవారిపల్లెను పట్టించుకోండి..!

రైస్‌మిల్లులతో తప్పని ఇబ్బందులు ● దోమలతో సతమతం ● కదలని మురుగు

కడప రవీంద్రనగర్, డిసెంబరు 30 : కడప నగరంలోని కార్పొరేషన్ పరిధిలో ఉన్న రూకవారిపల్లె స్థానికులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. రూకవారిపల్లెలోని డోరు నెం.80/12 నెంబరు ఇంటి వద్ద మురుగునీరంతా నిలబడిపోయి తీవ్రమైన దుర్గం ధం వెదజల్లుతోంది. మురుగు కాల్వలు సరిగా లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు పారుతోంది. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కువగా స్కూ ళ్ల దగ్గర రైస్ మిల్లులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పొట్టు గాలికి ఎగిరి వచ్చి కళ్లలో పడుతోందని వాపోతున్నారు. రూకవారిపల్లెలో రోడ్లు కూడా చాలా అధ్వానంగా ఉన్నాయి. గుంతలు గుంతలుగా తయారైంది. పైగా మంచినీరు కూడా సక్రమంగా రావడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతిరోజూ ఉప్పునీళ్లే తాగాల్సిన దుస్థితి పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా దోమలు కూడా విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని, పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇళ్ల ముందర మురుగు నిలబడిపోతుండడంతో విపరీతమైన దుర్వాసన భరించలేకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాకుండా ఉందని అంటున్నారు. దీని వల్ల తాము అనేక వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా వారు పట్టించుకోవడంలేదని పేర్కొంటున్నారు.


నిలిచి దుర్వాసన వస్తున్న మురుగునీరు
అధ్వానంగా ఉన్న మట్టిరోడ్డు


పొట్టును వెదజల్లుతున్న రైస్‌మిల్లు

ఇంటి ముందరే మురుగు...



మురుగు కాల్వలు లేకుండా ఉండడంతో ఇళ్ల ముందరే మురుగు పారుతోంది. దీంతో తీవ్రమైన దుర్వాసన వస్తోంది. పైగా దోమలు కూడా ఎక్కువవుతున్నాయి. అధికారులు వెంటనే మురుగుకాల్వలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

● జయలక్షుమ్మ, స్థానికురాలు

రైస్ ఫ్యాక్టరీల వల్ల పొట్టు కళ్లలో పడుతోంది



రూకవారిపల్లెలో రైస్‌మిల్లు ఉండడం వల్ల తినే తిండి లో, తాగేనీటిలో పొట్టు పడుతుంది. కళ్లలో కూడా పడుతోంది. దీంతో కళ్లకు ఇబ్బందులు వస్తున్నాయి. వెంటనే రైస్‌మిల్లులు ఇక్కడ నుంచి తీసివేయించాలి.

● సరళ, స్థానికురాలు

177వ రోజుకు ఉక్కుదీక్షలు


దీక్షలు ప్రారంభించి మాట్లాడుతున్న ఉలేమా అలేమా మత గురువు మహ్మద్ ఆలీ

కడప రవీంద్రనగర్, డిసెంబరు 30 : కడప ఉక్కు కోసం ఆర్‌సీపీ ఆధ్వర్యంలో చేస్తున్న ఉక్కు నిరాహార దీక్షలు శనివారంనాటికి 177వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఉలేమా అలేమా మత గురువు మహమ్మద్ ఆలీ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలని అన్నారు. ఈ దీక్షల్లో అంకాలమ్మ, రుక్మిణమ్మ, సుబ్బయ్య, గులాబ్‌జాన్, గంగయ్య, రమణ, వీరయ్య, సుబ్బారావు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐదో విడత జన్మభూమి - మా వూరును విజయవంతం చేయాలి

కడప కలెక్టరేట్, డిసెంబరు 30 : జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు జనవరి 2 నుంచి 11 వరకూ జరిగే ఐదో విడత జన్మభూమి, మావూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.ఖాదర్‌బాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వీధి విద్యుత్‌దీపాల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, పారిశుధ్య కార్యక్రమాలు వివరించాలన్నారు. అలాగే మురుగునీటి పారుదలను, జియోట్యాగ్ చేసే వివరాలను, డిజిటల్ పంచాయతీ సేవలు, అర్బన్ మిషనరీ ప్రాముఖ్యతను నివేదికల్లో పొందుపరచాలన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్ల వివరాలను, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను,వర్మీకం పోస్టు వివరాలు, స్మార్ట్ గ్రామాలుగా రూపొందించిన సెవెన్‌స్టార్ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనను జన్మభూమి కార్యక్రమంలో ప్రజలకు వివరించాల్సి ఉందన్నారు. గ్రామసభల్లో ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేసేలా పంచాయతీ అధికారులు కృషి చేయాలన్నారు. జన్మభూమి కార్యక్రమం ముగిసిన తరువాత ప్రజా ఫిర్యాదులు, తగు చర్యలపై నివేదికలు, ఫొటోలను జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి పంపాల్సి ఉందని డీపీవో పేర్కొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లుల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 30 : నేడు (ఆదివారం)సెలవు దినమైనా విద్యుత్ బిల్లులు స్వీకరిస్తామని ఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల్లో బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ మనుగడకు సహకరించాలని ఆయన సూచించారు.

ఉద్యోగికి నష్టం చేసే ప్రతి పనినీ వ్యతిరేకిస్తాం

హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తాం : రవిశంకర్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30 : ఉద్యోగికి నష్టం చేసే ప్రతి పనినీ వ్యతిరేకిస్తామని మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎన్.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. తమ హక్కుల సాధనకు నిరంతరం పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కడపనగరం కార్పొరేషన్ రెవెన్యూ విభాగం కార్యాలయం ఆవరణలో శనివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట పరిధిలో లేని పనులు తమతో చేయించాలని రాజకీయ నాయకులు వత్తిడి తేవద్దని తెలిపారు. కార్పొరేషన్‌కు నష్టం కలిగించే చర్యలు తమతో చేయించవద్దని సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఐఎంఏ హాలులో మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అనే నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశామన్నారు. ఎంసీఈయూ అధ్యక్షుడు ఎస్ఎండీ గౌస్‌పీర్, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, రవిబాబు, సంయుక్త కార్యదర్శులు షకీల్ అహ్మద్, ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు భాస్కర్‌గౌడ్, కె.వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



శిల్పారామంలో నూతన సంవత్సర వేడుకలు

కడప కల్చరల్, డిసెంబరు 30 : ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని కడప శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పరిపాలనాధికారి కె.ఖాదర్‌వల్లి తెలిపారు. నేటి శ్రీ గురుకృప నృత్య ఆలయం, కడప వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రేపు బాబు జానపద బృందం, బద్వేలు వారిచే నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

నగరాభివృద్ధిపై ప్రభుత్వం వివక్ష

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30 : నగరాభివృద్ధిపై టీడీపీ ప్రభుత్వం పూర్తి వివక్ష చూపుతోందని మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. 24వ డివిజన్‌లో శనివారం రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా నిధులు మంజూరు చేయలేదన్నారు. కార్పొరేషన్ నిధులతోనే నగరం అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉషారాణి, బండి సరోజ. సిటీ కేబుల్ అధినేత సూర్యనారాయణ, చల్లా రాజశేఖర్, బండి బాబు తదితరులు పాల్గొన్నారు.

6,7న రాజకీయ శిక్షణ తరగతులు

కడప మారుతీనగర్, డిసెంబరు 30 : మాదిగల్లో రాజకీయ చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో వచ్చే జనవరి 6,7 తేదీల్లో నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు, నాయకులకు రాజకీయ శిక్షణ తరగతులు జరగనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాతంగి సుబ్బరాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీజీ గంగయ్య, రాష్ట ఉపాధ్యక్షుడు అట్లూరు సుబ్బరాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, నాయకులు, వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి రెడ్డయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

కడప రవీంద్రనగర్, డిసెంబరు 30 : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 48వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని పలు కళాశాలల వద్ద శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహ, నగర కార్యదర్శి పుల్లయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సురేష్, పవన్‌కళ్యాణ్, ఆకాష్, వెంకటేష్, గౌతం తదితర విద్యార్థులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పీవీసీ పైపుల కోసం దరఖాస్తులు చేసుకోండి

బి.కోడూరు, డిసెంబరు 30 : మండలంలోని రైతులు పీవీసీ పైపుల కోసం బి.కోడూరు వ్యవసాయ కార్యాలయం నందు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమున్న రైతులు పట్టాదారు పాసు బుక్కు జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, కరెంట్‌బిల్లు, ఫీల్డు మ్యాప్, రేషన్‌కార్డు, మూడు ఫొటోలు తీసుకొని వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పెన్షన్ పొందేందుకు అర్హత కావాలా !

- రూ. 1500 చెల్లించండి అర్హత సాధించండి
- నకిలీ కేంద్రాల ద్వారా వేలాది రూపాయలు దండుకుంటున్న వైనం

పెన్షన్ పొందేందుకు అర్హత కావాలా? ఆధార్‌కార్డు లో వయస్సు తక్కువగా ఉందని ఆందోళన చెందుతున్నారా? మీ పక్కింటివారికి పెన్షన్ వస్తుందని, మీకు రావడంలేదని చింతిస్తున్నారా? మీరు కూడా పెన్షన్ పొందడానికి అర్హత కావాలని భావిస్తున్నారా ? అయితే రూ.1500 చెల్లించండి టెన్షన్‌ను దూరం చేసుకోండి. పెన్షన్ వచ్చేందుకు అర్హత సాధించండంటూ ఆధార్‌కార్డులో వయస్సును మార్చేందుకు రేటు ఫిక్స్ చేశారు కొందరు.

పోరుమామిళ్ల, డిసెంబరు 30 : పోరుమామిళ్లలో ఓ బిల్డింగ్‌పైన రూములు అద్దెకు తీసుకొని కొందరు వయసు మార్పులు చేస్తూ, వేలాది రూపాయలు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గతంలో కూడా ఈ ఆరోపణలు చాలా వచ్చాయి. కానీ జనవరి 2వ తేదీ నుంచి 5వ విడత జన్మభూమి ప్రారంభం కానున్న తరుణంలో ఈ వ్యాపారం మరింత ఊపందుకుందనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు యువకులు పోరుమామిళ్లలో నకిలీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని, విషయం బయటకు పొక్కనీయకుండా గ్రామాల్లో రాజకీయ దళారులను ఏర్పాటు చేసుకొని రహస్యంగా వారి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పెన్షన్ పొందడానికి వయస్సును నిర్ధారించింది. అయితే ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో కొందరు తమకు పెన్షన్ రావడంలేదని, రేషన్‌కార్డు, ఆధార్ కార్డుల్లో వయస్సు తక్కువగా ఉందని ఆందోళనలు చెందుతున్న వారికి ఆశలు రేకెత్తించి వయస్సు మార్చేందుకు ధర నిర్ణయించి ఈ తతంగం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల మండలంలోని ఓ పంచాయతీకి చెందిన నాయకుని ద్వారా 22 మందికి సంబంధించిన రేషన్, ఆధార్‌కార్డుల్లో వయస్సు మార్చేందుకు పోరుమామిళ్లకువచ్చి వయస్సును తారుమారు చేసే వారితో ఒప్పొందం కుదుర్చుకున్నట్లు సమాచారం. కానీ వారికి కొద్ది రోజులు వ్యవధి కావాలి, మీరు అనుకున్నది చేస్తాం, వయస్సు మారుస్తామన్నట్లు సమాచారం. నెట్‌లో వయస్సు ఎక్కువగా ఉన్న రేషన్‌కార్డులో ఉన్న ఫొటోలను పోర్జరీచేసి వయస్సును సరిచేసి మరళా యథావిధిగా తాము ఒప్పొందం కుదుర్చుకున్నవారి ఫొటోలను మార్పుచేసి ఈ వ్యవహారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సంబంధిత అధికారులు ఇలాంటి వారిపై నిఘా ఉంచితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి.

ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రెడ్డెప్ప

బద్వేలు, డిసెంబరు 30 : ఇతరులకు ఇబ్బందులు కలకుండా నూతన సంవత్సర వేడుకలను ప్రజలు జరుపుకోవాలని బద్వేలు సీఐ రెడ్డెప్ప అన్నారు. శనివారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రహదారులపై పార్టీలు ఏర్పాటు చేయరాదని, అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా, ఇతరులకు ఇబ్బందులు కలిగేలా పెద్ద పెద్ద శబ్దాలతో మైకులు ఏర్పాటు చేసినా సహించేది లేదని, ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు లేకుండా విన్యాసాలు చేసినా, ఆ వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అసభ్యకరంగా ప్రవర్తించినా, మద్యం మత్తులో వాహనాలను నడిపినా చర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలికే వేడుకల్లో అర్ధరాత్రి హడావిడి చేస్తే కఠినచర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా యువకులు వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని, అలాగే యువకులు వాహనాలతో బయటకు రాకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. పట్టణంలో నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని, ప్రధాన నాలుగురోడ్ల కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చామని, అర్ధరాత్రి 12గంటల తరువాత ఎలాంటి దుకాణాలు ఉండరాదని ఆయన హెచ్చరించారు. ఒక వేళ పొరపాటున సీసీ కెమెరాల్లో గొడవలకు దిగినట్లుకానీ, అల్లరి చేష్టలు చేసినా సీసీ కెమెరాల్లో స్పష్టంగా తెలుస్తుందన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించి నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ చలపతి నాయుడు, రూరల్ ఎస్ఐ హేమాద్రిలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడాలి



ఫాతిమా మసీదులో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం నాయకులు

బద్వేలు టౌన్, డిసెంబరు 30 : రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడాలని ముస్లిం రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్ బాష, ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాన్ బాషా, బాదుల్లాలు పేర్కొన్నారు. సిద్దవటం రోడ్డులోని ఫాతిమా మసీదు నందు రాజమహేంద్రవరంలో హత్యకు గురైన కారణంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో నూరాని మసీదు నందు కొంత మంది దుండగులు రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో నిద్రిస్తున్న మతగురువు మౌజన్ మహమ్మద్‌షారూఖ్‌ను హత్య చేసి ముస్లిం మత గ్రంధాలైన ఖురాన్‌ను తగలబెట్టిన నీతిమాలిన చర్యలను, సంఘవిద్రోహ శక్తులను ఎవరైనను ప్రభుత్వం వెంటనే గుర్తించి వారిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని వారన్నారు.

ఇటువంటి భయంకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. చనిపోయిన మతపెద్ద కుటుంబానికి ఆర్థికసహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జహంగీర్ బాష, నూరుల్లా, షరీఫ్, ఎస్‌పే సత్తార్, అన్వర్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాశ్యతపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

కాశినాయన డిసెంబరు 30 : కాశినాయన మండలంలోని అమగంపల్లె గ్రామంలో శనివారం ఇటుకుళ్లపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రియాజ్‌బాషా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాశ్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులందరూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని, తీసుకున్న రుణాలను కూడా సకాలంలో చెల్లించాలన్నారు. ఇప్పటికే బ్యాంకు సేవలు డిజిటల్ విధానంలో ప్రజల వద్దకే వచ్చాయన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక లావాదేవీలు, ఏటీఎంకార్డుల వినియోగం, ఇన్సూరెన్స్ విధానాలు, బ్యాంకు రుణాల గురించి, రుణాలమాఫీ సంశయాలపై ప్రజలకు నివృతి చేశారు. ఈ కార్యక్రమంలో కళాజాతవారు నిర్వహించిన మ్యాజిక్ షో ఆకర్షించింది. కార్యక్రమంలో ఫీల్డు ఆఫీసర్ విజయబాబు, పలువురు బ్యాంకు సిబ్బంది, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల బలోపేతానికి యూనియన్లు కృషి చేయాలి

కాశినాయన, డిసెంబరు 30 : ఉపాధ్యాయ యూనియన్ల ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కాశినాయన మండల అధ్యక్షుడు పెద్దరామయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని వరికుంట్ల గ్రామంలో ఎస్టీయూ యూనియన్‌వారు ముద్రించి 2018 సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆ శాఖ మండల బాధ్యుడు మహబూబ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రఘురామిరెడ్డి, ఆర్థిక కార్యదర్శి మహేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వాకా చంద్రశేఖర్, ఇతర కార్యవర్గసభ్యులు నారాయణ, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి

అట్లూరు, డిసెంబరు 30 : మండలంలోని ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ మహమ్మద్ రఫి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31వ తేదీన యువకులు వాహనాలు తోలేటప్పుడు మద్యం సేవిస్తే వారిపై కఠిన చ ర్యలు తీసుకొని కేసులు నమోదుచేస్తామన్నారు.

సమాజంలో విద్యార్థులు బాధ్యతగా ప్రవర్తించాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 30 : నేటి సమాజంలో విద్యార్థులు బాధ్యతతో ప్రవర్తించాలని కడప రామక్రిష్ణమఠం నిర్వాహకులు అచిత్యానందస్వామి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వివేకానంద చైతన్యసమితి, కడప రామక్రిష్ణ మఠం వారి ఆధ్వర్యంలో విద్యార్థి చైతన్యంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాండురంగారెడ్డి బృందం

పోరుమామిళ్ల, డిసెంబరు 30 : 2018 నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని వెంకటేశ్వర ఇంగ్లీష్‌మీడియం స్కూలు కరెస్పాండెంట్ పాండు రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆ పాఠశాలలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో వచ్చే ఏడాది సాగిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్(257) క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాధికారి

కాశినాయన, డిసెంబరు 30 : మండల కేంద్రమైన నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంఈఓ బాలఓబయ్య, ఆశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి, మండల బాధ్యుడు శంకర్‌రెడ్డితో కలసి 2018 నూతన క్యాలెండర్, డైరీని విడుదల చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మా ట్లాడుతూ 16నెలల పీఆర్‌సీ బకాయిలు, రెండు డీఎలు, కరువు బత్యంను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డైలమాలో మందుబాబులు

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబర్ 30 : ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం మద్యం దుకాణాలను రాత్రి 12 గంటల వరకు, బార్‌లు అర్ధరాత్రి 1గంట వరకు తెరిచి ఉంచుకునేలా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మందుబాబులు ఖుషి అవుతున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు పోలీసు అధికారులు మద్యం తాగి బైక్‌లు నడిపితే కఠిన చర్యలంటూ హెచ్చరికలు జారీ చేయడంతో మందుబాబులు డైలమాలో పడిపోయారు. న్యూఇయర్ వేడుకలను మద్యం మత్తులో ఖుషీ చేసుకుందామని ప్లాన్ వేసుకుంటున్న మందుబాబులు, పోలీసు హెచ్చరికలకు భయపడి, మందు అలవాటు లేని స్నేహితులను లైన్‌లో పెట్టుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరిస్వామి పండుగ

జమ్మలమడుగు రూరల్, డిసెంబరు30 : జమ్మలమడుగులో దస్తగిరిస్వామి నెల సందర్భంగా 11వ రోజు శనివారం అన్ని దస్తగిరిస్వామి దర్గాల వద్ద పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జమ్మలమడుగులోని టీటీడీ కల్యాణ మండపం వెనుకభాగన వెంకటేశ్వర కాలనీ దస్తగిరిస్వామిదర్గా వద్ద రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో దస్తగిరిస్వామి జెండాను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు బాంగుండం గౌస్‌మోద్దీన్ ఇంటిలో ఏర్పాటు చేసిన విందుకు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆయన దస్తగిరిస్వామి దర్గాలో పాతెహాలు నిర్వహించారు అనంతరం విందులో పాల్గొన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముల్లాజానీ, గ్రంథాలయ చైర్మన్ రమణారెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి రామమోహన్‌రెడ్డి, పొన్నతోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రుతి మించితే కఠిన చర్యలు

● నూతన సంవత్సర వేడుకలపై సీఐ సదాశివయ్య హెచ్చరిక

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 31వ తేదీ రాత్రి పోలీసు సూచనల ప్రకారం నడచుకోవాలని, కాదని శృతి మించితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యు.సదాశివయ్య హెచ్చరించారు. ఎవరైనా శుభాకాంక్షలు చెప్పుకునే నేపంతో ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ముఖ్యంగా మహిళలను, యువతులను వేదింపులకు గురిచేసేలా బైక్‌ల్లో తిరుగుతూ హడావుడి చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీసు నిబంధలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. నూతన వేడుకల్లో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా పట్టణంలోను, శివారు బైపాస్‌లోను 20 పోలీసు టీంలను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే, ఆ వాహనంను సీజ్ చేయడంతో పాటు అతనిపై కేసు నమోదు చేసి, అధార్ లింక్ చేయడంతో అతని పూర్తి వివరాలను పోలీసు రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.


యు.సదాశివయ్య, అర్బన్ సీఐ

దీని వల్ల సదరు వ్యక్తి ఉద్యోగం, లేదా విదేశాలకు వెళ్లే క్రమం పాస్‌పోర్టు మంజూరులో ఇబ్బంది కలుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఊరుకోమన్నారు. అతి వేగంగా బైక్‌లు నడిపినా, త్రిపుల్ రైడింగ్ చేసినా, సైలెన్సర్ తీసేసి పెద్ద పెద్ద శబ్దాలతో బైక్‌ల్లో వెళ్లినా పట్టుకుని కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. బాణసంచా కాల్చడం, అశ్లీల నృత్యాలు నిషిద్ధమన్నారు. వేడుకల్లో ఎలాంటి అపశృతి జరుగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని, ప్రజలు, ముఖ్యంగా యువకులు పోలీసులకు సహకరించాలని సీఐ సదాశివయ్య విజ్ఞప్తి చేశారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ఎర్రగుంట్ల, డిసెంబరు29: ఎస్టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఎంఈవో బాలశౌరమ్మ శనివారం ఆవిష్కరించారు. నూతన సంవత్సర డైరీలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు మల్లురఘునాథరెడ్డి, బాద్యులు సుకుమార్, మస్తాన్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



గీతాపఠనంతో ఆధ్యాత్మిక చింతన

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: భాగవతం, భగవద్గీతలను పఠించడం వల్ల ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని ఎస్వీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.హరినారాయణ అన్నారు. శనివారం ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థుల కోసం భగవద్గీత, భాగవతం పుస్తకాలను ప్రిన్సిపల్‌కు భక్త నరేష్ అందించారు.

ఘన సన్మానం


సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మతత

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 30: సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ తరుపున పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకుగాను ఆ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డిని స్టేఫ్ సీఈవో మమత సత్కరించారు. శనివారం కడపలో జరిగిన యువమహోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాల్లో షిర్డ్ సొసైటీ ముందుండాలని చెప్పారు. కార్యక్రమంలో స్టేఫ్‌మేనేజర్ సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎర్రగుంట్ల, డిసెంబర్ 30: ఎర్రగుంట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వినాయకనగర్‌కు చెందిన హిమాం, జాన్‌లకు గాయాలయ్యాయి. వినాయకనగర్ నుంచి మోటార్‌బైక్‌పై ఆర్‌వోబీపైకి వెళుతుండగా ఆపుతప్పి వారు కిందపడ్డారు. వీరిద్దరు వినాయకనగర్‌కు చెందిన వారుగా స్థానికులు తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న పోలీసులు వారిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. అందులో ఒకరికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిసింది.

మిగులు నీటిని పెన్నాలోకి వదలాలి

ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్, డిసెంబరు30: జిల్లాలోని గండికోట, మైలవరం జలాశయాల్లో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉన్నందున పై నుంచి వచ్చే మిగులు నీటిని కిందికి పెన్నానదిలోకి వదలాలని తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రొద్దుటూరు మున్సిపల్ మాజీ చైర్మన్ ఉండేల గురివిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గండికోటలో సుమారు 8.50 టీఎంసీలు, మైలవరంలో సుమారు 6.32 టీఎంసీలు నీరు నిలువ ఉందన్నారు. వాటిలో ఇంతవరకు మించి నీరు నిల్వ పెట్టే పరిస్థితి లేదన్నారు. దీంతో అవుకు జలాశయం నుంచి జిల్లాలోని జలాశయాలకు శనివారం నుంచి నీటి విడుదలను ఆపారన్నారు. అలా కాకుండా అవుకు నుంచి నీటిని వదులుతూ, ఆ నీటిని మైలవరం నుంచి పెన్నానదిలోకి వదలాలన్నారు. ఈ నీటితో మైలవరం నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం ప్రాంతాల్లో అదినిమ్మాయపల్లె వరకు పెన్నానది పరివాహక ప్రాంతంలో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. గ్రామాల్లోనూ తాగునీటి పథకాలకు నీరు అందుతుందన్నారు. సాగునీటి బోర్లలోకి నీరు వస్తుందన్నారు. రబీ సాగు పంటలను కాపాడుకోవచ్చన్నారు. మైలవరంనుంచి కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. అందుబాటులోని నీటిని భూగర్భజలాల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిన్నటి వరకు ఎస్‌ఆర్‌బీసీ నుంచి 715 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ నుంచి 1400 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా శనివారం ఆపారన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో సుమారు 141.66టీఎంసీల నీరుందన్నారు. సీఎం చంద్రబాబుకు జలవనరుల శాఖమంత్రి ఉమామహేశ్వరావులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు గురివిరెడ్డి తెలిపారు.


ఉండేల గురివిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్

సంగమేశ్వర స్కూలులో న్యూ ఇయర్ వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: సంగమేశ్వర హైస్కూలులో 2018 నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ శివచంద్రారెడ్డి, కేక్ కట్ చేసి విద్యార్థులందరికి పంచిపెట్టారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుని పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్ తరగతులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 30: ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎంసెట్‌లో ర్యాంకు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని ఏడీ ఉష పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆమె ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి బాలికల వసతులు, వంటను పరిశీలించి రాత్రికి అక్కడే బస చేశారు. అన్ని వసతులు బాగున్నాయని కితాబిచ్చారు.

అంగన్వాడీలను పనిదొంగలుగా చూస్తున్న ప్రభుత్వం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు30: అంగన్వాడీ కార్యకర్తలతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం వారిని పనిదొంగలుగా చూడడం దారుణమని ఏపీ అంగన్వాడీ అసోసియేషన్‌జిల్లా కార్యదర్శి మంజుల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అర్బన్ ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలకు పల్స్ పోలియో, బీఎల్‌వో, ప్రభుత్వ పథకాల ప్రచారానికి ఉపయోగించుకుంటూ కూడా వారిని పనిదొంగలుగా చూడడం దారుణమని పేర్కొన్నారు. దీనిలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తోందన్నారు. మొదట అధికారులు, ప్రాజెక్టు కార్యాలయాల సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలు చేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో వారు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ సెంటర్ల విలీనంతో బాలింతలు, గర్భవతులు, చిన్నారులు సెంటర్లకు రావడంలేదన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణాధ్యక్షురాలు రమాదేవి, శారదా, మణి, విజయ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంజుల

నేటి నుంచి కేవలానంద స్వామిజీ ఆరాధనోత్సవాలు

రామాపురం, డిసెంబరు 30: మండల కేంద్రంలోని కేవలానంద లక్ష్మీనారాయణస్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 31, జనవరి 1వ తేదీన రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఆశ్రమంలో పలువురు భక్తులు మాత్భకావందనం, పతాకం, పురవీధుల్లో ఊరేగింపు అనంతరం స్వామిజీ సమాధికి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఉపన్యాసాలు, భజనలు, ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

రాయచోటి	9985411187
రాయచోటి టౌన్	9441794427
రాయచోటిరూరల్	9676860131
సంబేపల్లె	9703163108
గాలివీడు	9441049010
చిన్నమండెం	8886297090
లక్కిరెడ్డిపల్లె	8897095884
రామాపురం	9441079032

అమ్మవారిశాలలో తులసి పూజలు

చిన్నమండెం, డిసెంబరు 30: చిన్నమండెం శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ద్వాదశిని పురష్కరించుకొని తులసీదేవి పూజలు చేశారు. శనివారం సాయంత్రం నుంచే అమ్మవారిశాలలో పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు, వాసవీ మహిళామండలి సభ్యులు అక్కడికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజలు ముగిశాక తులసి చెట్టుకు ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమహిళలు, వాసవీ మహిళామండలి సభ్యులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

ఒక్క క్షణం ఆలోచించండి...

● చిన్నమండెం పోలీసుల వినూత్న ప్రచారం


బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

చిన్నమండెం, డిసెంబరు 30: మీరు ద్విచక్రవాహనంలో వెళుతున్నారా.. ఆటో నడుపుతున్నారా.. బస్సు డ్రైవరా, లారీ డ్రైవరా.. అయితే ఒక్క క్షణం ఆలోచించండి.. రహదారి భద్రతా సూత్రాలను పాటించండి... చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోండి. ప్రమాదాలు లేని సురక్షిత ప్రయాణం చేయండంటూ చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ సూచిస్తున్నారు. రహదారిలో ప్రయాణించే వాహన చోదకులను, ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ ప్రమాదకర మలుపులలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. ఈ ఫ్లెక్సీలలో వినూత్నంగా ఒక్క క్షణం ఆలోచించండి... సమయం విలువైనది... ప్రాణం అంతకంటే విలువైనది అంటూ ఫ్లెక్సీలలో పేర్కొన్నారు. ప్రమాదాలను అరికట్టడానికి ఇదో రకమైన హెచ్చరిక అంటున్నారు. రాయచోటి నుంచి కేశాపురం సరిహద్దు వరకు ప్రతి మలుపులో ఇలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పోలీసుల సూచనలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం.. విలువైన ప్రాణాలు కాపాడుకుందాం...


తూర్పుపల్లె వద్ద మలుపులో ఫ్లెక్సీ పెడుతున్న పోలీసులు

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

గాలివీడు, డిసెంబరు 30: రాష్ట్రంలో అన్ని రంగాల్లో పూర్తి స్థాయిలో వెనుకబడ్డ వడ్డెర కులస్తులను వెంటనే షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చుటకు చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర వడ్డెర సంఘం నాయకురాలు దేవర్ల రేవతిని వైసీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లెపు నాగేష్ కోరారు. శనివారం రాయచోటిలోని ఆర్అండ్బీ అతిథి గృహంలో ఆమెను కలిసి వడ్డెర్ల సమస్యలపై చర్చించారు. వడ్డెర్ల జీవితమంతా బావులు, చెరువులు తవ్వడం, భవనాలను నిర్మించడం వంటి బానిస బతుకులకే పరిమితమైందని, ఇలాంటి వడ్డెర్లను అన్ని రంగాలలో ఆదుకోవాల్సిందిగా కోరారు. వడ్డెర కులస్తులకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారిని సంచార జాతుల జాబితాలో చేర్చుటకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరారు. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల అధినేతలతో చర్చించి వడ్డెర కులస్తులకు న్యాయం జరిగేందుకు తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేశారు.


రాష్ట్ర నాయకురాలితో మాట్లాడుతున్న నాగేష్

ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరగాలి

- అర్బన్ సీఐ మహేశ్వర్‌రెడ్డి

రాయచోటి, డిసెంబరు 30: జనవరి 1వ తేదీ 2018.. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అర్బన్‌సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు రమేష్‌బాబు, మైనుద్దీన్, ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. శనివారం వారు మీడియా ప్రతినిధుల ద్వారా ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రజలు సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని, నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నూతన సంవత్సరం వేడుకలను చట్టపరిధిలో జరుపుకునే వారికి రక్షణ కల్పిస్తామన్నారు. అలా కాకుండా ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. అంతేగాక శృతి మించి అల్లర్లు చేసినా, సైలెన్సర్లు తీసేసి ద్విచక్ర వాహనాలు నడిపినా, అనుమతి లేకుండా ఆర్కెస్ట్రాలు ఏర్పాటు చేసినా, జూదం ఆడినా కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు.

నేడు స్పెషల్ డ్రంక్అండ్ డ్రైవ్

చిన్నమండెం, డిసెంబరు 30: డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి జనవరి 1 తెల్లవారి 5 గంటల వరకు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్, హెడ్‌కానిస్టేబుల్ మహేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 టీంలతో పాటు మొబైల్ టీంలను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి డ్రంక్అండ్‌డ్రైవ్‌పై టెస్టులు నిర్వహించడానికి జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షా సమయంలో వీడియో రికార్డు చేస్తారని, పట్టుబడిన వ్యక్తుల వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తుల సమాచారం ఆధార్‌తో అనుసంధానం చేయబడుతుందని తెలిపారు. ఈ సమాచారం మేరకు ఉద్యోగం, వీసా, పాస్‌పోర్టు జారీ, మిగతా విషయాల్లోను ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గమనించాలని వారు సూచించారు.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 30: మండలంలోని లక్కిరెడ్డిపల్లె పంచాయతీలోని నందివాండ్లపల్లెకు చెందిన విజయ్‌కుమార్ తన భార్య కనిపించలేదని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సురేష్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనకు 11 నెలల కుమారుడు ఉన్నాడని, పిల్లవాడు ఏడ్చుతున్నాడని, ఎక్కడున్నా తన భార్యను ఇంటికి చేర్చాలని ఆయన పోలీసులను ఆశ్రయించారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు తగదు

రాయచోటిరూరల్, డిసెంబరు 30: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు తగదని ప్రజా చైతన్యసేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ రఘునాథ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ (ఏపీఎస్ ఏసీఎస్) సహకారంతో శనివారం ప్రజా చైతన్యసేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ కార్మికులకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ తల్లి నుంచి బిడ్డకు రాకుండా కాపాడుకోవడానికి నెవరపిన్ మందు వాడాలని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రతి వ్యక్తి హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు చెన్నయ్య, గౌరవాధ్యక్షుడు అగ్గిరాముడు, ప్రధాన కార్యదర్శి రాంబాబు, వాసుదేవరెడ్డి, చక్రపాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా యాదవ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారం


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 30: రాయచోటి నియోజకవర్గ ప్రాంతంలోని యాదవులంతా సమష్టిగా సమస్యలను పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని ఎక్సైజ్ సీఐ రాంమోహన్ పిలుపునిచ్చారు. శనివారం వీరభద్రస్వామి ఆలయంలో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ (వైఈఎస్) నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఈఎస్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు యాదవ ఎంప్లాయిస్ సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైఈఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు నంద్యాల రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ, రాయచోటి డివిజన్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు ప్రభంజన్‌కుమార్, విద్యుత్ ఏఈలు దేవరాయలు, పదిలం మహేష్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కటారు శివప్రసాద్, యాదవ ఎంప్లాయిస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం

రామాపురం, డిసెంబరు 30: బ్యాంకు ఖాతాదారులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరమని ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని హసాపురంలో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు తమ ఆధార్, మొబైల్ నెంబర్లు బ్యాంకుకు అనుసంధానం చేసుకోవడం వల్ల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రధానమంత్రి సామాజిక భద్రత పథకం, ప్రధానమంత్రి బీమా యోజన, సురక్ష యోజన పథకాల గురించి వివరించారు. రూపే కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ పృధ్విరాజ్, బ్యాంక్ సిబ్బంది వినోద్, వినయ్, ఆంజనేయులు, నాగరాజ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలకు ఉపకార వేతనాలు

సంబేపల్లె, డిసెంబరు 30: మండలంలోని బొగ్గలవారిపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు దివ్యాంగుల పిల్లలకు సర్వశిక్షా అభియాన్ నుంచి ఉపకార వేతనం (ఎస్కర్ట్) మంజూరైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ నలమల రామాంజులు, రెడ్డెయ్య తెలిపారు. శనివారం విద్యార్థులకు ఉపకార వేతనం చెక్కులను అందజేశారు.

ఒక్కొక్క వికలాంగ విద్యార్థికి ఉపకార వేతనం కింద రూ.1,250 మంజూరైనట్లు తెలిపారు. అనంతరం పాఠశాల అభివృద్ధి, ఉత్తమ విద్యాబోధనలపై ప్రగతి అంశాలపై ఎస్ఎంసీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో సహోపాధ్యాయుడు రంజిత్‌నాయక్, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం




గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అట్టాడ బాబూజీ, బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ

కడప స్పోర్ట్స్, డిసెంబరు 30 : పోలీసుశాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఉండడానికి విధులతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ సూచించారు. శనివారం పోలీసు శిక్షణా కళాశాలలో పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పోలీసు గౌరవ వందనం స్వీకరించి, పోటీల్లో పాల్గొనేవారిని పరిచయం చేసుకుని ప్రారంభించారు. అనంతరం ముగింపు సమావేశం యువ పోలీసులనుద్దేశించి విధి నిర్వహణతో పాటు సమాజం సేవలో ముందుండి అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచించారు. అనంతరం బహుమతి ప్రదానం చేశారు. డీసీటీ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌డీ వెంకటేశ్వరనాయక్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, హైదరాబాదు స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు సాయిబాబా, రిజర్వుఇన్‌స్పెక్టర్ శ్రీశైలంరెడ్డి, స్పోర్ట్స్ కోచ్‌లు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్రలు చదవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసరెడ్డి, హాజరైన విద్యార్థులు

కడప కల్చరల్, డిసెంబరు 30 : విద్యార్థులు జాతి నిర్మాతలు. దేశ భవిష్యత్తు వారి మీద ఆధారపడి ఉంది. వారిలో శీల నిర్మాణం, క్రమశిక్షణ, బాధ్యతాయుత జీవనం అలవడాలంటే మహనీయుల జీవిత చరిత్రలు చదవాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ బండపల్లి ప్రతాప్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో పదో తరగతి విద్యార్థులకు రామాయణంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్‌జేడీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. డిప్యూటీ డీఈవో జిలానీబాష, ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య, ఉపాధ్యక్షుడు జీవీఎన్ సాయికుమార్, కార్యదర్శి జింకా శేఖర్, జిల్లా అధ్యక్షుడు పల్లాభాస్కర్, కార్యదర్శులు ఖాదర్‌బాష, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జానమద్ది భాషా సేవకుడు - ఒంటేరు

రామాయణంపై పోటీలు బహుమతి ప్రధానోత్సవానికి ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణంలో హనుమంతుడు ఎలా సేవ చేశాడో బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి జానమద్ది కృషి అలాంటిదన్నారు. ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్రఅధ్యక్షుడు అంకాల్ కొండయ్య మాట్లాడుతూ రామాయణంలోని ప్రతి పాత్ర మానవ జీవితానికి వర్తిస్తుందన్నారు. డిప్యూటీ డీఈవో జిలానీబాష రామాయణం ప్రపంచానికి గొప్ప సందేశమిచ్చిందని కొనియాడారు.

బహుమతులు ప్రదానం... రామాయణ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా బి.నరేంద్ర(జడ్పీ హెచ్‌ఎస్,అగడూరు), వి.చంద్రిత (జడ్పీహెచ్‌ఎస్,హిమకుంట్ల) మంజుల(గుడిపాడు) దక్కించుకున్నారు. పది మంది విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐదువేలమంది విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసిన ఉపాధ్యాయురాలు కె.సుధారాణిని అతిథులు సన్మానించారు. విశిష్ట అతిథిగా పుత్తా పుల్లారెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపం.. పంతులు గారు ..!



ఏడు రోడ్ల కూడలి చుట్టూప్రకాశం పంతులు విగ్రహం కన్పించకుండా కట్టిన ఫ్లెక్సీలు

నగరంలోని ప్రధాన కూడళ్లలో జాతికి సేవ చేసిన వారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏడురోడ్ల కూడలిలో ప్రకాశం పంతులు విగ్ర హాన్ని ఏర్పాటు చేశారు. అయితే నూతన సంవత్సరం మరికొన్ని సందర్భాల్లో ఫ్లెక్సీలు కట్టడంతో ఆయన కనిపించకుండా చేశారు. ఆ దారిన వెళ్లే వారు పాపం ప్రకాశంపంతులు కనబడకుండా చేశారంటూ వాపోయారు. అధికారులు ఇలాంటివి కూడళ్లలో విగ్రహాలకు అడ్డంగా ఫ్లెక్సీలు కట్టకుండా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఫొటో, ఆంధ్రజ్యోతి

మాసాపేట సర్కిల్ నుంచి డ్రైనేజీ ఏర్పాటు చేయండి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30 : నగరంలోని మాసాపేట సర్కిల్ నుంచి నక్కల గండి వరకు డ్రైనేజీని ఏర్పాటు చేయాలని డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా డిమాండ్ చేశారు. నగరంలో శనివారం 28వ డివిజన్‌లో ఇన్‌ఛార్జ్ కమీషనర్ జేసీ-2 శివారెడ్డి పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నక్కల గండి డ్రైనేజీ నిర్మాణం చేస్తే నగరంలో చాలా వరకు డ్రైనేజీ సమస్యలు పరిష్కారమవుతాయని జేసీ-2 దృష్టికి తీసుకెళ్లారు. జేసీ-2 స్పందిస్తూ సాధ్యమైనంత వరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘం కేలండర్ ఆవిష్కరణ

కడప కల్చరల్, డిసెంబరు 30 : దేవాంగ సంక్షేమ సంఘంకేలండర్‌ను జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నగరంలోని ఆల్మాస్‌పేటలో రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో జిల్లా అధ్యక్షుడు వీరభద్రయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌజన్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

కడప వినాయక్‌నగర్, డిసెంబరు 30 : రాజమండ్రిలో మసీదులో పనిచేస్తున్న మౌజన్‌ను హత్యచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆలిండియా ఇమామ్స్ కౌన్సిల్స్ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఇద్రీస్ డిమాండ్ చేశారు. శనివారం మౌజన్ హత్యకు నిరసనగా జిల్లాలోని ఇమాంలు శనివారం జోహర్ నమాజ్ అనంతరం ఏడురోడ్ల కూడలి వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరానీ మసీదులో మౌజన్‌గా పనిచేస్తున్న అతడిని కొంత మంది కిరాతకంగా కర్రలతో కొట్టి హత్య చేశారన్నారు. ఇలాంటి చర్యలు తిరిగి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు మౌలానా జాకీర్ హుసేన్, మత గురువులు షహమీరియా, రహిముల్లాఖాన్, గౌస్‌మౌల్వీ, రషీద్ మౌల్వీ, డీసీసీ ప్రెసిడెంట్ నజీర్ అహ్మద్, తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు అమీర్‌బాబు, కాంగ్రెస్ నాయకుబు గౌస్‌పీర్, బజాజ్ షోరూమ్ అధినేత అహ్మద్ బాష, అష్రఫ్‌అలీఖాన్ ముస్లింలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా కక్షిదారుడైన Branch Manager, Repco Home Finance, Kadapa వారి సూచనమేరకు ఈ బహిరంగ ప్రకటన జారిచేయడమేమనగా

నా కక్షిదారుని వద్దకు కడప మునిసిపల్ కార్పొరేషన్ ఊటుకూరు డో.నెం.3/241 నివాసి నంద్యాల రామమూర్తి కుమారుడు నంద్యాల శ్రీనివాసులు షెడ్యూలు ఆస్తికి 07-03-2012వ తేదిన Doc. No.1915/2012 ద్వార కొనుగోలు చేసినానని పై ఆస్థిపై రుణమును మంజూరు చేయవలసినదిగా కోరగా సదరు Link Documents లను పరిశీలింపగా కె.హసాన్‌సాబ్ గారు షేక్ రహిముబి గారికి 16-10-1998 వ తేదిన Doc. No.5133/1998 విక్రయము పొందిన ఒరిజనల్ డాక్యుమెంటు పోయినదని సదరు దస్తావేజు ఎంత వెదకినను దొరకలేనదని తెలుపడమైనది. కాబట్టి సదరు షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరము / ఆక్షేపణలు ఉన్న యెడల ఈ బహిరంగ ప్రకటన జారి చేసిన 10 దినములలోపల నాకు గాని లేక నా కక్షిదారునికి వద్దకాని లిఖిత పూర్వక అభ్యంతరములు / ఆక్షేపణలు తెలుపగలరు. అట్లు ఎవరి వద్దనుంచి అభ్యంతరములు / ఆక్షేపణలు రాని ఎడల నా కక్షిదారుడు షెడ్యూలు ఆస్తిపై రుణమును మంజూరు చేయుదరని ఈ బహిరంగ ప్రకటన.

షెడ్యూలు

కడప డి॥ కడప సబ్॥ డి॥ కడప మునిసిపల్ కార్పొరేషన్ మరియు ఊటుకూరు గ్రామపొలంలోని డోర్ నెం.3/241, 3/242 యిండ్లు వగైరాలకు నెంబరు వారి వివరం. సర్కారు పుంజి డి॥ నెం.380/1 ఎరు. య.1.05 సెంట్లపైక య. 0.06 సెంట్లు ఈ పైకి తూర్పు దిశన య 0.03 సెంట్లు లేక 0.09 హెక్టార్లు గల జాగాకు హద్దులు.

తూర్పు - వరసందు మరియు నందలూరు ఖాదర్ బాష యిల్లు, **పడమర** - హజీజీ గారి యిల్లు, **ఉత్తరం** - సానపురెడ్డి రామలింగారెడ్డి గారి భూమి, **దక్షిణం** - 15 లింకులు వెడల్పుతో రస్తాకు వదలిన జాగా.

ఈలోగా తూర్పు - పడమర 20.3 అడుగులు లేక 6.16 మీటర్లు. ఉత్తరం - దక్షిణం 64 అడుగులు లేక 19.54 మీటర్లు జాగా వైశాల్యం 145.2 చ॥గజములు.

D.V.S.Prasad, B.A., B.L.,
Advocate
D.No.13/55-1-1 Upstairs,Devaki Complex,
B.K.M.Street, KADAPA. Cell : 9000617630

టాటా ఏస్ ఢీ కొని స్కూటరిస్టు మృతి

మైదుకూరు, డిసెంబరు 30 : మండలంలోని వని పెంట వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి చెందాడు. మున్సిపల్ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన కసిరెడ్డి గంగయ్యగారి జయరామిరెడ్డి (51) పొలం పనుల నిమిత్తం స్కూటర్లో వెళ్తాండగా అటుగా వస్తున్న వాహనం ఢీ కొంది. దీంతో జయరామిరెడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా వాహనం డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి విచారిస్తున్నామని, మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ భూములను పంపిణీ చేయాలి

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 30 : మండలంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వ భూములను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జ్యోతిబసుప్రాంగణంలో సీపీఎం మండల 3వ మహాసభల సందర్భంగా పరిశీలకులుగా హాజరైనటువంటి జిల్లా కమిటీ సభ్యులు శివకుమార్, రాష్ట్రకమిటీ సభ్యులు నారాయణలు హాజరయ్యారు. ఈ 3వ మహాసభలు మండల సీపీఎం కార్యదర్శి గురివిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సభ్యుడు నారాయణ మాట్లాడుతూ మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ధనికులకు, బడాబాబులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, అయితే దళిత పేదప్రజలకు భూములను పంపిణీ చేయడంలో ఎందుకు ముందుకు రావడంలేదని వారు ప్రశ్నించారు. పేదలకు ప్రభుత్వ భూములైన 1702 ఎకరాలు పేదలకు ఇవ్వడంలో మాత్రం రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. గతంలో బ్రహ్మంగారిమఠం మండలంలోని పేద ప్రజలకు అసైన్మెంట్ కమిటీలో ఇచ్చిన భూములను సంవత్సరాలు గడుస్తున్నా వారికి స్థలాలను చూపించలేదని, ఈ ప్రభుత్వం పేదలకు ఏమి న్యాయం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో సోమిరెడ్డిపల్లె పంచాయతీలోని సీపీభావి రెవెన్యూ పొలంలో 2008లో ఇచ్చిన డి.పారం భూములు చూపకపోతే ఆందోళనచేసి భూములను సాధించుకుంటామన్నారు. అధికారులు పేదలకు అండగా ఉండకుండా రాజకీయనాయకులకు వత్తాసు పలకడం సరైందన్నారు. సీటీబాయి భూములపై పోరాటాలు నిర్వహించామని, భూములను ప్రభుత్వంవారు ఇచ్చేంత వరకు పోరాటాలను ఆపమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం వారు పేదలకు ఇవ్వాల్సిన భూములను వెంటనే ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు బోలా శ్రీరాములు, మండల కార్యదర్శి గురివిరెడ్డి, గోవింద్, దస్తగిరి, రమణ, గుర్రయ్య, రమణమ్మ, ప్రసాద్, ఆటో యూనియన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు నారాయణ, హాజరైన మండల సీపీఎం నేతలు

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ లక్ష్యం

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 30 : విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడి విద్యార్థులకు సౌకర్యాలను అందించడమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని డివిజన్ అధ్యక్షుడు జి.సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం బి.మఠం ఐదురోడ్ల కూడలిలో ఎస్ఎఫ్ఐ 48వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక జిల్లాపరిషత్తు హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సునీల్ కుమార్ మాట్లాడుతూ 1970 డిసెంబర్ 30 తేదీన ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు అలుపెరగని పోరాటం నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ, సుబ్బు, సిద్దు, ఆనంద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీల్‌కుమార్

సాధికారమిత్రలు సేవాభావంతో పనిచేయాలి

చాపాడు, డిసెంబరు 30 : సాధికార మిత్ర మహిళలు ప్రజలకుసేవా భావంతో పనిచేయాలని వెలుగు ఏపీఎం శ్రీహరి అన్నారు. వెలుగు కార్యాలయంలో సాధికార మిత్రలకు ఈనెల 27 నుంచి శనివారం వరకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధికార మిత్రలకు జీతాలు ఇవ్వడంలేదన్నారు. మండలంలో మొత్తం 870 డ్వాక్రా మహిళా సంఘాలు ఉండగా 471 మందిని ఎంపిక చేశామన్నారు. 35 మందికి ఒకర్ని చొప్పున ఎంపిక చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయేందుక సాధికారమిత్రలు కృషి చేయాలన్నారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుబ్బరత్న, సీసీలు హరి, విజయలక్ష్మి, గ్రామాల నుంచి వచ్చిన మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం శ్రీహరి

'మోసపూరిత పాలనకు చరమగీతం పాడాలి'

ఖాజీపేట డిశంబరు 30: రాష్ట్ర ప్రజలకు చంద్రబాబునాయుడు మాయమాటలు చె ప్పి అధికారంలోకి వచ్చారని... మోసపూరిత పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గుత్తికొట్టాలు, తుడుమలదిన్నె గ్రామాలలో శనివారం రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. సిపార్సులేనిదే పిం ఛన్లు, గృహాలు రాని పరిస్థితి దాపరించిందన్నారు. డ్వాక్రా రుణాలు, రైతు రుణమాఫీ, అంటూ రైతులను మహిళలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలన్నారు. తుడుమలదిన్నె ఎస్సీ కాలనీలో వాటర్ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు డి.జనార్థన్ రెడ్డి, డి.శ్రీనివాసులరెడ్డి, డి.గంగాధర్‌రెడ్డి, వై.క్రిష్టారెడ్డి, దస్తగిరిబాబు, శంకర్ రెడ్డి, కొండా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించాలి

దువ్వూరు, డిసెంబరు 30 : ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు ప్రజలకు అవగాహన కలిగించాలని, ఎప్పటికప్పుడు వెలుగు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని వివరించాలని వెలుగు ఏపీఎం జయరాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మహిళా సాధికార మిత్రాస్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు డ్వాక్రా ద్వారా మహిళలకు అందించే ప్రయోజనాల గురించి వివరించాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులకు పాలతో జీవనోపాధి

చాపాడు, డిసెంబరు 30 : గ్రామాలలోని రైతులు గేదెలు, ఆవులు పెంచుకుంటే వాటి ద్వారా వచ్చే పాలతో జీవనోపాధి సులభంగా సాగించవచ్చని ఎర్రగుంట్ల పశుసంవర్ధకశాఖ ఏడీ రమణారెడ్డి, మైదుకూరు ఏడీ ఖదీర్ బాష అన్నారు. చియ్యపాడు గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గర్భకోశ చికిత్సలు 16, సాదారణ చికిత్సలు 78, 31 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు చాపాడు పశువైద్య అధికారిణి గీతాప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ మురళి, గోపాలమిత్రలు రాజశేఖర్‌రెడ్డి, దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.


దూడలకు మందులు వేస్తున్న ఏడీ రమణారెడ్డి

ఎయిడ్స్‌పై అవగాహన ముఖ్యం

మైదుకూరు, డిసెంబరు 30 : అవగాహనతో కూడిన ఆచరణే ఎయిడ్స్‌కు మందు అని, ముఖ్యంగా అవగాహన ఉండాలని వైద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో సంతకు వచ్చిన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ కడప, ప్రొద్దుటూరులో మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు.

నాణ్యమైన పురుగుమందులు అమ్మాలి

ఖాజీపేట డిశంబరు 30 : కాయ కష్టం చేసే రైతులను మోసం చేయరాదని.. నాణ్యమైన పురుగుమందులు అమ్మాలని లేని యెడల కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి టి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఖాజీపేటలోని శ్రీసాయి పురుగుమందులు దుకాణంలో శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన పురుగుమందులు దుకాణాదారులు తప్పని సరిగా స్టాకు వివరాలు పొందుపరచాలన్నారు. ప్రతి దుకాణాన్ని పరిశీలిస్తామని తేడా వస్తే ఆ దుకాణంపై చర్యలు తీసుకొంటున్నామన్నారు. నకిలి మందులు విక్రయించడం చట్టపరమైన నేరమన్నారు. నకిలీ మందులు అమ్మిన దుకాణాదారునిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. ఖచ్చితంగా రైతులకు బిల్లులు అందించాలన్నారు.

పిచ్చి కుక్కదాడి : పలువురుకి గాయాలు

మైదుకూరు, డిసెంబరు 30 : పట్టణంలోని పలు వీధుల్లో ఓ పిచ్చి కుక్క పాదాచారులపై దాడి చేసింది. మూలబాట వీధి, శ్రీరామ్‌నగర్, హైస్కూల్ వెనుకవీధి, బాలికల వసతిగృహం, రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్క సైరవిహారం చేసింది. దారిన పోయే పాదాచారులు, బాల బాలికలను కరచింది. మూలబాట వీధికి చెందిన దాసరి సిద్విలాజ్, వెంకటసుబ్బయ్య, ప్రణీత తదితరులు కుక్కకాటుకు గురయ్యారు. కాగా కుక్కను చంపేందుకు స్థానికులు ప్రయత్నిచగా అది తప్పించుకొని తిరుగుతోంది. కాగా శనివారం రాత్రి కుక్క దాడి చేస్తుందనే ప్రజలు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

మైదుకూరు	
విజయ్	: సప్తగిరి ఎల్ఎల్‌బి
భారత్	: జవాన్
ఖాజీపేట	
రాజ్	: ఎంసీఏ
దువ్వూరు	
రాయల్	: నేనే రాజు నేనే మంత్రి

టీబీ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

దువ్వూరు, డిసెంబరు 30 : గ్రామీణ ప్రాంతాల్లో టీబీ వ్యాధిపట్ల నిర్లక్ష్యం చేయకూడదని స్థానిక వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆశాడే కార్యక్రమంలో భాగంగా దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది సమావేశం నిర్వహించారు. శ్వాసకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దగ్గు, జలుబులను నిర్లక్ష్యం చేయకుండా తగిన చికిత్సలు తీసుకోవాలన్నారు. లేకుంటే ప్రాణాపాయంగా మారవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షయవ్యాధి, వ్యాధి నిరోధక టీకాలు, అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. జనవరి రెండు నుంచి 11వ తేదీ వరకు జరిగే జన్మభూమి-మావూరు కార్యక్రమం, పల్స్‌పోలియో కార్యక్రమాల గురించి సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శివరామయ్య, వెంకటేశ్వర్లు, మోహనమ్మ, మునిస్వామి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

గండికోటకు పూర్తిగా తగ్గిన నీటి ప్రవాహ వేగం

కొండాపురం, డిసెంబరు 30: గండికోట ప్రాజెక్టుకు వచ్చే నీటి ప్రవాహవేగం రెండు రోజుల నుంచి పూర్తిగా తగ్గింది. శనివారం ప్రాజెక్టు వద్దే నీటి ప్రవాహవేగం 500 క్యూసెక్కులు మాత్రమేఉంది. కాగా ఔట్‌ఫ్లో 1650క్యూసెక్కులు ఉంది. ఇందులో సీబీఆర్‌కు మూడు మోటర్ల ద్వారా 1500క్యూసెక్కుల నీటిని, సర్వరాయసాగర్‌కు 150క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఎస్‌ఈ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోటలో 8.1టీఎంసీల నీరు నిల్వ ఉంది. రెండు మూడు రోజుల నుంచి దాదాపు 0.2క్యూసెక్కుల నీరు తగ్గింది.

14వ రోజూ కొనసాగిన కాంట్రాక్టు కార్మికుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఎర్రగుంట్ల, డిసెంబర్ 30: ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వందలాది మంది శనివారం ఉదయం న్యూగేటు వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాలు 14వ రోజుకు చేరుకున్నాయి. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. 3వ తేదీన ప్లాంటులో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏజేసీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి, దేవగిరిరెడ్డి, నారాయణరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుల మాట మరిచారా?

మైలవరం, డిసెంబరు30: జమ్మలమడుగు-తాడిపత్రి ప్రధాన రహదారిలోని చిన్నకొమెర్ల, తలమంచిపట్నం, వద్దిరాల, గ్రామ సమీపాన పలుచోట్ల రోడ్డు గుంతలమయంగా మారిందని, పలు చోట్ల కల్వర్టులు దెబ్బతింటున్నా మరమ్మతులు చేయడం మరిచారా అని స్థానికులు తెలిపారు. రాత్రిపూట వెళ్లే సమయంలో గుంతలుగా ఉన్న చోట్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రస్తుతం ఈ రోడ్డు వెంట భారీ వాహనాలు వెళ్తున్నాయన్నారు. తలమంచిపట్నం వద్ద కల్వర్టులు దెబ్బతినగా అధికారులు మట్టిపోసి గుంతను పూడ్చారని దీంతో మళ్లీ కల్వర్టు దెబ్బతింటుందని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు రోడ్డుకు గుంతలు పడిన చోట్ల మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

రంగనాయకుల వనంలో భక్తులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ముద్దనూరు: స్థానిక వనంలోని రంగనాయకుల ఆలయంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి పర్వదినం మరుసటి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పరిపాటి. శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే రంగనాయకుల స్వామికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

2 నుంచి జన్మభూమి కార్యక్రమాలు

ముద్దనూరు: జనవరి 2వ తేదీ నుంచి 11 వరకు అన్ని గ్రామ పంచాయతీలో జన్మభూమి కార్యక్రమాలు జరుగనున్నట్లు ఎంపీడీఓ మనోహర్‌రాజు తెలిపారు. జనవరి 2 వ తేదీ బొందలకుంట, మాదన్నగారిపల్లె, 3 వతేదీ చింతకుంట, తిమ్మాపురం, 4న కొలవలి, ఓబులాపురం, 5వ తేదీ కొర్రపాడు, పెనికెలపాడు, 6వ తేదీ మంగపట్నం, ఆర్జీపల్లె, 7 వతేదీ ముద్దనూరు, 8వ తేదీ శెట్టివారిపల్లె నల్లబల్లె, 9 వతేదీ చిన్నదుద్యాల, దేనేపల్లి, 10 వతేదీ ఉప్పలూరు, యామవరం, 11 వ తేదీ వేల్పుచర్ల గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలు ఉంటాయని ఎంపీడీఓ వివరించారు.

జొన్న పంట ఇన్సూరెన్స్‌కు క్యూకట్టిన రైతులు

జమ్మలమడుగు రూరల్: జొన్నపంట సాగు చేసిన రైతులు ఇన్సూరెన్స్ కట్టేందుకు శనివారం ఉదయం అన్ని గ్రామాల నుంచి రైతులు పరుగులు తీశారు. ఉదయం 9 నుం చే జిరాక్స్ సెంటర్లు, నెట్ సెంటర్ల వద్ద రై తులు సంబంధిత పత్రాలతో నిలబడ్డారు. జొన్న పంట ఇన్సూరెన్స్ బ్యాంకులో చెల్లించేందుకు శనివారం చివరి రోజు అని అధికారులు చెప్పడంతో రైతులు బ్యాంకుల చుట్టూ నిలబడ్డారు.

2 నుంచి 11 వరకు పెన్షన్ల పంపిణీ

జమ్మలమడుగు, డిసెంబరు30: జన్మభూమి-మావూరు కార్యక్రమం సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో సామాజిక పెన్షన్లు వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేతలకు జనవరి 2వ తేదీ నుండి 11వ తేదీ వరకు జన్మభూమి కార్యక్రమంలో వార్డుల వారీగా పెన్షన్లు పంపిణీ చేస్తామని ఈసందర్భంగా కమిషనర్ లక్ష్మీరాజ్యం తెలిపారు.

బీజెఎంఎం మండల అధ్యక్షుడిగా పామిడి వీరయ్య

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు30: భారతీయ జనతా మజ్దూర్ మోర్చా మండల అధ్యక్షుడిగా చౌరెడ్డిపల్లెలో ఉండే పామిడి వీరయ్య యాదవ్‌ను ఆవిభాగం జిల్లా అధ్యక్షుడు భూమిరెడ్డి వెంకటభాస్కర్‌రెడ్డి నియమించారు. ఈ కార్యక్రమంవలో ఆవిభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కొండాపురం, డిసెంబరు 30: వాల్మీకి (బోయ) సంఘం నూతన క్యాలెండర్‌ను కొండాపురం ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి ఆర్ఐ రాజేశ్వరమ్మలు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వెప రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మునీంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకిలను అన్ని రంగాల్లో ముం దుకు తీసుకెళ్లేందుకు తమవంతు కృషిచేస్తామని, కొత్త సంవత్సరంలో అందరు సుఖసంతోషాలతో ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండాపురం గౌరవ అధ్యక్షులు నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి చిన్నవీరయ్య, బెడుదూరు సర్పంచు లక్షుమయ్య, గురునాథ, శ్రీనివాసులు, పుల్లయ్య, వెంకటరాముడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



మైలవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

మైలవరం, డిసెంబరు30: ఎస్‌ఎఫ్ఐ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఎస్‌ఎఫ్ఐ జమ్మలమడుగు డివిజన్ కార్యదర్శి డేవిడ్‌రాజు అన్నారు. శనివారం ఎస్‌ఎఫ్ఐ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని దొమ్మరనంద్యాలలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ దొమ్మరనంద్యాల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు తరగతి గదులను మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకిచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్, మెస్‌ఛార్జీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, హాస్టళ్ల సొంత భవనాలు, ఏర్పాటు చేయాలన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలకు సామగ్రి వితరణ



ముద్దనూరు డిసెంబర్ 30: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు దాతలు పలు వస్తువులు వితర చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి తెలిపారు. ఎర్రగుంట్ల సూర్యట్రాన్స్‌పోర్టు అదినేత ఎస్.వి.ప్రసాద్‌రెడ్డి రూ.20వేలు చేసే బల్లలు, కుర్చీలు, ప్రొద్దుటూరుకు చెందిన జి.జ్ఞానదీప్‌రెడ్డి, ,జె. హర్షిత్‌రెడ్డి బల్లలు, కర్చీలు, ప్రొద్దుటూరు లింగాపురం కు చెందిన జె.సాంబశివారెడ్డి వాటర్ ట్యాంకు అందించినట్లు సుధారాణి తెలిపారు. ఇంకా దాతలు పాఠశాల అభివృద్ధికి సహాయ ,సహకారాలు అందించాలని ఆమె కోరారు.

మద్యం దుకాణానికి 19 దరఖాస్తులు

వేంపల్లె, డిసెంబరు 30: వేంపల్లెలో 5వ మద్యం దుకాణానికి 19 మంది దరఖాస్తు చేశారని పులివెందుల ఎక్సైజ్ ఎస్ఐ శశిధర్ తెలిపారు. ప్రస్తుతం వేంపల్లెలో నాలుగు దుకాణాలు ఉండగా జిల్లాలో మిగిలిన దుకాణాల్లో ఒక మద్యం షాపును వేంపల్లెకు కేటాయించారు. ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తు గడువు శనివారం ముగిసింది. అయితే మరో దుకాణం వస్తే తమకు నష్టం జరుగుతుందని హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, 2వ తేదీన షాపును లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని ఎస్ఐ తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం కోసం చేయూత


సీఎం సహాయ నిధి చెక్కును బాధితునికి అందిస్తున్న సతీష్‌రెడ్డి

పులివెందుల టౌన్, డిసెంబరు 30: పేదలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి నుంచి వచ్చే నిధులు కాసింత చేయూత నిస్తుందని శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి తెలిపారు. ఓ పర్యటనలో పులివెందులకు వచ్చిన ఆయన కార్యక్రమం అనంతరం పులివెందుల పట్టణం బ్రాహ్మణపల్లె రోడ్డులో నివాసముంటున్న ఖాదర్‌వల్లికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హేమాద్రిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ తూగుట్ట మధుసూదన్ రెడ్డి, జన్మభూమి కమిటీ సభ్యులు పుచ్చా ప్రసాదరెడ్డి, రామాంజనేయులు, కౌన్సిలర్ నాగరాజు, బీమా మిత్ర సునిత, మైనార్టీ ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాల్గొన్నారు.

2వ వార్డులో నివాసముంటున్న కొమ్మెర రాము శనివారం మృతిచెందాడు. ఈయన చంద్రన్న బీమా కింద పేరు నమోదు చేసుకోగా, ఆయన అంత్యక్రియల కోసం తక్షణ సాయం కింద ఆయన భార్య గంగాదేవికి రూ. 5వేలు అందించినట్లు పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాష పేర్కొన్నారు. రాముకు రూ. 2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. త్వరలో రాము భార్య గంగాదేవి అకౌంట్లో జమ అవుతుందని ఆయన తెలిపారు.

లింగాలలో...

లింగాల, డిసెంబరు 30: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహృదయంతో ఆర్థిక సాయం చేస్తున్నారని శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి తెలిపారు. వేంపల్లె, వేముల మండలాలకు చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అర్హులకు ముఖ్యంగా ఉదారంగా సహాయం చేస్తున్నారన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి, జబ్బుబారిన పడిన వారు కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స చేయించుకున్నా ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. నీటి సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ బాలస్వామిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు షబ్బీర్, వేముల ఓబయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'చైతన్య' లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

▶▶ అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తదితరులు

వేంపల్లె, డిసెంబరు 30: వేంపల్లె చైతన్య హైస్కూల్‌లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు శనివారం నిర్వహించారు. డిసెంబరు 31 ఆదివారం జనవరి 1వ తేదీన పాఠశాల సెలవు కావడంతో విద్యార్థులతో ముందస్తుగా వేడుకలు చేస్తున్నారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ఎండీ చేతన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పాఠశాల ఆవరణలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు వేసిన నెమలి ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఉపాధ్యాయులకు మెరుగైన సేవలందించాలి


ఎమ్మార్సీ భవనంలో ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

చక్రాయపేట, డిసెంబరు 30: సమాజంలో బాధ్యతతో కూడిన పదవిని అలంకరిస్తున్న ఉపాధ్యాయులకు మెరుగైన సేవలు అందించాలని ఎంఈఓ రవీంద్రనాయక్ తెలిపారు. శనివారం ఎమ్మార్సీ భవనంలో ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆ బాధ్యత అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ ఒక పాఠశాలను దత్తత తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సేవలు అందించాలంటే మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పెండింగ్ పీఆర్సీని, డీఏ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ రంగారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మునిరెడ్డి, రీజనల్ కన్వీనర్ పవన్‌కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ఓబుళరెడ్డి, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

2 నుంచి వేంపల్లెలో జన్మభూమి-మాఊరు

వేంపల్లె, డిసెంబరు 30: మండలంలో జనవరి 2వ తేదీ నుంచి 5వ విడత జన్మభూమి-మాఊరు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి, పశువైద్యశాఖ ఏడీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్ల ఆధ్వర్యంలో రోజూ రెండు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 2వ తేదీన గిడ్డంగివారిపల్లె, ముతుకూరు, 3న బక్కన్నగారిపల్లె, రామిరెడ్డిపల్లె, 4న టి వెలమవారిపల్లె, నాగూరు, 5న తాళ్లపల్లె, అలవలపాడు, 6న పాములూరు, అయ్యవారిపల్లె, 7న ఇడుపులపాయ, 8న కత్తలూరు, 9న కుమ్మరాంపల్లె, 10న అలిరెడ్డిపల్లె, 11న వేంపల్లె పంచాయతీలో జన్మభూమి-మాఊరు గ్రామ సభ జరుగుతుందని తెలిపారు.

పులివెందులలో...

పులివెందుల టౌన్, డిసెంబరు 30: పులివెందుల మున్సిపాలిటీలో జనవరి 2వ తేదీ నుంచి జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. 2వ తేదీన 1, 18, 19వ వార్డుల్లో, 3న 2,3 వార్డులు, 4న 20,21,25 వార్డులు, 5న 16,17,8,9 వార్డులు, 6న 13,14,15 వార్డులు 7న 4వ వార్డు, 8న 22, 23,24వ వార్డులు, 9న 11వ వార్డు, 10న 5,6,7,26 వార్డులు, 11న 10,12వార్డుల్లో జన్మభూమి - మాఊరు నిర్వహిస్తారన్నారు.

గ్రామ పచ్చదనమే దేశ స్వచ్ఛదనం



వైఎస్సార్ కాలనీలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చక్రాయపేట, డిసెంబరు 30: గ్రామ పచ్చదనమే దేశ స్వచ్ఛదనమని ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ కోటేశ్వరి పేర్కొన్నారు. గండికొవ్వూరు గ్రామం ఓబుళనాయునిపల్లె, వైఎస్సార్ కాలనీలను ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు దత్తత తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఐదు రోజులుగా గ్రామంలోని వివిధ కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్ కాలనీలో పిచ్చిమొక్కలు తొలగించడం, మురికికుంటలు పూడ్చడం, మొక్కలు నాటడం, మొక్కలకు నీరుపోయడం, పరిశుభ్రత చేయడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఐదు రోజులుగా గ్రామంలో దాదాపు 50 మంది విద్యార్థులతో స్వచ్ఛభారత్ చేపడుతూ వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ మొక్కలు నాటితే భవిష్యత్తు తరానికి దిక్కులుగా నిలుస్తాయని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ పచ్చదనంగా తయారు చేయాలని కోరారు. ఎప్పుడైతే గ్రామం స్వచ్ఛంగా ఉంటుందో అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. స్వచ్ఛభారత్‌పై గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి దానిని దత్తత తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామాయణంలో ప్రతిభ చూపిన చంద్రిక


ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న చంద్రిక

సింహాద్రిపురం, డిసెంబరు 30: ఎస్ఎల్‌టీ సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో కడపలో జరిగిన 'రామాయణం, జీవన విలువలు' పై జరిగిన టాలెంట్ టెస్ట్‌లో హిమకుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని వి చంద్రిక (బి చెర్లోపల్లె) ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచింది. దీన్ని పురస్కరించుకుని ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి నుంచి చంద్రిక ప్రశంసాపత్రం అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల తెలుగు పండిట్ రామాంజనేయులు, హెచ్ఎం రామకృష్ణయ్య, విద్యార్థిని తండ్రి శివానందరెడ్డి, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

చిత్రావతిలో 4.50టీఎంసీల నీరు


చిత్రావతి డ్యాంలో సగానికిపైగా వచ్చిన నీరు

లింగాల, డిసెంబరు 30: చిత్రావతి డ్యాంలో ప్రస్తుతం 4.50టీఎంసీల నీరు వచ్చి చేరింది. కొండాపురం నుంచి పది రోజులుగా మూడు మోటార్ల ద్వారా రోజుకు 1400క్యూసెక్కుల నీరు వస్తోంది. నాలుగో మోటార్ కూడా త్వరలో సిద్ధం చేసి దాని ద్వారా కూడా నీటిని మళ్లిస్తామని అధికారులు తెలిపారు. చిత్రావతిలో ఎన్నడూ లేని విధంగా 4.50టీఎంసీల నీరు వచ్చి చేరడంతో ఇంతటి నీరు ఎప్పుడూ చూడలేదని అక్కడకు వచ్చిన వారంతా చెబుతున్నారు. మరో రెండేళ్ల తాగు, సాగునీటికి ఎటువంటి కష్టాలు ఉండవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేంపల్లె, డిసెంబరు 30: వేంపల్లె-గండి మార్గమధ్యలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు గాయపడ్డారు. చక్రాయపేట మండలం సిద్దారెడ్డిగారిపల్లె వాసి రామాంజనేయులు బైకుపై వస్తుండగా రోడ్డు మధ్యలో వడ్లు ఆరబోసి రాళ్లు ఉంచడంతో ప్రమాదానికి గురయ్యాడు. దీంతో ముఖంపై, తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆవుదూడ మృతి

లింగాల, డిసెంబరు 30: బొడ్డుచావిడి సమీపంలో ఆవుదూడ శనివారం మృతిచెందింది. ఆ ఆవుదూడను కుక్కలు పీకుతుండడంతో ఆ మార్గంలో వెళ్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు రఫ్తుల్లా చూసి పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. మృతిచెందిన ఆవుదూడను కుక్కలబారిన పడకుండా పంచాయతీ సిబ్బంది వచ్చే వరకు వేచిచూసి ఆవుదూడ మృతదేహాన్ని అప్పగించారు. పాపాఘ్ని నదిలో ఖననం చేయాలని పంచాయతీ సిబ్బందిని కోరారు.